




ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

వెల 4 అణాలు ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY 17-5-19






కృష్ణా - పెన్నార్ ప్రాజెక్టు

పై చిత్రం కృష్ణ ఆనకట్టకు ఇగనైపులా వుండే కొండలు — మధ్య చిత్రాలు : పరిశో నిమిత్తం జరుగుతున్న తవ్వ పనులు — క్రింది చిత్రం : కర్నూలువద్ద వున్న హింద్రీలాకులూ — అడుగు చిత్రం : తుంగభద్ర వంతెన.



సంవత్సరచందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు


ప్రతిబుధవారము ప్రకటింపబడును.

ఒరులేయవియొనరించిన నరవర! యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్.
(మహాభారతము)


Founder : K. NAGESWARA RAO.

సంపుటము **42**
సంచిక **37**

విక్రృతి సంవత్సర జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి బుధవారము



కాశ్మీర్ లోయలోని సుందరసీను 'గుల్మార్గ్'



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ మే నెల 17-వ తేది బుధవారము

కమ్యూనిస్టుముప్పు

కమ్యూనిస్టుముప్పునిర్మూలనకంటే ఈనాడు ఈ రాష్ట్రానికి ముఖ్యమైన సమస్య మరొకటి లేదని రాష్ట్ర కాంగ్రెస్‌సంఘం చేసిన తీర్మానంతో ఏకీభవించని వారు బహుకొద్దిమందిమాత్రమే ఉండవచ్చు. అయితే ఆ ముప్పునిర్మూలనకు రాష్ట్రకాంగ్రెసు చేసిన సూచనలపై అంతటి ఏకాభిప్రాయము ఉన్నట్లు కన్పించదు.

రాష్ట్రప్రభుత్వం ఈ ముప్పునిర్మూలనకు చాలా కఠినమైనచర్యలు తీసుకొంటూఉండవచ్చును. అనేకమంది కమ్యూనిస్టులను పోలీసులు కాల్చివేసి ఉండవచ్చును. కొందరువ్యక్తులను హతమార్చినందువల్ల ముప్పునిర్మూలనము సాధ్యమనే దురభిప్రాయమే రాష్ట్రప్రభుత్వము, కాంగ్రెస్‌సంఘములు అనుసరిస్తున్న విధానాలకు కారణం. కేంద్రప్రభుత్వం ఈ కల్లోలితప్రాంతాల్లో సైనికచర్యలు జరిపినప్పటికీ అసలుసమస్య పరిష్కారం కాదు.

అరాచకశక్తుల నిర్మూలనకు కఠినమైన చర్యలు తీసుకొనవలసినదే. ఈ చర్యలు అటు హైదరాబాద్ సంస్థానమునకూ, ఇటు సంస్థానసరిహద్దున ఉన్న చెన్న రాష్ట్రజిల్లాలకూ వ్యాపించిఉన్నందున కేంద్రప్రభుత్వం ప్రమేయం కల్గించుకొనుట అవసర మగుచున్నది. ఇటు చెన్న రాష్ట్రప్రభుత్వమూ, అటు హైదరాబాద్ సంస్థాన ప్రభుత్వముకూడా ఈ ముప్పును నిర్మూలించుటలో ఎంత సహకరించినా, ఉభయప్రభుత్వాల అధికారులూ ఎన్ని పర్యాయములు సంప్రతించుకున్నా కల్లోలితప్రాంతములో ఏక విధానాన్ని అనుసరించడం, అమలుజరపడం సాధ్యంగాదు. ఆదృష్ట్యానే మే మిదివరకు అనేకపర్యాయములు తెలంగాణాప్రాంతమును సరిహద్దున ఉన్న చెన్న రాష్ట్రజిల్లాలతో చేర్చి శాంతిభద్రతలకు సంబంధించినంతవరకు ఒక ప్రత్యేకరాష్ట్రంగా పరగణించాలని సూచించాము. కేంద్రప్రభుత్వం ప్రమేయం కల్గించుకుంటేనే అలాంటిది సాధ్యం.

పైగా కేవలం సైనికచర్యలను తీవ్రంగా కొనసాగించడంవల్ల ఈ ముప్పు నిర్మూలన కాదు; సమస్యా పరిష్కారము కాదు. ముఖ్యంగా ఆ ప్రాంతాల్లోనే అరాచకచర్యలు ఇంత ప్రబలంగా ఉండడానికి కారణాలేమి? ప్రజలు అధికారులతో పూర్తిగా సహకరింపకపోవడానికి కారణాలేమి? దాదాపు 30 మాసాలుగా రాష్ట్ర, సంస్థానప్రభుత్వాలు తమ యావచ్ఛక్తిని వినియోగించి కృషిచేస్తున్నప్పటికి పరిస్థితులు పూర్తిగా అదుపులోకి రాకపోవడానికి కారణ మేమి? మొదలైన విషయాలపై సమగ్రవిచారణ జరపాలి. ఆ విచారణ ఫలితాలనుబట్టి ముందువిధానాన్ని నిర్ణయించుకోవాలి. కేంద్రప్రభుత్వం పూనుకొన్నప్పుడే ఇది సాధ్యం.

కాని రాష్ట్రకాంగ్రెసుకార్యవర్గం లోగడ చేసిన తీర్మానం, తిరిగి మొన్న విజయవాడలో జరిగిన రాష్ట్రకాంగ్రెసు సర్వసభ్యసమావేశం చేసిన తీర్మానం కమ్యూనిస్టుముప్పును, రాష్ట్రమంత్రివర్గపునర్నిర్మాణమును ముడిపెట్టుటవలన అసలుసమస్యను అప్రధానము చేయుచున్నవి. సర్దార్ వల్లభాయిపటేల్ ఆంధ్రైక్యతకు నాయకులు కృషిచేయవలెనని ఇచ్చిన సలహాను అంగీకరించినతరువాత ఇట్టి తీర్మానాలకు అవకాశం లేదు. రాష్ట్రముఖ్యమంత్రి కాంగ్రెసు సంఘతీర్మానాలను పాటింపనని ప్రకటించుట కూడ తగదు. ఆంధ్రై

క్యత తనకు సంబంధించినది కాదని కుమారస్వామి రాజాగారు భావించుటకు వీలులేదు.

ఎవరు ఎంత కాదన్నప్పటికిని ఆంధ్రనాయకులలో స్పర్థలు పెరిగి అనైక్యత ఏర్పడుటకు1946 నుండి వస్తున్న మంత్రివర్గరాజకీయాలే కారణ మనుటకు సందేహము లేదు. విజయవాడతీర్మానము కూడ ఈ విషయమునే విశదము చేయుచున్నది. కనుక ఆంధ్రైక్యతకు రాష్ట్ర మంత్రివర్గపునర్నిర్మాణమునకూ సంబంధము లేదని చెప్పుటకు వీలులేదు. ఆ విధంగా కమ్యూనిస్టుముప్పు నిర్మూలనకు మంత్రివర్గపునర్నిర్మాణమునకు సంబంధ మేర్పడుచున్నదని రాష్ట్రకాంగ్రెసుసంఘఅభిప్రాయమై యుండవచ్చును.

కాని మంత్రివర్గపునర్నిర్మాణము జరిగినప్పటికీ కమ్యూనిస్టుముప్పునిర్మూలనకు కేంద్రప్రభుత్వం ప్రమేయం కల్గించుకొనకతప్పదు. కాంగ్రెస్ఐక్యత, కమ్యూనిస్టుముప్పు ఏర్పడినది గనుకనే అవసర మని భావించుట సరిగాదు. రాజకీయస్వాతంత్ర్యమును సంపాదించి, ఆర్థికస్వాతంత్ర్యమును సాధించుటకు పూనుకొన్న కాంగ్రెస్ అనేకవర్గములుగ విభాగమైపోయిన రాజకీయస్వాతంత్ర్యమునకే ప్రమాద మేర్పడును. ఆ ప్రమాదనివారణకు కాంగ్రెస్ఐక్యత అత్యవసరము.

కొత్త కళాశాలలు

ప్రతితాలూకాకు ఒక ఉన్నతపాఠశాల, ప్రతి జిల్లాకూ ఒక కళాశాల ఉండాలని రాష్ట్రప్రభుత్వం నిశ్చయించింది. అప్రకారంగానే రాష్ట్రంలో అంతటా విద్యాశాలలను స్థాపించింది. వ్యక్తులు అట్టి విద్యాసంస్థలను స్థాపించడానికి పూనుకొన్నప్పుడు ప్రభుత్వం అట్టివారికి అవసరమైన ప్రోత్సాహం ఇస్తున్నది. కనుకనే గత రెండు సంవత్సరములలోనూ ఆంధ్రదేశంలో అనేకప్రాంతాల కొత్తపాఠశాలలు, కళాశాలలు ఏర్పడినవి. ధనికులు అవిరళముగ విరాళము లిచ్చి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నారు.

కడపకళాశాల హాస్టల్‌భవనానికి శంకుస్థాపన చేస్తూ రాష్ట్రఆర్థికమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారు చెప్పినట్లు కేవలం ఆర్ట్సుకళాశాలలమీదనే దృష్టిని కేంద్రీకరించి, అట్టి కళాశాలల స్థాపనకే యావచ్ఛక్తిని వినియోగించడంకంటె సైన్సుకళాశాలల స్థాపనకు ఎక్కువగా కృషిచేసిన రాష్ట్రసర్వతోముఖాభివృద్ధికి ఎక్కువ అవకాశములు ఏర్పడును. అయితే ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వమూ, ఆంధ్రవిశ్వకళాపరిషత్తుకూడా రాష్ట్రఅవసరాలను, ప్రస్తుతపరిస్థితులనూ గమనించి ఒక విధానాన్ని నిర్ణయించవలసి వుంటుంది.

శాస్త్రకళాశాలలను స్థాపించి, ఉన్నతవిద్యాభ్యాసానికి విద్యార్థులకు సదుపాయములు కల్పించడం చాలా అవసరమే. కాని అందుకు విద్యార్థులను తయారుచేయడానికి ప్రత్యేకం ఇంటర్మీడియెట్ కళాశాలలు అవసరం. వెనుకటిరోజుల్లో ఉన్నతపాఠశాలలు ఎంత అవసరము, ప్రధానముగా ఉంటున్నవో ఇప్పుడు ఇంటర్మీడియేట్ కళాశాలలుకూడా అంత అవసరముగా ఉంటున్నవి.

వైద్యము, ఇంజనీరింగు మొదలైన సాంకేతిక విద్య నభ్యసించుటకు ఇంటర్మీడియేట్ చదువు అవసరమైనది. పూర్వమువలె స్కూలుఫైనలుపరీక్ష అయినతరువాత పై విద్య నభ్యసించుటకు ఇప్పుడు అవకాశములు లేవు.

ఈదృష్ట్యా రాష్ట్రములో అధమము ఇంటర్మీడియేట్ కళాశాలలు ఎన్ని అయినను కావలసియున్నవి. అవకాశము, వీలు ఉన్న పైతరగతులనుకూడా ప్రారంభించవచ్చును. కాని అధమము ఇంటర్మీడియేట్ కళాశాలలు పదిఉన్నతపాఠశాలలకు ఒక్కటైనను ఉండుట అవసరము. ఈవిధముగ కృష్ణాజిల్లాగుడివాడలోనూ, గుంటూరుజిల్లా నిడుబ్రోలులోనూ రాబోవు జులయినుంచి కళాశాలలను స్థాపించుటకు జరుగుచున్న ప్రయత్నములు ప్రశంసనీయములు. ఈ రెండు కళాశాలలును ఆ జిల్లాల అవసరముదృష్ట్యా అత్యంతావసరమైనవనుటకు సందేహము లేదు.

గుడివాడ కృష్ణాజిల్లాకు దాదాపు కేంద్రముగానున్నది. అటు బందరులోనూ, ఇటు విజయవాడ

లోనూ ఉన్న కళాశాలలు ఆయాప్రాంతములందున్న ఉన్నతపాఠశాలలకు అందుబాటులో, అనుకూలముగ నున్నవి. గుడివాడపరిసరములలో ఇప్పుడు దాదాపు 25 ఉన్నతపాఠశాలలు గలవనీ, ఆ పాఠశాలలనుండి వెయ్యిమందివిద్యార్థులకు పైగా ఈ సంవత్సరము స్కూలుఫైనలుపరీక్షకు వెళ్ళినారని గుడివాడకళాశాలస్థాపనసంఘకార్యదర్శి శ్రీ కాజ వెంకట్రామయ్యగారు ప్రకటించుచున్నారు. ఈ ఒక్క విషయమును పరిశీలించిన గుడివాడలాంటి కేంద్రస్థానములో కళాశాల ఎంత అవసరమో స్పష్టమాతుంది.

పర్వతనేని వెంకటరత్నంగారి అధ్యక్షతను ఏర్పడిన కళాశాలసంఘం ఇప్పటికి 50 వేల రూపాయలనుమాత్రమే వసూలు చేయకల్గింది. గుడివాడ తాలూకాస్థితిగతులనుబట్టి ఈ మొత్తము స్వల్పమనియె చెప్పవలెను: కాని ఇంకను దాదాపు రెండు మాసముల వ్యవధి యున్నదిగనుకనూ, కళాశాలసంఘమునందు దీక్ష, దక్షతగలవారున్నందుననూ, కళాశాలను ప్రారంభించుటకు అవసరమైన మూడులక్షలరూపాయలు వసూలు కాగలవనియె విశ్వసించుచున్నాము. ఇందుకు ఆప్రాంతమువారే గాక, ఇతరప్రాంతములవారునూ తగిన సహాయము చేయవలెను.

ఇదేవిధముగ నిడుబ్రోలుకళాశాలకు కూడ అందరు ఇతోధికముగ సహాయము చేసి, ఆ ప్రాంతమునకు అత్యవసరమైన ఈ కళాశాలస్థాపనకు తోడ్పడుదురుగాక.

విషయానుక్రమణిక
17 మే 1950

ప్రపంచ రాజకీయస్వరూప నిర్ణేతలలో ముఖ్యుడు-

డిన్ జి. ఎచిసన్

ఎన్నికలంటే వేలంపాట; ప్రభుత్వమంటే పారిశ్రామికుల పాలనాధికారం; వ్యాపారమంటే వస్తువిక్రయదక్షత; ప్రపంచమంటే పెద్ద విక్రయశాల. కొంచం మాటకారితనం ఉంటే చాలు ఆడా మగా మంచిదుస్తులు ధరించి స్నోలూ, పౌడర్లు, దువ్వెనలు, మందులతో సూట్‌కేస్ నింపి ఏ ఊళ్లో నాలుగువీధులూ తిరిగినా ధన భత్యం ఆర్జించుకోవచ్చును. ఇదీ అమెరికా.



జి. ఎచిసన్

ఇటువంటిదేశానికి పరిపాలకులు వ్యాపార దక్షులై ఉండాలి. అదికూడా అమ్మకపు వ్యాపారంలో దక్షులై ఉండాలి.

రాజకీయ ఆర్థికబలం మద్దతుతో ప్రపంచమంతటా తమ వ్యాపార ప్రాబల్యాన్ని వ్యాప్తిచేసి సుస్థిరపరుచుకోడానికిగాను అమెరికాకు విదేశాంగశాఖోద్యోగులు సమర్థులై వారిద్దరున్నారు. ఒకరు విదేశాంగ మంత్రి డీన్ గుడెర్హామ్ ఎచిసన్. రెండో వారు సహాయమంత్రి ఫిలిప్ జెసప్.

చీనాలో కోట్లకొద్దీ డాలర్లు ధారపోసినా పరాజయం పొందిన అమెరికన్ విధానం కాంగ్రెస్‌లో తీవ్రవిమర్శకు వచ్చినప్పుడు, ప్రత్యక్షంగా బాధ్యుడు కాకపోయినా ఎచిసన్ నిందను భరించవలసినవాడైనాడు. చీనాలో పరాజయంతో, అంతర్జాతీయరంగంలో అమెరికా అనుసరిస్తున్న విధానంపట్ల తీవ్రమైన అసంతృప్తి కలిగింది. రష్యాతో ప్రచ్ఛన్నయుద్ధంలో ఏ విధానాన్ని అనుసరించ తలపెట్టినా కాంగ్రెస్‌లోనూ దేశంలోనూ అధిక్షేపణ తలచూపి, ప్రతివిషయానికీ ప్రభుత్వానికి అంతరాయాలు కలిగిస్తున్న సమయంలో, ప్రభుత్వపరపతిని పునరుద్ధరించవలసిన బాధ్యత ఎచిసన్ తలపైన పడింది. అమెరికాలోని సర్వరాజకీయపక్షాలకూ సమ్మతమైన విధానాన్ని నిర్ణయించవలసిన అవసరం కలిగింది. రష్యాతో పోటీలో పరాజయం తప్పదని నిరుత్సాహం చెందిన అమెరికా, ద్వితీయప్రపంచ సంగ్రామానికి పూర్వం అనుసరిస్తున్న తటస్థవిధానానికే తిరిగి తలొగ్గే ప్రమాదం ఆసన్నమైనప్పుడు, తటస్థానంవల్ల లోకంఅంతా ఒక్కసారిగా అధోగతి పాలౌతుందని చెప్పి, సర్వత్రా సమగ్ర రాజ్యతంత్రం (టోటల్ డిప్లొమసీ) అనుసరించవలసి ఉంటుందని ప్రకటించి అమెరికన్ ప్రభుత్వంపట్ల కాంగ్రెస్‌విశ్వాసాన్ని పునరుద్ధరించాడు ఎచిసన్. తన ఈ సమగ్ర రాజ్యతంత్రాన్ని అమలుజరపడానికి ఎచిసన్ ఇప్పుడు లండన్‌లో బ్రిటిష్ ఫ్రెంచి విదేశాంగమంత్రులతో మంతనాలు జరుపుతున్నాడు. ఈ విధానానికి మూలబలం బ్రిటన్. కాబట్టి ఒకవంక బ్రిటిష్ సోషలిస్టులపట్ల విముఖులైయున్న అమెరికన్ కాంగ్రెస్‌నాయకుల్నీ, మరొకవంక కామన్వెల్త్‌దేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించలేకున్న బ్రిటిష్‌ప్రభుత్వాన్నీ కూడగట్టుకు రావడానికి కృషి అవసరమయింది.

ఈ కార్యావసరానికి, మడత నలగకుండా దుస్తుల్ని కాపాడ్డం మొదలు మాట్లాడే ప్రతిమాటనూ తూచి ఒక రీతితో పలకడం వరకూ ప్రతిచిన్నవిషయానికీ అత్యంతశ్రద్ధ వహించే ఎచిసన్ ఆధారమైనాడు.

నిగ్రహవర్తనుడు, నిశితబుద్ధి, ఏకాగ్రత, వివేకం అన్నీ ఎచిసన్‌లో ఒక దర్పంతో కూడి రాణిస్తాయి. కాని మొదటితనము అసభ్యసంభాషణ జాతీయలక్షణాలుగా పరిగణించబడే అమెరికన్ ప్రభుత్వంలో ఎచిసన్ నిగ్రహవర్తన అసహజంగా కృత్రిమంగా గోచరిస్తుంది, అందువల్లనే బ్రిటన్‌లో కాని భారతదేశంలో కాని మన్నన పొందగల ఎచిసన్‌ప్రవృత్తి అమెరికన్ కాంగ్రెస్‌లో అతనికి అనేకమంది శత్రువుల్ని తెచ్చిపెట్టింది. న్యాయవాదవృత్తిలో ఎచిసన్‌కి ఖ్యాతి గడించిపెట్టిన విషయగ్రహణపారీణత తర్కప్రావీణ్యాలే అమెరికాలో పరిహాసహేతువులైనాయి.

ఎచిసన్‌తండ్రి బ్రిటిష్ జాతీయుడు. తల్లి కెనడాదేశస్థురాలు. భాగ్యవంతులు. న్యాయశాస్త్రకళాశాలలో జస్టిస్ ఫ్రాంక్‌ఫర్టర్ మైత్రివల్ల ఎచిసన్ వృద్ధిలోకి వచ్చాడు. న్యాయవాదవృత్తి ఆరంభంలోనే హేగ్ అంతర్జాతీయన్యాయవిచారణసంస్థలో నార్వీజియన్ ప్రభుత్వంతరఫున ఒకకేసులో వాదించాడు. ఎచిసన్‌వ్యక్తిప్రతిభకు అప్పుడు అందరూ ముగ్ధులైనారు. తరువాత కేసుపోయినా ఎచిసన్‌కి పొగడ్తే లభించేది. న్యాయవాదవృత్తిలో అచిరకాలంలోనే అపారఖ్యాతిగడించినాడు.

అప్పుడు అధ్యక్షుడుగా ఉన్న రూజ్వెల్టు ఇతని ప్రతిభను గమనించి ఆర్థికశాఖలో అండర్ సెక్రటరీగా నియమించాడు. కాని రూజ్వెల్టుతో ఇతనికి పడలేదు. బంగారం వ్యాపారంలో భారతరమైన బాధ్యతలుకల

(39-వ పేజీ చూడుడు)

నేటిప్రపంచం

ప్రపంచరాజకీయాలలో రష్యావర్గంతో జరుగుతున్న సంఘర్షణను వీలైన ఒక తెన్నుకు తీసుకురావాలని ఆంగ్లో-అమెరికన్ రాజ్యకూటం చేస్తున్న యత్నాలు, 1950 మే నెలలో నాలుగు ప్రధానసమావేశాలద్వారా కొనసాగుతున్నాయి. 1. లండన్‌లో అగ్రరాజ్య విదేశాంగ మంత్రిత్రయసమావేశం. 2. సిడ్నీలో కామన్వెల్తు కన్సల్టేటివ్ కమిటీసమావేశం. 3. లండన్‌లో జపాన్‌తో సంధి విషయమై కామన్వెల్తు కన్సల్టేటివ్ కమిటీసమాలోచన 4. ఫిలిప్పైన్సులో ఆగ్నేయాసియా రాజ్యప్రతినిధుల సమావేశం.

అగ్రరాజ్య విదేశాంగమంత్రిత్రయసమావేశం ఈ వారం మూడురోజులు జరిగింది. ఈ సమావేశానికి ముందు పారిస్‌లో ఫ్రెంచి విదేశాంగమంత్రి రాబర్టు షూమన్‌తోనూ, లండన్‌లో బ్రిటిష్ విదేశాంగమంత్రి బెవిన్‌తోనూ అమెరికన్ విదేశాంగమంత్రి డీన్ ఎచిసన్ సమాలోచనలు జరిపారు.

ఈ సమాలోచనల ఫలితంగా ఆసియాలో బ్రిటన్ ఫ్రాన్సుల అధీనంలో ఉన్న ప్రాంతాలలో కమ్యూనిస్టు నిరోధక చర్యల్ని సమీకరింపచేసి అమెరికా సైనిక ఆర్థిక సహాయాలు ఇవ్వడానికి అనువైన ఒక కార్యక్రమాన్ని నిర్ణయించడానికి ప్రాతిపదికను తయారుచేశారు.

అగ్రరాజ్యవిదేశాంగ మంత్రిత్రయసమావేశం ఈ క్రిందివిషయాలను చర్చించింది. 1. కమ్యూనిస్టు చీనాపట్ల అవలంబించవలసిన వైఖరి. 2. ఇండోచీనా, సయాం, బర్మా, మలయా, ఇండోనీషియాలకు సైనికఆర్థిక సహాయసమీకరణ. 3. జర్మనీభవిష్యత్తు 4. ఉత్తరఅట్లాంటిక్ దేశాల రక్షణకార్యక్రమాలు 5. ఐక్యరాజ్యసమితిలో కమ్యూనిస్టువర్గనిష్క్రమణవల్ల ఏర్పడిన ప్రతిష్టంభన. జపాన్‌తో విడిగా శాంతిసంధి చేసుకునే విషయమై చర్చించాలని ముందు తలపెట్టినప్పటికీ, అమెరికన్ ప్రభుత్వం ఒక నిర్ణయానికి రాలేకపోయినందువల్ల ఈ చర్చ మానుకొన్నారు.

జర్మనీ *

పశ్చిమజర్మనీసైనికాక్రమణవ్యవస్థను సవరించడానికిగాను త్వరలో ఒక పరిశీలకసంఘాన్ని నియమించాలని ముగ్గురు మంత్రులూ నిర్ణయించారు. అంటే శాంతిసంధి చేసుకోనవసరంలేకుండానే పశ్చిమజర్మనీతో వైరవ్యవస్థను తొలగించాలని నిశ్చయించుకున్నారన్నమాట. రష్యాతో సమాధానం కుదిరితేగాని శాంతిసంధి చేసుకోడానికి వీలులేనందువల్ల ఇటువంటి మార్గాన్ని ఆంగ్లో, అమెరికన్, ఫ్రెంచి ప్రభుత్వాలు అనుసరించదలిచాయి. పశ్చిమజర్మనీలో "ప్రజాస్వామ్యపరిపాలనావిధానం వృద్ధిపొందినకొద్దీ పరిపాలనాస్వాతంత్ర్యాన్ని ఇతోధికంగా ఇవ్వగలరని ముగ్గురు మంత్రులూ ప్రకటించారు. సంపూర్ణపరిపాలనాస్వాతంత్ర్యం ఇవ్వడానికి వారు తెలిపిన షరతుల్ని గమనిస్తే వారు వాస్తవంగా కోరేది స్పష్టపడుతుంది. దేశంలో ఒకవంక కమ్యూనిజాన్ని రెండోవంక ఉద్రిక్తజాతీయభావాన్నీ నిరోధించగలగటాన్నిబట్టి బ్రిటన్ అమెరికా ఫ్రాన్సులు భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నమాట. ఇది సాధించడానికిగాను యూరోపియన్ రాజ్యసమాఖ్యలో సార్ ప్రాంతంతో సమానంగా సభ్యత్వాన్నీ, ఫ్రాన్సుతో ఆర్థికసమీకరణకార్యక్రమాన్నీ పశ్చిమజర్మనీ అంగీకరించవలసి ఉంటుంది. ప్రజలలో ఇటువంటి కార్యక్రమాలపట్ల నానాటికీ అసంతృప్తి చెలరేగుతున్నదంటే, దానికి కమ్యూనిస్టు ప్రచారబలమే హేతువని కొందరు, జర్మన్ల జాతీయభావబలమని కొందరూ ఆరోపిస్తున్నారు.

జర్మనీవిభజన ఇప్పటి రీతిగా ఉన్నంతవరకూ పశ్చిమ జర్మనీనుంచి బ్రిటిష్ అమెరికన్ ఫ్రెంచి సైన్యాలను తరలించరని అగ్రరాజ్య విదేశాంగమంత్రులు ప్రకటించారు. పశ్చిమ జర్మనీకి ముప్పువాటిల్లినట్లయితే (తూర్పుజర్మనీనుంచి కాని, కమ్యూనిస్టులవల్లగాని) దేశాన్ని "కాపాడేబాధ్యతను" పాశ్చాత్యరాజ్యాలే భరిస్తాయన్నమాట.

జపాన్

రష్యా చీనాలతో నిమిత్తంలేకుండా జపాన్‌తో శాంతి సంధి చేసుకోవాలనే ఆలోచన ప్రస్తుతానికి మానుకున్నారు. దీనికి ముఖ్యకారణం అమెరికన్ విదేశాంగశాఖకు, సైనికాధికారవర్గానికీ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడమే. అందువల్ల లండన్‌లో కామన్వెల్తు కన్సల్టేటివ్ కమిటీవారు రెండువారాలు పైగా జరుపుతున్న సమాలోచనలు వ్యర్థమైనాయి. అయినా కామన్వెల్తులోని ఆసియాదేశాలకు అంతర్జాతీయవ్యవహారాలలో ప్రాధాన్యమిస్తున్నట్లు నటించడానికిగాను, ఈ సమాలోచనల ఫైళ్ళను తుదివరకూ కొనసాగించడానికి నిశ్చయించారు. ఆగ్నేయాసియాలో అమెరికా బ్రిటన్ ఫ్రాన్సులు సహకరించి నెరపగల కార్యక్రమాన్ని గురించి రవంతైనా భారతదేశంవంటి ఆసియాదేశాలకు తెలపరాదని భావించిన అగ్రరాజ్యాలవారి ధోరణులు నిష్ప్రయోజనమే కాగలవు. అమెరికా వెనకనుండి ఫిలిప్పైన్సుప్రభుత్వాన్ని ముందుపెట్టి ఆగ్నేయాసియా రాజ్యసమావేశం అనేది జరిపి, ఎలాగైనా ఈ దేశాల్ని ఒక సైనికఆర్థికసహకార కార్యక్రమంలోకి దించాలని ఎంత యత్నించినా భారతదేశంవంటివి ఈ ఉచ్చులో చిక్కుకోవు. ఫిలిప్పైన్సు సమావేశంలో కమ్యూనిస్టువిరోధవిషయం కాని సైనిక కార్యక్రమసహకారవిషయం కాని చర్చించరాదని ఆ సమావేశానికి భారతదేశం తరఫున ప్రతినిధివర్గ నాయకుడుగా నియమితుడైన రామస్వామి మొదలియార్ చెప్పారు.

కమ్యూనిస్టువిరోధానికి అమెరికా తలపెట్టిన సమగ్రరాజ్యతంత్రవ్యవహారంలో భారతదేశం చిక్కుపడదనీ, అందువల్ల పాకిస్తానును మచ్చికచేసుకోవటం అవసరమనీ అమెరికన్ విదేశాంగకార్యాలయం భావిస్తున్నట్లు స్పష్టమౌతున్నది. అమెరికానుంచి

అపారంగా ఆయుధసామగ్రిని కొనగోరుతున్నట్లు అమెరికా సంచారం చేస్తున్న లియాఖత్ అలీఖాన్ ప్రకటించారు. ఈ విషయమై అమెరికన్ ప్రభుత్వం ఆలోచిస్తున్నది. విదేశాంగశాఖ ఆయుధాలను పాకిస్తాన్‌కు అమ్మడానికి సుముఖంగా ఉన్నదని, అయితే దేశరక్షణశాఖ విముఖత ప్రకటించిందనీ తెలుస్తున్నది. చీనాలోవలె తమ ఆధ్వర్యంకింద, అజమాయిషీకింద కమ్యూనిస్టు నిరోధక కార్యక్రమంలో పాల్గొనేపక్షంలోనే ఇటువంటి సహాయం ఇవ్వాలని దేశరక్షణశాఖవారి అభిప్రాయం.

అమెరికాలో పాకిస్తాన్ ప్రధాని పారిశ్రామికవ్యాపారాదిసంస్థల్ని సందర్శిస్తున్నారు. అమెరికన్ ధనికవర్గాలవారు పాకిస్తాన్‌లో పెట్టుబడి పెట్టడానికి అపారమైన అవకాశాలున్నాయనీ, పెట్టుబడి ఫలితంగా రాగల లాభాల్ని డాలర్లలో అమెరికాకు తీసుకుపోగల అవకాశం ఇవ్వబడుతుందనీ వారు చెప్పారు. భారతదేశవిభజనకూ పాకిస్తాన్ ప్రభుత్వసంస్థాపనకూ గల హేతువుల్నీ అవసరాల్నీ వివరిస్తూ, కులభేదాలతోనూ, అంధమతాచారాలతోనూ నిండి ఉన్న హిందూ సమాజంలో కలిసి ఒకే రాజ్యాంగవ్యవస్థలో మహమ్మదీయులు ఉండలేరన్నారు. ఆసియాఖండంలో ఈనాడు ఉత్తమ ప్రజాస్వామ్య సిద్ధాంతాలను పాటించి వ్యక్తిస్వాతంత్ర్యానికీ, ఉత్తమసమాజనీతికీ తావున్న దేశమేదైనా ఉందంటే అది పాకిస్తాన్ ఒక్కటే అన్నారు. కాశ్మీరంగురించి కొందరడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ, జనవాక్యనిర్ధారణ జరపడం ఒక్కటే పాకిస్తాన్ లక్ష్యమనీ, అన్యపరిష్కారమార్గం ఏదైనప్పటికీ తమకు సమ్మతం కాజాలదనీ చెప్పారు. మహమ్మదీయజనాధిక్యతను బట్టిగాని, నైసర్గికస్థితినిబట్టిగాని, జాతిసాన్నిధ్యాన్ని బట్టిగాని, వాతావరణభూగోళశిగోళాది ఏ ప్రమాణాన్ని బట్టిగాని కాశ్మీర్ పాకిస్తాన్‌లో చేరవలసిందేనన్నారు. లేక్‌సక్సెస్‌లోనూ, న్యూయార్కులోనూ మొత్తం మూడు సార్లు కాశ్మీరమధ్యవర్తి సర్ ఓవెన్ డిక్సన్‌ను లియాఖత్ అలీఖాన్ గారు మూడుసార్లు కలుసుకుని మాట్లాడారు. లియాఖత్ అలీఖాన్‌గారి కోర్కెప్రకారం అవసరమైన ఆయుధసామగ్రిని పాకిస్తాన్‌కు అమ్మే విషయమై అమెరికన్ ప్రభుత్వం పరిశీలిస్తోంది. అమెరికా పాకిస్తాన్‌లమధ్య వ్యాపారమైత్రి ఒడంబడిక చేసుకునే విషయమై సమాలోచనలు సాగుతున్నాయి.

కమ్యూనిజంనిరోధంకోసం ఆగ్నేయాసియా దేశాలకు సైనిక ఆర్థిక ఆయుధ సహాయం చెయ్యడానికి అమెరికన్ ప్రభుత్వం కార్యక్రమం నిర్ణయిస్తోంది. మొత్తం 64 మిలియన్ల డాలర్లలో ఇండోచీనాకు 23 మిలియన్లు, బర్మా, సయాం, ఇండొనీషియాలకు 11 మిలియన్ల చొప్పున ఇవ్వడానికి నిర్ణయమయింది. మలయాలో కమ్యూనిస్టులపై పోరాటానికిగాను బ్రిటిష్ ప్రభుత్వానికి 5 మిలియన్ల డాలర్లు ఇవ్వడానికి మొదట నిర్ణయించబడింది. కాని మలయాలో పరిస్థితితో అమెరికా ప్రమేయం పెట్టుకోరాదని బ్రిటన్ చెప్పింది. అందువల్ల ఆస్ట్రేలియన్ ప్రభుత్వంతో సంప్రతించి ఏమిచెయ్యాలో నిర్ణయిస్తారు. మలయాలోని బ్రిటిష్ కమిషనర్ జనరల్ మాల్కొం మాక్డొనాల్డు ఇప్పుడు సిడ్నీలో ఆస్ట్రేలియన్ ప్రధాని మెంజీస్‌తో సంప్రతింపులు జరుపుతున్నాడు.

అగ్రరాజ్య విదేశాంగమంత్రిత్రయ సమావేశానంతరం అట్లాంటిక్ కౌన్సిల్ సమావేశమౌతుంది. అనగా అట్లాంటిక్‌పాక్టు దేశాల విదేశాంగమంత్రుల సమావేశం. ఈ సమావేశంలో అమెరికా పంపుతున్న ఆయుధ సహాయం, యుద్ధంవచ్చే పక్షంలో అనుసరించవలసిన సైనిక సహకారకార్యక్రమం నిర్ణయించబడగలవు.

అందువల్ల ఈ లండన్ సమావేశంతో రష్యా – అమెరికాలమధ్య వ్యవహారాలు పూర్తిగా తెగతెంపులు కావడమో లేక ఐక్యరాజ్యసమితిని రక్షించడమో తేలిపోతుందనుకోవచ్చును. ముందు జరుగనున్న సమితి సమావేశంలో బ్రిటిష్ అమెరికన్ ఫ్రెంచి ప్రభుత్వాలు, రష్యన్ వర్గంతో వ్యవహారాలకు సంబంధించినంతవరకూ ఒక తాటిమీద నడవడానికిగాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. అటువంటి సమితిని సర్వసభ్యసమావేశాన్ని కూడా రష్యాత్యజించవచ్చును.

అందువల్లనే లండన్ సమావేశం సమితికి భరతవాక్యం పాడుతుందనే భయంతో, ఎలాగైనా సమితిని కాపాడాలని సమితి ప్రధానకార్యదర్శి ట్రిగ్వేలీ యూరప్ సంచారానికి బయలుదేరారు. యూరోపియన్ రాజ్యాలమధ్య మరొక్కసారి సామరస్యయత్నం జరగాలని వారు సూచించారు. సమితి రాజకీయతంత్రాలకు అతీతమైనదని చెకొస్లొవాకియా ప్రధాననగరంలో పత్రికాప్రతినిధులకు వారు చెప్పినప్పుడు వారంతా నవ్వారట. సమితిలోకి ఆల్బేనియా, ఆస్ట్రియా, బల్గేరియా, ఫిన్లండ్, హంగరీ, ఇటలీ, ఐర్లండ్ పోర్చుగల్, రుమేనియా ప్రభుత్వాలకు కూడా ప్రవేశమిస్తేగాని సమితిలో యూరప్ ప్రాధాన్యం పరిగణింపబడదనీ, సమితిలోని ఉభయవర్గాలమధ్యనూ (రష్యన్ అమెరికన్ వర్గాలు) సామరస్యం అసాధ్యమనీ వారన్నారు. రష్యన్‌వర్గాన్ని తిరిగి సమితిలో ప్రవేశపెట్టడంకోసం సోవియట్ ప్రభుత్వనాయకులతో సమాలోచనలు జరపడానికి ట్రిగ్వేలీ మాస్కో వెళ్లారు. అక్కడ వారు స్టాలిన్‌ను కలుసుకునేదీ లేనిదీ ఇంకా తెలియదు.

రష్యానూ ఇతర కమ్యూనిస్టుప్రభుత్వాలనూ వెళ్లగొట్టి వేరే ఐక్యరాజ్యసమితినొకదానిని స్థాపించాలని పూర్వఅమెరికన్ అధ్యక్షుడు చేసిన సూచనను భారత ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ఖండించారు. సమితి సాధించిన మహత్కార్యాలేవీ లేకపోయినా, అనేక ప్రమాదాలను నివారించగలిగిందనీ, ప్రపంచరాజ్యాలమధ్య సామరస్యాన్ని చేకూర్చడానికి కృషి చేయాలంటే సమితి ఒక్కటే సాధనమనీ పండిట్ నెహ్రూ అన్నారు.

1950 నవంబర్‌లో అమెరికన్ కాంగ్రెస్‌కు జరగనున్న ఎన్నికల నిమిత్తం అధ్యక్షుడు ట్రూమన్ అప్పుడే దేశసంచారం బయలుదేరాడు. ఈ సంచారంలో వారి ఉపన్యాసాలకు ఎన్నికలజోరు అధికంగా కట్టి నికరం అల్పమే అని సరిపెట్టుకోవచ్చును. అయినా వారు చెప్పిన కొన్ని విషయాలు గమనార్హం. యుద్ధమే సంభవిస్తే శత్రువుల్ని నిర్జించడానికి ఏటంబాంబులు ప్రయోగించడానికి సంకోచించరని ట్రూమన్ అన్నారు. అంటే సైన్యాలమధ్య జరగవలసిన యుద్ధాన్ని నిరాయుధులైన ప్రజలపైన ప్రయోగించడానికి సంకోచించరన్నమాట. ఎన్నికల ప్రచారం కాబట్టి "ప్రపంచంలో పరిస్థితి ప్రమాదభరితంగా ఉంది. అందరూ ఏమైనా కమ్యూ

(40 వ పేజీ చూడుడు)

'నిఘామానుసహాయం'

మదరాసులో కొత్తస్కీము

శ్రీ జె. బి. శర్మ

రైతులకు మంచి మడిసాగు ప్రదర్శనముల ద్వారా నవీనవ్యవసాయపద్ధతులను నేర్పి అనుసరింపజేయుటకున్నూ జపాన్ యూరప్ మొదలగు దేశములలోవలె మన దేశంలోకూడ వ్యవసాయ సామర్థ్యమును ఇనుమడింపజేయు నిమిత్తం వ్యవసాయశాస్త్ర పరిశోధనల ఫలితములను రైతుకు గడపదాటకుండా అందుబాటుచేయుటకున్నూ ఇటీవల మదరాసుప్రభుత్వం ఒక వ్యవసాయాభివృద్ధి స్కీమును మంజూరుచేసెను.

ప్రస్తుతము ప్రభుత్వము ఈ స్కీమును తూర్పుగోదావరి, నెల్లూరు, తంజావూరు మధుర, దక్షిణకనరా, బళ్లారిజిల్లాలలో అమలుజరిపి పరిశీలించెదరు.

ఈ వ్యవసాయ నిఘామాను సహాయంలేక మద్దతుసాయితా (*Extension service*) ప్రభుత్వయాజన్యమున అమెరికాలో సమర్థముగ అమలు జరుగుచున్నది. వ్యవసాయమునకు సంబంధించిన నవీన విజ్ఞానమును రైతులకు అందుబాటుచేసి రైతులలో వ్యవసాయ విజ్ఞానమును వెదజల్లుటే ఈ స్కీముయొక్క ముఖ్య ఉద్దేశ్యము.

అమెరికాలో ప్రభుత్వ యాజమాన్యమున పనిచేయు మన జిల్లా, తాలూకాలను బోలు స్థానికప్రాంతముల ఏజంట్లద్వారా వ్యవసాయమద్దతు అమలుజరుగుచున్నది. ఈ ఏజంట్లు రైతులు, రైతుసంఘములతో సన్నిహితసంబంధముగలవారుగ వుందురు. స్థానికపెద్దల తోడ్పాటుతో మడి-ప్రదర్శనములు జరుపుట ఈ పథకములోని ఒక ముఖ్యలక్షణము.

ఇండియాప్రభుత్వముకూడ అమెరికన్ వ్యవసాయ మద్దతు సర్వీసు నమూనాలో ఒక సంస్థ వుండుట అధికోపయోగకారి అవసరమని తలచి అమెరికాలో అమలులో వున్న పద్ధతిని తెలుసుకొని మనదేశములో అమలుజరుపుటకు ఉద్దేశించినది. దేశపరిస్థితులకు అనుగుణముగ ఒక నమూనా పథకమును కూడ తయారుచేసెను. ప్రతిగ్రామములోని నిఘామానులైన రైతులయొక్క సహాయము తీసుకొని వారికి సర్వసౌకర్యములు ఇచ్చి నవీనపద్ధతులలో కమతములను సాగుచేయించి ప్రదర్శించుట ఈ నమూనాపథకముఖ్య ఉద్దేశ్యము.

అమెరికాలో 1947 లో 65 లక్షల వ్యవసాయకుటుంబములలో నూటికి 80 కుటుంబములు అమెరికావ్యవసాయశాఖ వారి సహకార వ్యవసాయమద్దతుసర్వీసు సహాయమును పొందినట్లు మద్దతుసర్వీసు వారి 1948 ఆర్థికసంవత్సరనివేదిక తెల్పుచున్నది.

ఈ మద్దతుసర్వీసు తాలూకా ఏజంట్లు 1947 లో అమెరికాలోని కమతములలో మూడింట ఒకదానిని దర్శించిరి. 87 లక్షల 50 వేలమంది ఏజంట్లు ఆఫీసులకు వచ్చి సలహా సమాచారము పొందిరి. ఏజంట్లు 11 వేల సంచారకార్యక్రమములు ఏర్పరచి జరిపిన గృహనిర్మాణ ప్రదర్శనములను 5 లక్షలమంది వీక్షించిరి. ఈ మద్దతుసర్వీసుక్రింద 12800 మంది తాలూకాలలో పనిచేయు కార్యకర్తలు గలరు. వీరు 48 అమెరికన్ రాజ్యములు అలాస్కా, హవాయి, ప్యూర్టోరికోకాలలోని గ్రామీణులతో ప్రత్యక్షముగ వ్యవహరించుచుందురు. ఇందులో 4813 వ్యవసాయఏజంట్లు, వారి సహాయులు ఆయా తాలూకాలలో జరుగు అభివృద్ధిపనిని అజమాయిషీ చేయుచుందురు. ఇదిగాక 3318 గృహప్రదర్శనఏజంట్లు పట్టణ, పల్లె స్త్రీజనమునకు ఇంటిని చక్కపరచు పనులలో తోడ్పడెదరు. 656 గురు ప్రత్యేకముగ 80,286 (4-*H*) ఫోర్ హెచ్ క్లబ్‌ల (హెడ్ హార్టు, హాండ్సు, హెల్తు) లో 1,730,000 బాలబాలికలతో కలిసి పనిచేయుచుందురు. దీనికి తోడు ఈ సర్వీసుక్రింద ప్రతి రాజ్యవ్యవసాయకళాశాలలోనూ ప్రవీణులు, పర్యవేక్షకులు వున్నారు.

పంట దిగుబడిని పెంచుటకు, ఆర్థికసమస్యల పరిష్కారమునకు సహజవనములను సంపుటిచేయుటకు విద్యుచ్ఛక్తి సప్లయికి, వస్తువుల సులభవిక్రయమునకు పశుకుక్కుటగణాభివృద్ధికి, పశు, పంటజాడ్య నివారణకు ఈ మద్దతుకార్యము రైతులకు సహాయకారిగ వుంటుంది. 4-హెచ్ కార్యక్రమముద్వారా గ్రామయువకులకు సహాయము చేయుచుందురు.

నిఘామాను లేక మద్దతు సర్వీసు డైరెక్టరు "విజ్ఞానమును పొలములకు చేరుట మద్దతు సర్వీసు ఉద్దేశ్యము చేర్చుటయేగాక వ్యవసాయమునకు వినియోగించునట్లు జనమునకు సహాయంచేయుట కూడా. సమగ్ర విద్య అంటే ఇది" అని అన్నాడు.

అమెరికాలో ఈ మద్దతుసర్వీసు వ్యవసాయశాఖ, ప్రభుత్వకళాశాలలు, తాలూకా స్థానికప్రభుత్వముల సంస్థల సహకారముతో జరుగుచున్నది. ఈ సర్వీసు మీద అగు వ్యయములో నూటికి 72 [illegible] ఫెడరల్ ప్రభుత్వము, మిగతాది రాష్ట్రములు, స్థానికసంస్థలు భరించును. 1947 లో ఈ సర్వీసు 3,8[illegible]0,035 కమతములను 3,069,775 కమతశాలలను అభివృద్ధిచేయుటకు తోడ్పడెను.

(35-వ పేజీ చూడుడు)

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

30

బాల కారేండ్లు నిండినవి. ఏడవయేడు ప్రవేశించినది. ప్రతిసంవత్సరమును దాని పుట్టినరోజు పండుగ మహోత్సవముగా చేయు నలవాటు; ఈసంవత్సరము పండుగ చేయుటా మానుటా యను శంక పార్వతికిని లకుమమ్మకును ముందు కలిగినది. గౌరీదేవిని వా రడిగిరి. ఆ తల్లి నిష్కర్ష చేసినది.

"మా తండ్రి అన్నయ్యకు ఇష్టమైన యీ యుత్సవము మానవీలులేదు. వా డెక్కడ నున్నను వానికి భేదము లేదు. ఇాతకును మనకే అజ్ఞానముచేత భేదము!"

గౌరీదేవి యప్పుడే అక్కడికి వచ్చిన తిక్కనసోమయాజులకీవిషయము చెప్పి, "పెద్దదానను, ఇందులో అవ్యక్త మేమైన నున్నదా?" యని ప్రశ్నించెను. సోమయాజులు పరమానందముతో నామెనిశ్చయమును శ్లాఘించెను.

పూర్వ మేవిధముగా నా పండుగ చేయువారో ఇప్పుడును అదేవిధముగా నన్ని యేర్పాట్లును సాగినవి. పూర్వము ఎవ రెవరికి ఏఏవిధముగా పిలుపులు పంపుచుండిరో, అట్లే యీమారున్ను పిలుపులు వెళ్లినవి. రాజమందిరమునకుగూడ యథాపూర్వముగా రెండురోజులు ముందుగా లకుమమ్మ స్వయముగా వెళ్లి తగువారినందర నాహ్వానించి వచ్చినది.

అన్నమంత్రిదివాణమున పూర్వపు మర్యాద లన్నియు ఇన్నాళ్లును జరుగుచునేయుండెను. అన్నమంత్రీశ్వరుడు పట్టణము విడిచియున్నరోజులలో సమస్తము నెట్లుండెడిదో, ఇప్పు డట్లున్నది. వ్యవహారశాలలో మాత్ర మొక చిన్న మార్పు వచ్చినది. అక్కడ అన్నమంత్రిస్థానము శూన్యముగ నుండును. దాని సమీపమున తిక్కచమూపతి కూర్చుండి వ్యవహారములు చూచుచుండును.

అన్నమంత్రిదివాణమున నిత్యమును మ్రోయు మంగళతూర్యములే కాక ఈనాడు మరియు కొన్ని మంగళవాద్యములు మ్రోయుచున్నవి. రెండుగడియల ప్రొద్దెక్కినప్పటినుండియు సువాసినులు కుమారికలు సర్వాలంకృతలై ఫలపుష్పవస్త్రాభరణాది బహుమానములతో దివాణమునకు వచ్చుచున్నారు. పలువురు పల్లకులలో మేనాలలో వచ్చుచుండిరి. అవియు ముత్యాల పల్లకులు, రత్నాల పల్లకులు పచ్చలపల్లకులు! కొందరు కాలినడకనే వచ్చుచుండిరి. వచ్చినవారి నందరను అన్నమంత్రి రెండవభార్య లకుమమ్మ స్వయముగా నెదుర్కొని యాదరముతో లోనికి తీసికొనిపోవుచున్నది.

మరియు వేదవిదు లగు బ్రాహ్మణులు వందలకొలదియు నచ్చటి కాహూతులై వచ్చుచున్నారు. వారి నందరను గుడునాథుడును, దెబ్బలబాధనుండి బాగుగా తేరుకొనిన మారనయు నెదురువోయి సగౌరవముగా లోనికి వెంటతీసికొని వెళ్లి యుచితస్థానముల గూర్చుండజేయుచున్నారు. ఆ సభలో తిక్కనసోమయాజులు పవిత్రాసనమున నుపవిష్టులై యుండిరి.

కొంతసేపైనది. నగరమందలి ప్రధానులును దండనాథులును శ్రేణీపతులును బహువిధములగు వాహనములపై నక్కడి కంత రాదొడగిరి. అన్నమంత్రి మేనమరది యగు పర్వతమల్లు వారి నందర యథోచితమర్యాదలతో లోనికి తీసికొనిపోవుచుండెను. రాజమహేంద్రపాలకు డగు నీపర్వతమల్లు ఈ యుత్సవమునిమిత్తము ప్రత్యేకముగా పిలిపింపబడెను.

ఈ మహోత్సవమునకై గృహోపవనభూమిమధ్యమున నొక విశాల మగు మండపము నిర్మించి దానిని తోరణములతో పల్లవములతో పుష్పములతో ఫలములతో పటములతో ధ్వజములతో నానావిధముల నలంకరించిరి. అందుకు మోహరివాడనుండి నూర్గురు కుట్రపు పనివారు నియుక్తులై వారముదినములుగా రాత్రింబవళ్లు విరామములేక పనిచేయుచుండిరి.

ఆ మండపశిరోభాగమున నొక యున్నత వేది కలదు. అందు మనోజ్ఞమగు పీఠమున చీనాంశుకమున వివిధవర్ణములతో ఉజ్వలముగా బాలాయంత్రము లిఖింపబడి యున్నది. దాని వెనుక పంచలోహములతో నిర్మించిన ఆరేళ్ల బాలాకుమారివిగ్రహమును నిలిపిరి. వానిముందు సర్వాలంకృత మైన పార్వతీదేవి, అన్నమంత్రి జ్యేష్ఠపత్ని, ఉపవిష్టయై బాలాచక్రార్చనము చేయుచుండెను. ఆమెకు దక్షిణభాగమున వంశగురువగు పురోహితుడు అర్చనకలాపము నామెకు నందించుచు జరిపించుచుండెను. ఆ సమీపముననె బాల కూర్చుండి శ్రద్ధగా పూజ తిలకించుచున్నది.

బాల కానాడు అభ్యంగనము చేయించి దాని కురులు ధూపాదికములతో నార్చినను బాగుగా నారలేదు. అందుచే దానికి జడ వదులువదులుగా నల్లి పూలు పలుచనగా తురిమిరి. దాని పాపటలో చందురురేఖయు, చెవులకు పచ్చలపోగులును, ముక్కున కెంపు పొదిగి ముత్యము వ్రేలాడు బులాకియు, మెడలో సువర్ణరత్నహారమును దాని చివర వ్రేలుచు పచ్చలపతకమును, నడుమునకు రవ్వల

యొడ్డాణమును, చేతులకు కంకణములును, దండలకు పురులును అలంకరించిరి. దాని కాళ్లకు వెండికడియములును హంసల అందెలును ఉన్నవి. దాని కటియందొక పట్టుపావడయు పైన నొక చొక్కాయియు ధరించి యాపై నద్దకముల జిలుగువస్త్రము ఉత్తరీయముగా వేసికొన్నది. పాదములకు పసుపులత్తుక లలదియున్నవి. ముఖమున కల్యాణపు తిలకమున్నది. కన్నుల కాటుకరేఖలు తీరియున్నవి. చేతులకును మెడను గంధపుబూత లున్నవి. దానిమ్మపూవువంటి దాని దేహకాంతి యాశావకాశముల నరుణకిరణములు పరపుచున్నట్లు భాసించుచున్నది. చూడగా ప్రత్యక్షముగా నవతరించిన బాలాదేవతయా యిది యనిపించుచు, చూపరను మంత్రముగ్ధుల గావించుచుండెను.

ఆ యుత్సవము చూడవచ్చిన స్త్రీపురుషులకును బాలబాలికలకును తామే కార్యమునకై యక్కడ కూడితిమో విదితమే. వారెట్టి సడియు జేయుట లేదు. బాలాదేవతయు కూడి పీఠమున నావాహితయై యున్నదని వారంద రెరుగుదురు. ఎదురుగా పరదేవత నిలిచి యున్నవిధముననే వారెల్లరు భక్తివినమ్రులై యుండిరి.

అన్నమంత్రిదివాణముతోరణము నెదుట రెండు పల్లకు లాగినవి! ముందున్నది ముత్యాల పల్లకి. అందుండి రుయ్యమ్మ సర్వభూషణవిభూషితయై నిత్యషోడశవార్షికయగు శ్రీదేవివలెనే యవతరించినది. ఆ వెనుక నున్నది బంగారు పొదిగిన పచ్చల పల్లకి. అందుండి రుద్రాంబయే దిగినది. శ్రీ రుద్రమదేవమహారాజు కాదా దిగినది! స్త్రీవేషమున నున్న రుద్రాంబయే ఈమె! పురుషవేషమున నున్నప్పు డామెకు ఎంత వీరవిలాసమో, స్త్రీవేషమున నున్నయెడ నంత లాలిత్యమున్నది యీమెలో. ఈశ్వరునివలెనే స్త్రీపుంభేదములకు నతీతయగు నొక మహాశక్తియా యీమె!

బాల పుట్టినరోజు పండుగలకు రుద్రమ్మ వెళ్లుచుండు నాచారము కలదు!

అయితే యిప్పు డామెకు యౌవరాజ్యాభిషేకమైనది. అదియునుగాక అన్నమంత్రీశ్వరులయం దామె కిప్పు డనుగ్రహము తప్పి కూడ నున్నదాయెను. రుద్రమ్మ యీనాడు వచ్చునని యక్కడివారనుకొనలేదు. ఐనను వచ్చునెడ నామెను యథార్థముగా గౌరవించుటకు సర్వసన్నాహములును చేసియుంచిరి. వారిని లకుమాంబ ఎదుర్కొని లోనికి దీసికొనిపోయెను. వెంట వచ్చిన భటులను వాకిటనే యుంచి పర్వతనాయకునితోడను దాసీజనులతో మాత్రము రుయ్యమతో గలసి రుద్రమ లోనికి వచ్చెను. అంగరక్షకు డగు పర్వతనాయకునిగూడ మండపద్వారమునొద్ద నిలిపి వా రాభ్యంతరమందిరములోని కేగిరి. రుద్రమకు రాచమర్యాద లన్నియు నడచినవి. ఆమెకు గౌరమ్మ ఎదుటబడినంతనే పూజ్యురాలగు నామెకు కుమారితయు బోలె నమస్కరింపగా నామె రుద్రమను దీవించెను.

“మహారాజువైతివి నీవువత్తువో రావో అనుకొంటి నమ్మా వచ్చినను ఎట్లు వత్తువో। అనుకొంటిని. ఎప్పటివలెనే వచ్చినావే! పరమానందమైనదే, తల్లీ!—ఇట్టిదానికి శీఘ్రముగానే సర్వశత్రువులు వశులయ్యెదరులే!—మరి యీ యమ్మాయి ఎవరు?”

ఇట్లనుచు గౌరమ రుయ్యమను నిర్దేశించెను.

రుద్రాంబ: “నా పుత్రిక రుయ్యమ్మ!—మిమ్ము నందర జూచి పోవుటకు వచ్చినది.”

రుయ్యమ్మ గౌరమ్మకు పాదాభివందనము చేసెను. ఆ వృద్ధురాలు ఈడు వచ్చిన యా పిల్ల యింకను కన్యయే యని వెంటనే గమనించి “శీఘ్రమేవ కల్యాణప్రాప్తిరస్తు!” అని దీవించుచు, “సాక్షాత్తు శ్రీదేవివలె కళకళ లాడుచున్నది యీ పిల్ల! నీ అల్లు డెవరో మహా అదృష్టశాలి కావలె, తల్లీ!” అనెను.

‘మా యల్లుని నిప్పుడే చూతువులే యమ్మా;’ యని రుద్రమ మౌనము దాల్చెను. అంతట పూజామండపమున వేదికసమీపమున దనకు ప్రత్యేకముగా నిర్దిష్టమయిన భద్రాసనమున రుద్రమ యుపవేశించెను. ఆమెసమీపముననే రుయ్యమయు నాసీన యయ్యెను.

రుద్రమ్మ యచ్చటికి వచ్చుటయు, ఆ వేషమున వచ్చుటయు, నక్కడ కూడిన ప్రధానమంత్రిమండలమున కంతయు నాశ్చర్యమయ్యెను. వారిలో పలువురు ఈ ఉత్సవమున కీనాడు అన్నమంత్రి యింటికి పోవుటా మానుటా యని వితర్కించుకొని ఎట్లో సరిపెట్టుకొని వచ్చినవారే. రాజద్రోహిగా బంధితుడైనవానియింటికి రాజపురుషు లతిథులుగా పోవుట సమంజసమా? ఐనను అన్నమంత్రి బంధములో కొన్ని చిత్రము లున్నవి. అతనియింటియొద్ద మంత్రిలాంఛనములు పోలేదు. అతనికి నిర్బంధములోగూడ వేదాధ్యయనమునకు సౌకర్యము లేర్పరుపబడినవి. కేవలము శిక్షితుడైనవానికి శిక్ష తీరనిది వేదాధ్యయనము నిషిద్ధముగదా! సంకేతములను బట్టి యన్నమంత్రిపై రాజానుగ్రహము తొలగియుండలేదని వారు తుదకు నిశ్చయించి యీ యుత్సవమునకు వచ్చియుండిరి. అందుచే రుద్రాంబ యీ యపూర్వవేషముతో నచ్చటికి వచ్చుట వారి నందర దిగ్భ్రాంతులగా జేసెను. చిరుగాలి ప్రసరించినట్లు మండప మంతట గుసగుసలు ప్రసరించి యడగిపోయినవి.

అంతలో మేనా మోసికొని వచ్చు బోయీల మ్రోత వినిపించినది. అది యన్నమంత్రి తోరణముముం దాగినది. వచ్చినది స్త్రీజనమని లకుమమ్మయు, ఎవరో యని గురునాథమారనలును పర్వతమల్లును ఒక్కమారే ఎదురుపోయిరి. ఆ మేనాలోనుండి యన్నమంత్రీశ్వరుడే దిగెను.

ఎదురుపోయిన యీ నలువురును తెల్లవోయిరి. లకుమమ్మ మరుక్షణముననే తేరుకొని యాతనిపాదము లంటి నమస్కరించి ఆనందబాష్పములు కార్చుచూ పాదములు కడిగి యీ మహాత్ముని పాదోదకము శిరస్సున జల్లుకొనెను. మారనకును గురునాథునకును ఏమిచేయవలెనో తోచలేదు. అన్నమంత్రియే వారిరువురను తన రెండుపార్శ్వములకు బిలిచి, వారికైదండతో నడచుచు, పర్వతమల్లుపై ప్రసన్నదృష్టి బరపుచు, మండపము ప్రవేశించెను.

అన్నమంత్రి చూడగా నప్పుడే నగరాంతరము పనిమీద పోయి యింటికి తిరిగివచ్చినవానివలెనే కనబడుచుండెను. ముఖమున నెట్టి దైన్యముగాని చింతగాని లేదు, కోప మసలే లేదు. అప్పుడే బంధవిముక్తుడైనవాని కుండు విస్రబ్ధభావము ముఖమున నేమాత్రము దోచుట లేదు. మండపములో నన్న సదస్యులందరు తమ కన్నులు తాము నమ్మలేకపోయిరి. అతడు సరాసరి పూజావేదికయొద్దకు వచ్చి యావాహిత యగు పరదేవతకు నమస్కరించెను.

పూజకావించుచున్న పార్వతీదేవి తన దృష్టిప్రసారముననే భర్తృపాదాభివందనము చేసెను. బాల పరుగెత్తుకొని వచ్చి తండ్రి పాదములు పట్టుకొని కాళ్లు చుట్టవేసికొన్నది. అన్నమంత్రియు దాని శిరస్సును చుబుకమును పుణుకుచు నాదరించి సౌమ్యముగా

దానిని యథాస్థానమున గూర్చుండజేసెను. అంతట నాతడు సూక్ష్మముగా లోనికి బోయి తల్లికి పాదాభివందనము చేసి వెంటనే తిరిగి పూజామండపమునకు వచ్చి, తానును ఆయింటికి పిలువగా వచ్చిన యతిథివలెనే అందుపవిష్టుడాయెను. అత డెవ్వరిని పలుకరింపలేదు. తల వంచుకొని ధ్యాన్నవ్యగ్రుడై యుండెను.

అంతట నచ్చట కుమారీపూజ యను మహోత్సవము ప్రారంభించెను. ఈ పూజ సంవత్సరము దాటి పదిసంవత్సరములు దాటకున్న కన్యకలకు చేయుదురు. సంవత్సరము దాటనివారు పూజాదుల విశేష మేమాత్ర మెరుగను గనుక పూజకు యోగ్యులుకారు. పదిసంవత్సరములుదాటిన కన్యలును ఏపూజకును అర్హలు కారని శాసింపబడినది. అందుచే నక్కడచేరియున్న కన్యకలలో కుమారీపూజకు యోగ్యలైనవారి నందరిని ఆవిశాలవేదికపై నున్న ప్రత్యేకాసనముల మీదికి రావించి బాలతోపాటు కూర్చుండజేసిరి. అంతట వారి నందరను నానావతారములు పొందిన పరదేవతనుగా భావించి, యమూల్యము లగు బంగారు పట్టువస్త్రములతో నలంకరించి, పూజ లొనర్చి అమృతపాత్ర లిచ్చి నివేదించి, యథాశాస్త్రీయముగా పార్వతీదేవి స్వయముగా కుమారీపూజ నిర్వర్తించెను. ఆ కుమారీపూజ చూచుచున్న సదస్యు లెల్లరు తాము ధన్యులమైతి మని వ్యగ్రచిత్తులై యామహోత్సవము తిలకించుచుండిరి.

కుమారికల నందరను పూజించిన పిమ్మట వారిని యథాస్థానములకు బంపి యామెబాలాచక్రార్చనముపూర్తిచేయుచుండెను. అర్చనావసానమున పార్వతీదేవి పురోహితుని నిర్దేశమున అమృతపాత్ర ముందుగా అన్నమంత్రీశ్వరున కర్పించి పిమ్మట తాను గ్రహించెను. సదస్యుల కందరకు తీర్థప్రసాదములు పంచిపెట్టిరి. భూసురులందరు బహువిధముల నాశీర్వచనము లొనర్చిరి. వారు వేదమంత్రము లుచ్చరించుచుండ వారితో నన్నమంత్రీశ్వరుడును తన కంఠము కలిపి పార్వతీదేవిని బాలను ఆశీర్వదించెను.

నృత్యగీతాదిసమర్పణము వచ్చెను. ఆ సమయమున మదాలస సూచద్దేవిసాయముతో పవిత్రమనోజ్ఞ మగు విధముగా లలితోపాఖ్యానమునుండి కామసంజీవనము నభినయించి పరదేవత కర్పించెను.

ఆ మహోత్సవమున కానాడు రుద్రమ్మ రాకయు అన్నమంత్రి రాకయు నపూర్వశోభ చేకూర్చెను. వచ్చిన యతిథుల కందరకు నాపూట మహావైభవముగా విందు జరిగెను. అన్నమంత్రిమహాభవనము అంతమంది యతిథుల నర్చించుటచే ధన్య మయినదని తలంచుచున్నట్లే కనిపించెను. అతిథులును పరదేవతాప్రసాదము తమ కానాడు ప్రాప్తించినందుకే కృతార్థుల మైతి మనుకొనిరి.

ఆ నాడు బాలకు రుద్రమ్మ తెచ్చి యర్పించిన కట్నములు అమూల్యము లైనవి. మరియు నితరులు తెచ్చిన బహుమానములతో నన్నమంత్రీశ్వరుని గృహమంతయు బంగారువెండి వస్త్రములతోడను అమూల్యవస్త్రాభరణములతోడను నిండియే పోయెను. ఆ సాయంత్రము ఉత్సవము పూర్తియగునప్పటికి అతిథుల కర్పించిన గౌరవపు కానుకలతో రెండంతలు బంగారువెండివస్త్రాదులు వెచ్చింపబడెను.

చిత్రముగా రుయ్యమ్మ యానాడాయింటిలోని పిల్లవలెనే కలసిపోయినది. అది చూచుచున్న అన్నమంత్రికి ఆశ్చర్యముతోపాటు చిత్రచిత్రమైన యూహలు హృదయములో నాట్యమాడజొచ్చెను. మారనపై బాలకు కలుగుచున్న అవ్యాజానురాగమును అన్నమంత్రి హృదయమునకు ఎక్కినది.

భోజనతాంబూలాదికము లైనంతట అతిథులలో పురుషులందరు నొక్కరొక్కరే బయలుదేరి తమతమనివాసముల కరిగిరి, స్త్రీలును కన్యకలును మాత్రము ఆసాయంత్రము పేరంటమునకై యందే నిలిచిపోయిరి. అట్లు నిలిచినవారిలో రుద్రమయు రుయ్యమయు గలరు.

ఆ నాడచ్చట నన్నమంత్రియు నతిథులకు నొకనివలెనే సంచరించెను. భోజనాదికమైన పిమ్మట నతిథు లందరును బయలుదేరి వెళ్లుచుండగా వారితో నాతడును బయలుదేరెను. వెళ్లుటకు ముందు అతడు లోపలికి పోయి సూక్ష్మముగా తల్లికి నమస్కరించెను. గౌరమ యాతని లేవదీసి కౌగిలించుకొని దీవించెను. ఆ సమయమున రుద్రమ్మ సమీపముననే యుండెను. తల్లియొద్దను రుద్రమహారాజుల యొద్దను సెలవు తీసికొని, నమస్కరించిన పార్వతిని లకుమమ్మను దీవించి, బాలను ముద్దాడి, యన్నమంత్రి బయలుదేరెను.

బాల మనస్సు చిన్నపుచ్చుకొనకుండుటకును దానిని తండ్రి దీవించు నవకాశ మిచ్చుటకును ఆతనికి రుద్రమ స్వేచ్ఛానుజ్ఞాపత్రముతో మేనా యిచ్చి పంపియుండెను. దాని ననుసరించి యాతడీనాడిక్కడికీ వచ్చియుండెను. ఇప్పుడు ఉత్సవము ఐపోయినది. తనకిక నిక్కడ పని లేదు. కాన మరల సిద్ధముగా నున్న మేనాపై ప్రత్యేకముగా తనకు నిర్ణీతమై యుండిన కారాగారమున కాతడు బయలుదేరి వెళ్లెను. ఇక్కడ నున్నంతసేపును అతడు చింతతో లేడు. ఉత్సాహముగనే యుండెను. ఇప్పుడు కారాగారమునకు తిరిగి వెళ్లునప్పుడును అతని కెట్టి చింతయు లేదు. ఇక్కడ నున్నంతసేపును అతడు సామాన్యపుగౌరవప్రీతివచనములు తప్ప విశేష మెవరితోడను మాటాడలేదు.

వచ్చిన యతిథులకును అన్నమంత్రియింటిలోనివారికిని అది యొక యింద్రజాలముగనే తోచినది. నిజముగా నా వచ్చినది యన్నమంత్రీశ్వరుడేనా? అత డిన్నాళ్ల కింటికి వచ్చియు పూజ్యురాలగు తల్లితో నేకాంతమున మాటాడలేదు. పత్నులతో మాటాడలేదు. బాలతో నైన నెక్కువ మాటాడలేదు. పర్వతమల్లుతో గాని యితర బంధువులతో గాని సంభాషింపలేదు. యజమాని యాదరించునట్లు అతిథులను గూడ పలుకరింపలేదు. తిక్కనసోమయాజులను గూడ ముక్తసరిగా తప్ప పలుకరింపలేదే! వచ్చినది నిజముగా నన్నమంత్రియేనా? ఇంద్రజాలమా?

ఇన్నాళ్లును అన్నమంత్రి వ్యవహారశాలలో వ్యవహారములు చూచుచున్న తిక్కచమూపతికి మాత్రము ఏలనో ఆ నాడు మనశ్శాంతియే లేదు. వ్యవహారశాలలో నతని కానాడు అందిన పత్రములు కలవరము కలగించెను. దానికితోడుగా మారన్న యాయింటి కుమారునివలెనే ప్రవర్తించుచుండుట యాతనికి సంక్షోభమే కలిగించెను.

ఇప్పటికి పదియేండ్లక్రిందట తిక్కచమూపతి యేకైకపుత్రుడు ఆరేండ్లవాడు, కనబడకుండ బోయెను. ఇప్పు డాతడు జీవించి యున్నచో మారన యీడుండును! ఇంతవాడే యై యుండును! నా కా భాగ్యమేదీ?

ఆ నా డాతడు చూచిన పత్రములు అన్నమంత్రిపైనను మారనపైనను గూడ సందేహములు దృఢపరచునవే! ఏమి చేయగలడు? ఆ రాత్రి రుద్రమ నిజభవనమునకు చేరినపిమ్మట, తిక్కచమూపతి రాజసేవకు బద్ధుడై యా పత్రములన్నియు రుద్రదేవమహారాజులకు నివేదించెను.

విద్య: స్త్రీ సంస్కృతి

శ్రీమతి జొన్నలగడ్డ శ్యామసుందరి

స్త్రీ, తను ఏంకావాలీ, అనే ఆదర్శ విచారణమీద, స్త్రీవిద్య ఆధార పడివుంటుంది. కొంతమంది ఆడవాండ్లు ఉద్యోగాలు చెయ్యాలని కోరుతారు. కొందరు వివాహంచేసుకొని, కాపురం చేస్తూ, పిల్లలూ, సంసారంచెయ్యాలని, అనుకుంటారు. ఏ కొద్దిమందో, ఈ రెండూ కూడా కావాలనుకుంటారు. అంటే, ఉద్యోగంచేస్తూ, సంసారం సర్దుకోవడం కూడా కొందరు వాంఛిస్తారు. మామూలుగా ఈ కోర్కెలమీదే, చెప్పే చదువు ఆధార పడివుండాలి. ముఖ్యంగా చెప్పాల్సిన విషయం స్త్రీలకు, పురుషులకు, దైనికజీవితంలో కావాలసింది, ఒకేరకమైన సమిష్టి విద్యమాత్రం కారాదు అని.

నూరుమందిస్త్రీలలో 80, 90 మంది అయినా 'కుటుంబం, కావాలి' అని అనేవాండ్లే. వాళ్లు విజ్ఞానంకోసం, స్కూళ్లల్లో, కాలేజీలల్లో చదివినా, తరువాత ఎవరి ఇంట్లోనో గృహిణులు కావలసిన వాళ్లే. ఇక ఉద్యోగం చేయదలచుకున్న వాండ్లకు, మామూలుగా కళాశాలల్లో చెప్పే చదువే సరిపోతుంది. ఉద్యోగం సంసారం, రెండూ కోరేవాళ్లుకూడా, మొదటివారికి చెప్పే పద్ధతుల్లోకే వస్తారు.

ఈ 'కుటుంబాలు కావాలి', అనుకోవడం ఒక్క మనదేశంలోనే అని నాగరికతగల పరాయిదేశాల్లోఅంతా ఉద్యోగాలు చేస్తూ, స్వతంత్రంగానే వుంటారు అని కొందరు అనడం కద్దు. ఇది నిజంగా కనిపించదు. 100 టికి, ఏ ఐదోతప్ప స్త్రీలలో ఉద్యోగాలు చేయడంలేదు

గృహకృత్యాలు, సమర్థతలో నిర్వహించడం, ఉద్యోగంకంటే, బాధ్యతాయుతమైనది. ఇటు పిల్లల ఆరోగ్యాన్ని విద్యని ఇతరసౌకర్యాల్ని చూడటానికీ, అటు సకాలంలో ఇతర అవసరాల్ని తీర్చి దిద్దడానికి, నేర్పు, ఓర్పు, సహనము చాలా అవసరం. తీరిక దొరకినప్పుడు కాలాన్ని సద్వినియోగం చేయడం గృహిణినేర్పు.

భర్తని, బంధువుల్ని, స్నేహితుల్ని, సుఖపెట్టాలంటే, గృహిణికి విద్య, సంస్కృతి, నేర్పు, చమత్కారం ఎంతో అవసరం, దానివల్ల ఎన్నోకష్టాలు, భేదాభిప్రాయాలు అంతరిస్తాయి - గృహం ప్రశాంతంగా వుంటుంది.

అసలు 'విద్య' అంటే ఏమిటి ? స్త్రీకి ఎలాంటి విద్య కావాలి ? ఎందుకు చదవాలి? అని మనం తర్కిస్తాం. వెంకమ్మగారి అమ్మాయి సరళను గుంటూరు పంపారుట. నన్ను చదివించరాదా ? అంటే పిల్లను పంపుతున్నారు కొందరు. ఎలాగైనా చదువుకున్న అమ్మాయిలకు పెళ్లిళ్లు తేలిగ్గా జరుగుతాయని కొందరి నమ్మకం. మన అమ్మాయి 'రేవతి' ని చదివిద్దామని, కమలమ్మగారు అంటే, లక్ష్మయ్యగారు చదివిస్తున్నారు కాని, అసలు ఏమిటిచేస్తున్నామో, అని ఆలోచించరు. చదువుకోడంలో చెప్పొచ్చే దేమిటంటే ఒక నిర్దిష్టమైన ఉపయోగాన్ని ఆశించకపోవడం కేవలం నిష్ఫలంఅని.

'నాగరికతారాజ్యంలో స్త్రీలు' అని జాక్ప్రెస్‌లాండు ఓ గ్రంథం వ్రాశారు. అందులో ఆయన 'నాగరికత ఆదర్శం ఏమిటి' అని అడిగారు. ప్రతి స్త్రీ ప్రతిపురుషుడూ, తను పూర్తిగా అభివృద్ధి పొందాలని కోరుతారు. అలా, ఏ, అడ్డంకులూ లేకుండా అభివృద్ధిపొందగలిగే వాతావరణం సృష్టించటమే, నాగరికత, ఆదర్శం అని అన్నారు ఆయన. కేవలం డిగ్రీహోదా కోసం కాకుండా, ఒక ప్రయోజనాన్ని, మానసికవిజ్ఞానాన్ని సాధించాలి.

ప్రాచీనస్త్రీల సంస్కృతి

జాక్‌స్టూవర్టు మిల్లు, నూతనప్రపంచం ఎలా ఉండాలీ అనే విషయం చర్చించారు. 'ఎవరికి, ఏది సంపాదించుకోవాలనివుంటే, దాని సంపాదనకు పూర్తి స్వాతంత్ర్యం వుండటమే, మన నూతనప్రపంచంయొక్క ఆశయమని, ఆయన చెప్పారు. ఇది ఎంతైనా, గమనించవలసిన విషయం.

మన 'భారతదేశం నాగరికతాప్రపంచం' అని అంటున్నాము. స్వతంత్రం తెచ్చుకొని, గొప్ప దేశం కావాలని అనుకుంటున్నాం. ఇలాంటప్పుడు, పైన ఇద్దరు చెప్పినవీ, భారతదేశం అమల్లోపెట్టడం, ఎంతైనా అవసరంగా తోస్తుంది.

'అది అంతా నిజంకావచ్చు. ఏదో తమాషాకి స్కూలు ఫైనల్ దాకా చెప్పించు' అంతేగాని, వీళ్లంతా డాక్టర్లయితే, సంసారాలు ఏంగానూ ? అసలు, స్త్రీలు - మన పెద్దకుటుంబంవాళ్లు, కష్టపడి చదవలేరు' అని పెద్దవాళ్లంటారు.

ప్రొఫెసరు ఆల్తేకరు అనే ఆయన (*Anciant India*) లో విద్య-అనిగ్రంథం వ్రాశారు. ప్రాచీన స్త్రీలు విద్యతో ముందంజవేసిన కొన్ని నిదర్శనాల్ని వారు విపులీకరించారు. ఆ గ్రంథంలో గార్గి, మైత్రేయులు - అనే ప్రాచీన స్త్రీలు వేదాంతంలో ఎలా పరిశ్రమ జరిపిందీ వివరించారు.

గాధాసప్తశతిలో, రేవ, రోహ, మాధవి, అనూలక్ష్మి, పాహై, వరావహి, శశిప్రభ' అనే 7 గురు కవయిత్రుల పేర్లు కనిపిస్తాయి. ఇక సంస్కృతంలోచూస్తే, శీలభట్టారిక, గుజరాత్‌లో, దేవీ, విజయాంక అనేవాళ్లు ఆకాలంలోనే, సాహిత్యంలో పేరు సంపాదించిన విషయం తెలుస్తుంది.

ఇంక వైద్యానికివస్తే మచ్చుకి, క్రీస్తుశకం 8 వ శతాబ్దంలో 'రూసా'అనే స్త్రీ వైద్యురాలు కనిపిస్తుంది.

క్రీస్తుశకం 2 వ శతాబ్దంలో—నాయానిక,
,, 4 ,, ,, —ప్రభావతిగుప్త
,, 7 ,, ,,—విజాయభట్టారిక

పాండిత్యంలో చెప్పదగ్గవారు.

రాజ్యనిర్వహణలో సుగంధ, దిద్ద, అనే స్త్రీలు, కాశ్మీరరాజ్యం పరిపాలించినట్లు తెలుస్తుంది.

ఇక ఈ కాలంలో చెప్పనక్కరలేదు. రసాయనశాస్త్రంలో మేడమ్ క్యూరీలాంటివాళ్లున్నారు. రాజకీయాలలో శ్రీమతి

(29-వ పేజీ చూడుడు)

కథానిక :

శుభలేఖ

"శ్రీ సత్యనారాయణ శ్రీవాత్సవ"

"నాకేమీ ఉత్తరాలు లేవోయి రామస్వామీ?" అని వేంకటరావు అడగడమే తడవుగా "మీ కేమీ లేవండీ" అని చెప్పి అప్పుడే అల్లంతదూరంలో అంతర్ధానమయ్యాడు పోస్టుమాన్ రామస్వామి. ఆఫీసు గురించి రావలసిన ఉత్తరంకోసం ఎదురు చూచి చూచి ఆశాభంగం పొందిన వెంకట్రావుకి మరొకరోజు గడచిపోయింది. ఉదయం టపా వచ్చిందంటే, మళ్లా పదకొండు గంటలకి రిజిస్టరీలు ఇవ్వడానికి మరొక పోస్టుమాన్ వస్తాడు. కాని తనకు రావలసిన కబురు రిజిస్టరులో ఎలాగ వస్తుంది? మరొక ఇరవై నాలుగు గంటలు పోవాలి తిరిగి రేపటిరోజు టపా రావడానికి. ఇక మధ్యలోంచి ఆదివారాలు సెలవు ఇస్తే మరొకరోజు గడుపుకోవాలి. వేంకటరావు మనసు బాధగానే ఉన్నది. బదలీ కావాలని విశ్వప్రయత్నం చేశాడు లాభంలేకపోయింది. సెలవు పెట్టి ఇంట్లో కూర్చున్నాడు ఏవిధంగానైనా బదలీ కలిగే అవకాశం ఉంటే ఆ శుభవార్త ఉత్తరక్షణంలో తనకు తెలియచెయ్యాలని తన శ్రేయోభిలాషులని ఇందు నిమిత్తం ఏర్పాటు చేశాడు. ఈపాటికి ఏ సంగతీ తెలియవలసిందే మరి. క్రిందటివారం తన పనిచేస్తున్న వాళ్లకు ఒకరిద్దరికి బదలీ అయినట్లు గాలివార్త వచ్చింది. తనమాటే ఎంతకీ తేలకుండా ఉన్నది. ఈ అధికారులు అయినవాళ్లకి ఆకుల్లోనూ, కాని వాళ్లకి కంచాలలోనూ పెట్టేరకం. ఇక్కడనించి కదలను మొర్రో అనేవాళ్లని వాళ్లకి నచ్చినచోట్లకి మారుస్తారు. తనబోటివాళ్లను, ఎన్ని దరఖాస్తులు పెట్టి ఎంత వేడుకొని బదలీచెయ్యవలసిందని ఎంత ప్రతిమాలినా అలాగే ఉంచుతారు. మొత్తంమీద రావలసిన ఉత్తరం వేంకట్రావుకి రావడం లేదు. క్షణాలు యుగాలుగా గడుస్తున్నాయి

ఈవారఫలితాల ప్రకారం బుధవారం తనకు శుభవార్త తెలియాలని ఉంది. అదీగాక జ్యోతిష్కుడు గోచారఫలాలు చూచి త్వరలో తనకు స్థానచలనం ఉందని చెప్పాడు. నిజమే మర 'రవి' గతవారంనించి తనరాశిలో ప్రవేశిస్తూ ఉన్నాడు. చలనం తప్పదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి, అయినా తన శుభవార్త రాలేదు,

వేంకట్రావు ఊరిలోకి బయలుదేరి తన మిత్రుడి మెడికల్ షాపులో కూర్చున్నాడు. మిత్రుడు రంగారావు వేంకట్రావు వాలకం కనిపెట్టి 'అయితే ఈవేళకూడా ఉత్తరాలు రాలేదేమిటోయ్' అని పరామర్శ చేశాడు.

కొంతసేపు బాతాఖానీ అయినతర్వాత మరో 'బీటు' పోస్టుమాన్ షుఖాన్ సాహెబు వచ్చాడు. "బాబుగారు! మీ రిక్కడే ఉన్నారా? మీకు ఒక రిజిస్టరీ వచ్చిందండీ అని సంచీ తీస్తున్నాడు.

వేంకట్రావు "నాకు రిజిస్టర్ ఏమిటి ఆఫీసునించేమో" అని ఆత్రంగా చూస్తున్నాడు.

"త్వరగా తీయవోయ్! సాయెబూ! ఆయనకి చాల తొందరగా ఉంది. ట్రాన్సఫరు ఆర్డరు ఏమో చూడు" అని రంగారావు వేళాకోళం చేశాడు. "ట్రాన్సఫరు ఆర్డరు రిజిస్టరీగా రావడం ఎందుకు?" అని అడిగాడు. "ఇదేదో శుభలేఖండి బాబూ" అని పోస్టుమాన్ పైకి తీశాడు. "చిత్రంగా ఉందే-శుభలేఖకు రిజిస్టరీ యెందుకు?" అని వేంకట్రావు ఉత్తరం తీసుకున్నాడు.

"ఈ బుద్ధిమంతు డెవ్వరో అందుతుందో అందదో అని రిజిస్టరా కట్టాడు. అంత చిత్రపుపెళ్లికొడుకు ఎవరు?" అని రంగారావు అడిగాడు. "తిరుగురశీదుకూడా కట్టారండీ? ఇక్కడ సంతకం పెట్టండి" అని పోస్టుమాన్ సంతకం పెట్టించుకొని వెళ్లిపోయాడు.

"తిరుగురశీదుతో రిజిస్టరీ కట్టిన పెళ్లికొడుకు అసాధ్యుడై ఉండాలి. ఇలాగ అం



దరికీ శుభలేఖలు పంపితే అదొక మజా! అని రంగారావు వ్యాఖ్యానాలు చేస్తూ వట్టి వెయ్యివిధాలు అని తేల్చాడు.

"ఉత్తరం పంపినది పెళ్లికొడుకు కాదు, పెళ్లికూతురు" అని వెంకట్రావు ఆ అందమైన కవరుఅడ్రెసు అటూ యిటూ త్రిప్పుతున్నాడు. కవరులోపల పచ్చకాగితం మీద ముచ్చటయిన అచ్చుతో పెండ్లిపిలుపు అని వ్రాసిఉంది. అది త్రిప్పి చదువుతూ ఉంటే లోపలనించి ఒక్క నీలికాగితం మడత క్రింద పడింది. వెంకటరావు ఆనీలికాగితం విప్పి చదివాడు. రంగారావు ఇదంతా చూచి శుభలేఖ రిజస్టరీకట్టిన పెళ్లికూతురు ఎవరా అని ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం కలిపిన ముఖం పెట్టి చూస్తున్నాడు.

వేంకటరావు శుభలేఖా, ఉత్తరం చదవడం పూర్తిచేశాడు. చదువుతూఉన్నంత సేపు అతనిముఖంలో ఒక కొత్తవెలుగు కనిపిస్తోంది. కళ్లు నవ్వుతున్నాయి. పెదవులు ఒక చిరునవ్వులోకి విరుచుకొని రంగారావు ఇచ్చిన సిగరెట్టును అందుకొని ఒక చిన్న పొగదుమబ్బు వదలి బిగువు విప్పి మళ్లీ నవ్వుతో వికసించాయి.

రంగారావుకుతూహలం అతిశయిస్తోంది. చనువుతో ఆ శుభలేఖ చూచాడు ఫలానా వారి జ్యేష్ఠపుత్రిక రాజ్యలక్ష్మీదేవి (యం బి. బి. యస్) ని ఫలానావారి అబ్బాయి సుబ్బావధానులు యం.ఏ. గారి కిచ్చి నర్సాపురం గ్రామంలో ఫలానావారి స్వంతగృహంలో వివాహంచేస్తున్నారుకనక అందరూ వచ్చి తత్కృతచందనతాంబూలసత్కారాలు అందుకోవాలసిందని ఆ లేఖలో ఉన్నది. అది చూచి "ఎవరోయ్! ఈ బుద్ధిమంతురాలు" అని రంగారావు అడిగాడు.

వేంకట్రావు ముందు తెలియనట్లు ఎవరో, నాకు జ్ఞాపకం రావడంలేదు. అని తప్పుకోబోయాడు.

లోపల ఉత్తరం చదివినా గాని జ్ఞాపకం రాలేదూ? ఈ వేషానికేం అసలు సంగతి చెప్పవోయ్" అని రంగారావు ఇంకా అడుగుతున్నాడు.

"అయితే ఆ అమ్మాయి వ్రాసిన ఉత్తరం చదువుతాను విను." అని వేంకట్రావు మొదలు పెట్టున్నాడు. 'అక్కర్లేదు, నీ రహస్యం ఎవ్వరూ అడగడంలేదు-అసలు వ్యవహారం ఏమిటో చెబితే చాలు. అంతే" అని రంగారావు ఏమీ ఎరగనట్టు ఊరుకున్నాడు.

"ఇందులో రహస్యం ఏమీ లేదు. చదువుతాను. విను.

శ్రీ వేంకట్రావుగారికి రాజ్యలక్ష్మి అనేకనమస్కారాలతో వ్రాయునది. నన్ను ఈ పాటికి మరచిపోయి ఉంటారని తలుస్తాను. మీరు విశాఖపట్టణం ఆసుపత్రినించి వెళ్లిపోయినతర్వాత నేను ఒకటిరెండుసారులు మాత్రం అక్కడికి వెళ్లాను. అక్కడ ఉన్న మెటర్నిటీ స్పెషలిష్టు మీరు ఎరగనివారు కారు. అతనినిగురించి ఎంతతక్కువ చెపితే అంతమంచిది. మీరు ఉన్నపుడు మీకోసం నేను వచ్చేదానను. ఆ రోజులు, బీచీలో మనం షికార్లు వెళ్లడం, అవన్నీ జ్ఞాపకం ఉంటాయని తలుస్తాను. నేను నర్సాపురంలో ప్రాక్టీసుపెట్టాను. బాగానే ఉంది. రేపు వైశాఖ బ॥ పంచమినాడు నా వివాహం. ఆయన బెంగుళూరులో ప్రొఫెసరుగా పనిచేస్తున్నారు.

మీకు శుభలేఖ పంపినాను. ఎప్పటివాత్సల్యంతో నన్ను జ్ఞాపకం ఉంచుకొంటారను కొంటాను. మరి సెలవు, రాజ్యలక్ష్మి

"అయితే ఆమెకూడా డాక్టరే అన్నమాట." అని రంగారావు మళ్లా అంటున్నాడు.

"అవును డాక్టరే. అపుడు నాస్టూడెంటు" అని వేంకట్రావు అంటున్నాడు.

"అయితే—పెళ్లిచేసుకుంటానని భ్రమపెట్టి ఏమైనా ఆశపెట్టావేమో?" అని రంగారావు ఇంకా కథ పైకి తీస్తున్నాడు.

వేంకట్రావు సిగరెట్టు అంటించి మరొక పొగమబ్బు వదలి కథ చెప్తున్నాడు. రంగారావు శ్రద్ధతో వింటున్నాడు.

"రంగా! నీవు చెబితే నమ్మవు కాని ఈ అమ్మాయితో నాకంతపరిచయం లేనేలేదు. అందరితోనూ మాటలాడినట్టే ఈ రాజ్యలక్ష్మి తోనూ మాటలాడేవాడిని అంతే. మరి విశేషం ఏమీ లేదు. కాని ఎంతో పరిచయం ఉన్నట్టు శుభలేఖ పంపించింది." అని వేంకట్రావు ఆలోచనలో పడ్డాడు.

"అసలు ఏమీ లేకుండా బీచిషికారు అదీ జ్ఞాపకం చేస్తుందా?" అని రంగారావు కొంటెప్రశ్న వేశాడు.

"అది కాదు. అసలు సంగతి చెబుతున్నానుగా! ఇందులో దాపరికం ఏమీ లేదు. నేను అమెరికానించి తిరిగివచ్చిన కొత్తరోజులు. విశాఖపట్టణంలో మెటర్నిటీస్పెషలిష్టుగా వేశారు. అపుడు అనేకమంది మెడికల్ స్టూడెంట్సులో రాజ్యలక్ష్మి ఒకర్తె. నేను ఎపుడు లెక్చరు తీసుకున్నా ఆ అమ్మాయి నా కేసే చూస్తూఉండేది."

"అయితే మరింకెవ్వళ్లూ లేడీస్టూడెంట్సు లేరా?" అని రంగారావు అడ్డుప్రశ్న

"లేకేం మరి" అయిదుగురు ఉండేవాళ్లు. ఇద్దరు క్రిష్టియన్లు ఎలిజబెతు, మేథ్యూస్. వాళ్లతోనే ఎక్కువచనవుగా ఉండేవాడిని." అని వేంకట్రావు శ్రద్ధగా చెబుతున్నాడు.

"అవుతులే కాకిబంగారం కాకిబంగారంతో అతుకుతుంది" అని రంగారావు అంటించాడు.

"ఛా! మనకి అలాంటివి అసలే పడవు. కొత్తలో లెక్చరు అంటే శ్రద్ధ వుండేది. ఒక రోజున లెక్చరు అయిపోయింది. అందరూ వెళ్లిపోయారు. రాజ్యలక్ష్మి మరినలుగురు మగడాక్టర్లూ కలిసి, వెయిటింగురూములో కూర్చున్నాము. అందరూ కలిసి టీకి ఆర్డరిచ్చారు. నాకు టీ అసలే యిష్టంలేదు. వద్దన్నాను. రాజ్యలక్ష్మి నా సంగతి కనిపెట్టి —నాకోసం లేతకొబ్బరిబొండాలు ఆర్డరిచ్చింది రెండుబొండాలు వచ్చాయి. వాటిని ఐస్ గ్లాసులో పోసి నౌకరు అందిచ్చాడు నేను ఏమీ మాట్లాడలేదు. మేమిద్దరమూ కొబ్బరినీళ్లు త్రాగినతర్వాత నౌకరు చేతికి రాజ్యలక్ష్మి వాటిఖరీదు ఇచ్చేసింది.

నువ్వెందుకు ఇవ్వడం? అని రాజ్యలక్ష్మిని కొంచెం కోపంగా చూచినట్టు చూచాను.

"ఏం? డాక్టరు? తప్పా? ఒక్కసారి కూలుడ్రింకు ఇవ్వడానికికూడా మీ స్టూడెంట్సుకు అవకాశం ఇయ్యరా?" అని రాజ్యలక్ష్మి ఏదో అనబోయింది.

నేను మాట్లాడలేదు. అపుడు మళ్లీ "అవును లెండి ఇతరడ్రింకులు అలవాటుపడిన వారికి నాటురకం కొబ్బరిడ్రింకులు ఏం నచ్చుతాయి?" అని వేళాకోళం చేసింది. నాకు కోపం వచ్చింది. కోపం సంగతి చెప్పానుకూడాను. పట్టిడ్రింకులు ఏం లాభం? ఒకరోజు మృష్టాన్నభోజనం పెట్టకూడదా!" అని అడిగాను.

"మీలాంటివారు మా యింటికి భోజనానికి ఎందుకు వస్తారు," అని ఎగతాళి చేసింది. "సీరియస్ గా పిలుస్తే ఎందుకు రాను "బ్రాహ్మణో భోజనప్రియః" అని చెప్పాను.

"అలాగా?" అని అప్పటికి మాటలాడలేదు. నాశాఖసంగతి తెలియగానే ఎలిజబెత్ భర్తఅనితోచిందో ఏమిటో! ఒకసారి వాళ్ల

తండ్రిగారిని తీసుకొనివచ్చి పరిచయం చేసింది మర్నాడు వాళ్లయింట్లో విందు. మనకంటె చాదస్తం వాళ్లకి నిప్పు నీళ్లతో కడిగి తీసుకుంటారు. నాచేత మడిబట్టలు కట్టించి మరీ భోజనంచేయించారు.

"ఇంత చాదస్తంవాళ్లు కూతురుచేత మెడికల్ ఎలాగ చదివించారు?" అని రంగారావుప్రశ్న.

"నాకు అదే ఆశ్చర్యం వేసింది, ముందు ఈ అమ్మాయికి వివాహంచేసినతర్వాత వితంతువు అయిందేమో అని అనుమానం కలిగింది లేదట ముందు ఎవరికో వివాహసంబంధం కుదిరిన తర్వాత ఇచ్చిపుచ్చుకోవడాల్లో తేడా వచ్చి సంబంధం పోయిందట. అప్పటినించీ పట్టుదలతో తండ్రి ఈ అమ్మాయిని మెడికల్ చదివించాడట. మొత్తంమీద భోజనాలు అవీ అయినతర్వాత నేను తిరిగి వచ్చేశాను. మళ్లీ మామూలు క్లాసులో ఆ అమ్మాయిని కలుసుకోవడం తప్ప విశేషంలేదు. మరొకరోజు! నేను చాలసేపు ఆసుపత్రిలో పని చేసి అలసిపోయి వెయిటింగురూములో ఒంటరిగా కూర్చున్నాను. అప్పటికే నా మనస్సులో పరిపరి ఆలోచనలు పోతూ ఉన్నాయి. ఆ ఆలోచనలపరంపర నా సిగరెట్టుపొగ మేఘాలతో కొత్తకొత్తరూపాలు పొందుతూఉంది. రాజ్యలక్ష్మి నా ప్రక్కన వచ్చి కూర్చుంది. నేను గుర్తుపట్టనే లేదు. సిగరెట్టు అయిపోయింది; రెండో సిగరెట్టు అంటిస్తున్నాను.

"డాక్టరు! అలాగ అమితంగా సిగరెట్టు కాలుస్తూఉంటే నీ ఆరోగ్యం చెడిపోదూ?" అని రాజ్యలక్ష్మి మందలిస్తూ మాటలాడింది.

"చెడిపోతే నీకేం?" అని నేను చిరాకుగా అన్నాను.

నాకేం అని కాదు. నిక్షేపంలాంటి మీ శరీరం ఎందకు చెడగొసుకొంటారని మీ మనసులో ఎదో బాధిస్తూ ఉందా? నాతో చెప్తే నేం?" అని చనువుగా అడిగింది.

"లక్ష్మీ! నా మనస్సులో బాధ! నా సిగరెట్లు అలవాటూ నీకు అనవసరం. నీపని నీవు చూచుకో" అని చెప్పి వెళ్లిపోయాను. నాఆత్మీయవిషయాలలో యీవిడకు జోక్యం ఎందుకు అనిపించింది. అపుడు నిజానికి నేను చాలామోటుగానే ప్రవర్తించాను. కాని ఆ అమ్మాయి అన్నీ మరచిపోయేఉంటుంది. నన్ను అదోరకంగా చూస్తూనే ఉండేది.

మరికొన్నాళ్లతర్వాత ఊరిలోకి ఎదో ఇంగ్లీషు సినీమా వచ్చింది. అందరూ స్టూడెంట్సూ డాక్టర్లు వెళ్లారు. నేను వెళ్ల లేదు. వాళ్లంతా మొదటిఆటకు పోవడం చూచి రాజ్యలక్ష్మి నావద్దకు వచ్చి డాక్టర్ మనం ఇద్దరం రెండోఆటకు వెళ్దాం! నాతో రాకూడదూ? అని అడిగింది.

"నీకు సినీమాకు వెళ్లాలని ఉంటే మిగతా స్టూడెంట్సుతో వెళ్లకపోయావా? నాతో పెళ్లికానివాడితో పెళ్లికానిదానిని రాజ్యలక్ష్మి నీవు ఒంటరిగా రావడం ఎందుకు?" అన్నాను.

"మీతో వెళ్లాలనే నాకు ఉంది..."

"మీ నాన్నగారు ఏమీ అనరూ?"

"మీతో వెళ్లడానికి మా నాన్నగారు ఏమీ అనరు.

"మీతో సినీమాలకు బీచీకి వెళ్లవచ్చు అన్నారు" ఆమాట విని నాకు గొంతుక అడ్డు పడినట్టు అయింది. అప్పటికిమాత్రం "అదా! నాకు తలకాయినొప్పిగా ఉంది. నేను సినీమాకు రాలేను క్షమించు రాజ్యలక్ష్మి! అని చెప్పి" వచ్చేశాను. తరవాత రాజ్యలక్ష్మితో అంత చనువుగా మాటాడలేదు. నాకు బదిలీఅయ్యే సమయంలోకూడా ఒంటరిగా వచ్చి నాతో మాటలాడబోయింది. నేను అటువంటి అవకాశం ఇవ్వనేలేదు. ఆ పిల్ల అంటే అంత భయంగా ఉండేది." అని వెంకట్రావు తిరిగి సిగరెట్టు కేసీ శుభలేఖకేసీ చూచాడు.

"ఏం అంతకురూపిగా ఉంటుందా?"

"నిజానికి రాజ్యలక్ష్మి చాల రూపవతి. ఇప్పటి చదువున్నవాళ్లకు లేనిఅందచందాలు, వినయవిధేయతలు ఆమెలో ఉన్నవి." అని వెంకట్రావు మృదువుగా చెప్తున్నాడు. "మరి అయితే అలాంటిఅవకాశం ఎందుకు వదులుకొన్నావు" అని రంగారావు మళ్లీ అటకాయించాడు. కాదు. రాజ్యలక్ష్మి చేసుకుంది. కావాలని పక్షికోసం వచ్చే పరాపరంలాగ కనిపించింది. వాళ్ళనాన్న స్వయంగా ఈ పిల్లను ప్రోత్సహించి నాతో బీచికి వెళ్ళమని, సినీమాలకు వెళ్లమని ఉసి కొల్పుతూఉన్నట్టు అనిపించింది. నే నేదో రాక్షసినోట్లోకి ఉరుకుతున్నట్టు భయం వేసింది. వాళ్లిద్దరూ నాకోసం ఉచ్చులు పన్ని ఎలాగో నన్ను అందులో ఈడుస్తున్నట్టు అయింది. ఎలాగో యీ వలనించి తప్పుకోవాలని అనుకున్నాను. తప్పుకొన్నాను. బయటపడ్డాను" అని వెంకట్రావు పూర్తిచేశాడు. "అయితే ముందు బీచీ షికార్లూ అవీ చేసి ఎందుకు ఆశపెట్టావు"అని నిలదీసి అడిగాడు రంగారావు.

"ఆడది మగవాడూ కలిసి తిరగగానే ఏదో ఒక సంబంధం ముడిపెట్తారు మనవాళ్లు. నాకటువంటి ఉద్దేశాలు లేవు" అని చెప్పడానికే నేను షికార్లు చేశాను.రంగా! మెడికల్ ప్రొఫెషన్‌లో ఉన్నవాళ్ళకి ఆడదానిమీద అందరికి ఉన్నంతభ్రాంతి ఉండదు. ఆ సంగతీ నీకు తెలిసేఉంటుంది. అందుకే రాజ్యలక్ష్మి అంటే ఒక కామ్యవస్తువుగా నేనెన్నడూ చూడలేదు. నాతో పరిచితమైన ఒక స్నేహితురాలుగా చూచుకొన్నాను. అది ఆమె అపార్థం చేసుకొంటే దానికి నే నేం చెయ్యను?" అని వేంకట్రావు చెప్పి లేవబోయాడు.

"అన్ని తప్పులూ ఒకపెళ్లితో సరి"అని రంగారావు అందించి "వేకంట్రావ్! ఇదేలాగుంది నీకు ఈవారం రావలసిన శుభవర్తమానం "శుభమో! అశుభమో కానీ ఈ శుభలేఖ రిజస్టరిపోస్టులో ఎందుకు పంపించిందో ఇప్పటికి తెలియకుండా ఉంది" అని వేంకట్రావు అంటూ ఉండగా, రంగారావు రాగవరసతో 'నారికేళపాకము కదె కామినీహృదయ కావ్యరసగ్రహణమ్ము" అని మంగళహారతి చదివాడు.

[గల్పిక]

విదేశీ నిపుణులు

త్రష్ణకు గారెలతట్టలో పడ్డట్టయింది జర్మనీనుంచి పారిపోయి ఈదేశానికి వచ్చిన యూదులపని.

వాళ్లు ముగ్గురూ కొలాబాలో కొత్త మంచిరకం టీదుకాణంలో కూచుని ఆలోచన చేశారు. బొంబాయినగరంలో చెప్పుకోదగిన లోహపుఫ్యాక్టరీ లేదు. కొద్దిమంది గుజరాతీలు అల్యూమినం కరగేసి రేకుతీసి వంటింటిసామానుకైరాలు అచ్చు వేస్తారు, అంతే. ఫ్యాక్టరీ పెట్టటానికి ఎంతో అక్కర్లేదు, యాభైవేలు చాలు.

ఫ్యాక్టరీ ఏర్పాటయింది. ఒకడు డబ్బు పెట్టాడు, ఒకడికి "స్క్రాప్" కరిగించటం తెలుసు. ఒకడు లాబొరేటరీల్లో చాలాకాలం బీకర్లుకడిగినవాడు, ద్రావకం బుడ్ల మీద లేబెల్సు అంటించినవాడు. ముగ్గురూ నిపుణులే.

రైల్వే కార్ఖానాలు చవుకగా "స్క్రాప్" అమ్ముతాయి. అందులోనుంచి పెద్దముక్కలు చేత్తో ఏరి, సన్నసరుకు యంత్రంమీద జల్లెడపట్టి, అడుక్కుదిగిన వలిని 400 డిగ్రీలు లోపుగా వేడెక్కిస్తే వైట్ మెటల్ ద్రవించి ఒకవేపు కారిపోతుంది. మిగిలిందంతా గన్ మెటల్. ఈరెండులో హోలూ అచ్చులు పోసి అమ్ముకున్నా బోలెడంత లాభం.

ఇంతలో యుద్ధం వచ్చింది ఫ్యూజ్ బాడీలు చెయ్యటానికి ఇత్తడి కడ్రలు రెండంగుళాలవి తయారుచెయ్యమన్నారు. ఎగిరి గంతేశారు ఇజ్రేలువంశస్థులు. యుద్ధసహాయం చేస్తున్నందుకు మెచ్చి ప్రభుత్వం వారికి కంట్రోలుధరలకు బట్టీలూ, మూసలూ నిర్దుష్టమైన రాగీ, జింకూ ఇప్పించింది. రాగీ, జింకూ నూటికి నూరుపాళ్లు స్వచ్ఛమైనవి. అరవైపాళ్లు రాగీ, నలభైపాళ్లు జింకూ కలిపితే ప్రభుత్వం కోరిన ఇత్తడి తయారవుతుంది. ఇంకేముందీ?

మంచిముహూర్తం చూసి బట్టీ వెలిగించారు. అప్రయోజకుడు, అప్రవీణుడూ అయిన నాటుకూలివాడొకడు బట్టీ ఎక్కి మూసలోకి రాగిదిమ్మలు దించాడు. బట్టీ మూసాడు, దిగివచ్చాడు, బట్టీకి మంట పెట్టాడు. ఇజ్రేలుసంతానం ముగ్గురూ బట్టీ చుట్టూరా నిలబడ్డారు. బట్టీమూతలో నుంచి పైకి వచ్చే జ్వాల వారిమొహాలమీద ఆశాజ్యోతిలాగా ప్రకాశిస్తున్నది.

అరగంట కల్లా రాగి కరిగింది.

"జింకు వేసెయ్యి." అన్నాడు ఒక భాగస్వామి బట్టీవాడితో. బట్టివాడు మంట తగ్గించి, బట్టీ ఎక్కి, మూత పక్కకులాగి పెద్ద పట్కారుతో జింకుపలకలు పట్టుకుని కరిగినరాగిలోకి జారవిడిచాడు. మరుక్షణమే బట్టీ బాంబుపేలినట్టు పేలింది. మూసలో కరిగిఉన్న లోహం చూరుదాకా లేచింది. బట్టీవాడు, ఎవరో తోసినట్టు కిందబడ్డాడు. వాడు లేచిచూసేసరికి కార్ఖానా నిర్మానుష్యంగా ఉంది. యూదులు ఐపులేరు.

వారు పారిపోయినారని బట్టీవాడు భావించాడు. కాని ఇది నిజం కాదు. ఈ దురంతానికి కారణమేమిటా అని పంచాయతీ చెయ్యటానికి వారు ఫ్యాక్టరీఅవతలి చివరఉన్న గదిలోకి వెళ్లారు. పని కొత్త జరూరుకనక పెళ్లినడకలు నడవకుండా చేతనయినంత వేగంగా వెళ్లాడు. ముగ్గురిలో ఎవరు ముందు గదిలో అడుగుపెట్టారో వారికే తెలియదు. వాళ్లే పందెపు గుర్రాలై అదే రేస్‌కోర్సయితే అది "డెడ్‌హీట్" అనిపించుకునేదే.

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

చర్చ చాలా తీవ్రంగా జరిగింది.

"రాగిలో జింకు కలపకుండా ఇత్తడి ఎట్లా అవుతుందో నా కెవరన్నా చెబుతారా?" అన్నాడొకడు.

"రాగీ జింకూ కలిస్తే బాంబు తయారవుతుందని నే నే పుస్తకంలోనూ చదవలేదు." అన్నాడు మరొకడు. ఇతను చదివిన పుస్తకాలు ఎక్కువభాగం కేటలాగులే కనక అతనన్న మాటకు వేరే రుజువవసరం కూడా లేదు.

"ఆ జింకులో గాని డైనమైట్ ఉండి ఉంటుందా?" అన్నాడు డబ్బుపెట్టిన సోలొమన్.

"నాన్సెన్స్!...కావలిస్తే ఎన్‌క్వైరీ చేస్తాను." అన్నాడు బీకర్లు కడగటంలో చెయ్యితిరిగినవాడు.

మర్నాడు ఇత్తడి తయారుచెయ్యటానికి రెండో ప్రయత్నం జరిగింది. మళ్లీ జింకు బట్టీలో పడగానే బాంబుపేలినట్టు పేలింది. ఈసారి జాగ్రత్తమీద ఉండటం వల్ల బట్టీవాడు అందరికన్న ముందు ఆరుబయలు అందుకున్నాడు.

"నాకీ ఆర్డరు అక్కర్లేదు. పనివాళ్లు భయపడి పనిలోకి రారు. అదీ కాక ఇప్పటికే చాలా నష్టమయింది." అన్నాడు సోలొమన్.

"ఇందులో కిటుకేమిటో ఇన్‌స్పెక్టరేటు వాళ్ల నడిగి కనుక్కోవలిసిందే" అన్నాడు స్క్రాపు కరిగించటంలో అద్వితీయుడు.

"నాన్సెన్స్! ఆ నల్లవాడా మనకు చెప్పేది? ఇక తెల్లవాడి ప్రతిష్ఠ ఏమైనా ఉంటుందా!" అన్నాడు ద్రావకంసీసాల మీద పదిహేనేళ్ళు చీటీలు అంటించినవాడు,

"అవును. ఆ పనిచేద్దాం." అన్నాడు సోలొమన్ మొహం చాటంత చేసుకుని.

ఇన్‌స్పెక్టరేటుమనిషి వచ్చాడు ముగ్గురు యూదులూ అతని చుట్టూ మూగారు. ఇత్తడి చెయ్యాలంటే రాగీ, జింకూ కలపటం కాక మరేమార్గమైనా ఉందా అని అడిగారు.

ఇన్‌స్పెక్టరేటుమనిషి నోరు తెరిచేలోగా స్క్రాపు కరిగించేవాడికి గొప్ప ఆలోచన తట్టింది.

"ముందు జింకు కరిగించి అందులో రాగివేస్తే?" అన్నాడతను.

"రాగి పూర్తిగా కరిగే సమయానికి బట్టీలో జింకంతా గజ్జిమంటుగా ఇగిరిపోతుంది." అన్నాడు ఇన్‌స్పెక్టరేటు మనిషి.

సొలోమన్ ఇక ఆగలేకపోయినాడు.

"కరిగినరాగిలో జింకు వెయ్యగానే అంతెత్తులేచింది. మూసలో చెంచాడు కూడా మిగల్లేదు." అన్నాడు.

ఇన్‌స్పెక్టరేటుమనిషి నవ్వలేదు. అతను బీకర్లు కడిగే వాడికేసి తిరిగి, "నువ్వు కెమిస్టువు కదా, జింకులో నీరుంటుం దని

ప్రసిద్ధ ఆంధ్రచిత్రకారులు శ్రీ వేలూరి రామమూర్తిగారి నిర్యాణం

శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తి

వేలూరి రామమూర్తిగారు మే నెల 6 వ తేదీని పరమపదించారు. ఈమధ్యనే ప్రకృతి-చిత్రకారుడైన భగీరథి పోయారు. భగీరథిగారి మృతి విని తట్టుకోలేక పోయాము. ఇంతకూ తెప్పరిల్లలేదు. ఇంతలో రామమూర్తిగారి మరణవార్త వినవలసివచ్చింది. ఒకదానిపైఒకటి ఆంధ్ర-చిత్రకళపై దుర్విధి దెబ్బ తీసినట్లయింది.

రెండు మహోన్నతకళాశిఖరాలు వొరిగిపోయాయి. ఇద్దరు సౌందర్యపిపాసువులు అనంతములో విలీనమయ్యారు. అనంతకళా రహస్యములు ఎరిగిన రెండు కుంచెలు జారిపోయాయి భగీరథిగారు పోవుటతో ప్రకృతి-చిత్రకళకు తీరని నష్టము సంభవించింది. రామమూర్తిగారు పోవుట శిల్పమునకు-చిత్రకళకు గొడ్డలిపెట్టు అయింది.

జీవితములో అమూల్యమయిన కానుకలు లభిస్తాయి. ఆ కానుకల విలువ తెలుసుకోకుండానే ఒకప్పుడు వాటినీ పోగొట్టుకుంటాము. ఆంధ్రులకు శిల్ప-చిత్రకళలలో అమూల్యమయిన కానుకగా రామమూర్తిగారు లభించారు. దానిని ఆంధ్రులు పోగొట్టుకున్నారు. వారిని ఇక మనము చూడము. మృత్యుదేవత వారి నైరంతర్య కృషికి అంతరాయము కలిగించి వారిని మననించి విడదీసినది. ఆంధ్రులకు ఆయన మలచిన శిల్పములు - చిత్రములే ఊరట. జీవితములో కొన్ని సంఘటనలు తలుచుకుంటే కొండంత ఉత్సాహము వస్తుంది. రామమూర్తిగారి శిల్పములు, చిత్రములు చూచినప్పుడు అంత ఉత్సాహము దాక్షిణాత్యయువచిత్రకారులకు కలిగింది. ఆయనమరణవార్తతో కాళ్ళుచేతులు ఆడకుండా స్థంభించినట్లయింది.

దైవము చల్లగా చూస్తే ఆంధ్ర-చిత్రకారులలో ప్రతిభావంతులు ఇంకా కొందరు మిగిలారు. చిత్రకళలో కృషి జరుగుతోంది. శిల్పులు ఉన్నారు. శిల్పములు తయారు చేస్తున్నారు. కాని ప్రావీణ్యము గడించినవారు పదికాలాలపాటు బాగుంటే మహోత్కృష్టమయిన కృషి-చిత్రకళారంగములో జరుగుతుందని కదా ఆశ. రామమూర్తిగారు ద్విగుణీకృతోత్సాహముతో ఇంకా కృషిచేస్తారని ఆశించాము, గర్వపడ్డాము. ఇంతలో వారీలోకము వీడిపోయారన్న వార్త కర్ణకఠోరముగా వినవలసివచ్చింది.

ఎటుచూచినా కళాశిలిజీవితము మెరుపులా మాయమైపోతుంది. ప్రశాంతముగా ఆకులచాటున ఉన్న రంగురంగుల పిట్ట ఎగిరిపోయినట్లు ఇట్టే జీవితము గడచిపోతుంది. అర్ధనిమీలితనేత్రములతో ఆకులచాటునే ఉండి అనంతవర్ణములు పరికించి ఆనంద తన్మయత్వములో తుర్రున ఎగిరి పోతుంది రంగు రంగుల పిట్ట. ఏకలకలము దాని ప్రశాంతతకలచితే ఎగిరిపోయిందో. ఏ సౌందర్య సీమకో! ఏ ఋషివాటికకో వెళ్లిఉంటుంది. దానికి ఎగిరే రెక్కలకింద బంగారువర్ణము ఉంది. అది ఎన్ని బంగారు కలలు కన్నదో, కళాశిలిజీవితముకూడా లిప్తలో గడచిపోయినట్లు ఉంటుంది. కళలో ఎంత కృషి చేసినా దేహము జరామరణములకు లొంగిపోవలసిందే కదా! రెక్కలు తొడిగి కళాసీమలో ఎగిరిన శిల్పిహృదయ విహంగము నిర్యాణాసమయములో ఏ సుందరతరస్వప్నములో కరిగిపోతుందో కదా! శిల్పికి కళాతపస్సులో అన్ని అంతరాయములను అధిగమించిపోగల మనోనిబ్బరము ఉంటుంది. ఆ మనోబలంసహాయంవల్లనే అతడు కళలో గమ్యస్థానము పొందుతాడు. రామమూర్తిగారు అట్టి మనస్థైర్యముతోను, చిత్తశుద్ధితోను శిల్పచిత్ర కళలకు రెంటికీ సేవచేశారు. రెండుకళలలోను ఆయన పట్టినది బంగారమైంది.

రామమూర్తిగారు ప్రమోదకుమారచటర్జీ గారివద్ద చిత్రకళ నేర్చుకొన్నారు. స్వయంకృషివల్లనే శిల్పములో చక్కని కృషి చేశారు. రెండుకళలలోను ఆయన సిద్ధహస్తులు. వీరు వయస్సులో ఇప్పటి యువచిత్రకారులకన్న బాగా పెద్దవారగుటచేతను, స్వతః ఆయననుగూర్చి ఆయన చెప్పుకొననివారగుటచేతను రామమూర్తిగారినిగూర్చి చాలామంది యువచిత్రకారులకు రెండుమూడేళ్ళవరకు తెలియదు. ఫలసమృద్ధిఅయిన వృక్షము వంగిఉన్నట్లు అనేకసుగుణములు కలిగిన రామమూర్తిగారు మితభాషి. వారి చిత్రములు ఢిల్లీ, మదరాసు, కేలికట్ మొదలయిన నగరాలలో జరిగిన అఖిలభారత-చిత్రకళాప్రదర్శనములలో ప్రదర్శించుటవల్ల శిల్ప, చిత్రలేఖనములలో వీరికి ఉన్న శక్తి తెలుసుకుందుకు వీలుకలిగింది. ముఖ్యంగా దక్షిణదేశంలో ఉన్న అనేకమంది యువ-చిత్రకారులకు వీరు గౌరవనీయులు. ఈమధ్య వీరి చిత్రములు కొందరికి నూతనచైతన్యము కలిగించి మంచికృషికి దోహదములైనవి.

ఇంచుమించుగా రామమూర్తిగారికి ఏభై సంవత్సరములు ఉంటాయనుకుంటాను. ఇంతవరకు వారు చేసిన ముఖ-చిత్రములలో కాని, ఊహా-చిత్రములు శిల్పములలో కాని ఇది మొదటిరకము, ఇది రెండవరకము అని ఎంచలేము. ప్రతిఒక్క-చిత్రము గొప్పదే. ప్రతి ఒక్క-శిల్పము చూచి ఆయనలోని అసాధారణమైన ప్రతిభకు వినీతాంజలులు ఘటించుతాము. ఒక్క-చిత్రములో ఒక్క-

---

తెలీదూ! అది గాలిలో ఉండే తడి పీలుస్తుందని ఎరుగవూ? జింకు బట్టీలో వెయ్యక పూర్వం కనీసం 200 డిగ్రీలు వెచ్చపెట్టాలి," అన్నాడు.

విదేశ లోహప్రవీణులు విజయప్రదంగా ఇత్తడి తయారుచేశారు కాని ఇకముందు ఈ నల్లవాణ్ణి ఏమీ అడగదలచలేదు.

అందుచేతనే యుద్ధకాలంలో నల్లవాళ్ల ఫాక్టరీలు తెల్లవాళ్లు తప్ప ఇంకెవరూ తయారుచేయలేరనుకున్న అనేక మిశ్రలోహాలూ. హార్డెనింగు ఎలాయిటూ తయారుచేసి విదేశీప్రవీణులను కంగారు పెట్టాయి.

శైలిలో అది చిత్రించిన చిత్రకారుని శక్తి సామర్థ్యములు ఇమిడిఉంటాయి. అంటే పరిణతికి వచ్చినవారి మాట చెబుతున్నాను. ఆవిధముగా రామమూర్తిగారి ప్రతిచిత్రంలోను ఈయన పరిణతికి వచ్చిన శిల్పి - యని ద్యోతకమౌతుంది.

రామమూర్తిగారు చాలా నిరాడంబరమైన వ్యక్తి. నేటి తెనుగుచిత్రకారులలో నే పెద్దలు, పిన్నవారిలో కొందరు, ఏమీ ఆడంబరములేకుండా ఉంటారు. చొరవ చేసుకొని ముందుకి పోయేవారు కాదు కాని లోకము కొంచము ఆడంబరము ఉన్నవారి వెంటబడుతూ ఉండుట సహజము. ఇంకా నయము. భారతిపత్రిక అండగా ఉండుటచేత తెనుగుచిత్రకారులను గూర్చి ఆంధ్ర లోకము తెలుసుకుందుకు వీలుకలిగింది.

ఎడ్వర్డుబర్ అనే చిత్రకారుని పరిచయం చేస్తూ జాన్ దివాన్ పోర్టు అనే రచయిత "ఈచిత్రకారుని ప్రజలు ఎరుగరు. అతడు ప్రశాంతితో లోకములోని అశాంతిని చూచాడు. తాను కన్నదానికి, విన్నదానికి అతని చిత్రములు వ్యాఖ్యానములు. అతడు మనకు చర్మచక్షువులతో చూచే భౌతిక లోకములు అధిగమించి కాంతి నిండిన దివ్యలోకములు చూశాడు. అతను అందరి కష్టసుఖములు అర్థముచేసుకున్నాడు. అతనిని మాత్రము అర్థముచేసుకుని పలుకరించిన వారు లేరు. అతను పెదవి కదపలేదు. అతడు సత్యమే పలికినవాడు. కనుకనే అతని చిత్రములలో సత్యౌతపోలోకములు చూడనగును." అన్నాడు.

ఆవిధంగా ఉత్తమకళాశీలి తన్మయుడై ఉంటాడు. ఆ తన్మయతతోనే కళాశీలి రచన సాగుతుంది. రామమూర్తిగారి కృషిలోను అట్టి తన్మయత చూడనగును.

రామమూర్తిగారి చిత్రములు చూచి ఇటీవల అనేకులు ప్రశంసించారు. ముఖ్యముగా దక్షిణభారతయువచిత్రకారులు ఆయనఎడల మిక్కిలి వినమ్రులు. రామమూర్తిగారితో నాకు కలిగిన పరిచయ భాగ్యము నేను మరువరానిది. ఆయన చివరి రోజులలో వారిదర్శనము లభించుటవల్ల నాకు మరియొక ఉత్తుంగకళాశిఖరసందర్శనమయినట్లు ఉంది. ఆయనఉత్తమకళాదర్శములు అనేకులకు కరదీపికవలె వెలుగునిస్తాయి.

ఏదేశంలోనయినా లలితకళలలో ప్రతిభావంతులు ఎక్కువమంది పుట్టరు. పుట్టినవారిని సమాదరించి గౌరవించుట సహృదయుల ధర్మము. అట్టి ఉత్తమశిల్పుల కృషి దేశానికి ఒక అమూల్యసంపద. రామమూర్తిగారు అట్టి ఉత్తమమైన కృషి చేశారు. వారి పవిత్రస్మరణ ఆంధ్రులు మరువరానిది. వారిచిత్రములు, శిల్పములు భద్రపరుచుటకూడా ఆంధ్రులకు కర్తవ్యము.

"సమానధర్మా"

శ్రీ ఏ. వరదాచార్యులు


ఇతరవ్యాసంగాలు లేనపుడు పత్రికలు చూస్తాను. ఐనా పత్రికలను చూస్తేగాని దినం వెళ్లనంతటి నిషా గలవాణ్ని కాను నాకు పెద్దశాస్త్రపాండిత్యం లేకపోవటం. వల్ల ఏశాస్త్రీయవిషయాలైనా పత్రికల్లో చర్చించబడ్డా చూచ్చేదిలేదు. డైలీపేపర్లయితే న్యూసు, వీక్లీ మంత్లీలైతే కథలూ మొదలయినవీ చూస్తాను. క్రమంగా యిలా కొంతకాలం జరిగాక నాకూ్కడ రచయితనౌదామన్న కుతూహలం కలిగింది. కొంతమంది రచయితల కథలు నాకు చాలా ప్రోత్సాహాన్నిచ్చాయి. ఉపక్రమోపసంహారమైనా లేని ఈపాటి రచనలు వ్రాయడం నాకుమాత్రం సాధ్యంకాదా అనిపించింది. అంతటితో రచనకు దొరకొన్నా. ఇతరుల ననుకరించడంగాని ఏవిషయంలోనూ, గ్రంథచౌర్యాలుగాని చేయదలంచలా. ఏది ప్రారంభించినా చాలా జోరుగా వ్రాసి పూర్తిచేసేవాణ్ని. చివరకు యోచనచేసి మాద్దునుగదా ఏరచయితల మర్మగునో నిల్చేది. చస్తే స్వతంత్రరచన తయారుకాలా? తింటేగాని రుచి తెలియదు. దిగితేగాని లోతు తెలియదు.?

రచయితనైన నేనే గుణగ్రహణకు దిగితే ఓపట్టాన ఏవిషయం తేలేట్టులేదు. అందువల్ల ఒక బాధ్యత రసికులపైన వేసి నేను వచనకుమాత్రమే సిద్ధపడ్డాను. కొంతబరువు హృదయంనుంచి తొలిగిందిగాని ఇది స్వతంత్రరచనేనా కాదా అన్న శంక నన్ను విడిస్తేనా! సరే ఎలాగైనా 'యేనామ కేచిదిహ నః ప్రథయంత్యవజ్ఞాం జానంతు తే కిమపి తాన్ప్రతి నైష యత్నః' అనుకుని వ్రాశాను. నా రచనలు చాలా పెరిగాయి. ఇవన్నీ పెట్టెలోబెట్టి పూజించడానికే నేను వ్రాసింది? విమోచనమార్గం ఇదకాలిగా మరి.


మా మిత్రుడు శాస్త్రి మార్కెట్లో ఒక కథకుడిగా గిట్టింపౌతున్నాడు. ఇతను ఉత్తదబ్బాఖోర్ ఖబుర్లు చెప్పడంలో సిద్ధహస్తుడు. చెత్తాఖోర్ వ్రాతల్లో అందెవేసినచేయి. ఈయనసాయంతో ముందుకు వెళ్దామనుకుని ఒకరోజు దూరపుపేటలో యితని యింటికి వెళ్లాను. షుమారు 5-30 ఐంది. సాయంత్రం. నల్గురైదుగురు మిత్రులతో ఏవో కోసేస్తున్నాడు. నేను కన్పించగానే 'ఏమోయ్! రా కూచో' అని ఓ కుర్చీ చూపాడు. నెమ్మదిగా కూచుని వారి సంభాషణ విన్నాను కొంచెంసేపు. వీరంతా మా మిత్రుణ్ణి తలదన్నగలవారే గాని తక్కువవారెవరూ లేరు. వీరి ప్రసంగాన్నిబట్టి ఒకొ్కక్కరు ఒకొ్కక్క పేరుగల కథల పత్రికలను గుత్తగొన్నట్లు అర్థమయింది. వీరి సంభాషణలు వింటుంటే నాకు గుండె బేజారైంది. అసలు ముందు ఖబుర్లకామరాజులు కొందే రచయితలు కారేమో అనుకున్నా.

రాత్రి 7-30 కి అంతా వెళ్లిపోయారు. మాశాస్త్రి, కొంచెం తీరిగ్గా 'ఏమోయ్! బ్రదర్ పనిమీదొచ్చావ్' అన్నాడు. ఎనిమిదిగంటలు కాబోతున్నది నేను మళ్లా మాపేటకు రావాలి. ప్రొద్దుబోతుందన్న భయంతో క్లుప్తంగా సమాచారం చెప్పాను. 'ఓస్! ఇంతేగదా! ఇపుడు వ్రాసేవారంతా

(22 వ పేజీ చూడుడు)



వాషింగ్టన్‌లోని నేషనల్ ఎయిర్‌పోర్టులో, చిలి అధ్యక్షుడు గాబ్రియెల్ విడేలాకు అధ్యక్షుడు ట్రూమన్ ఆహ్వానమిస్తున్నాడు.






ఉత్తర రొడీషియా, ఆఫ్రికన్ కాంగ్రెస్ అధ్యక్షులు జి. ఏ. మ్బికునితా లేవానికా, ఇటీవల ఢిల్లీవచ్చి భారత రిపబ్లిక్ అధ్యక్షులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారిని సందర్శించారు.

భారత - పాకిస్థాన్ పత్రికా సంపాదకుల సమావేశానికి హాజ్రై
భారత ప్రభుత్వాధ్యక్షులు, శ్రీ రాజేంద్రప్రసాద్ విందుచేశారు.
ర్భంలో రాజేంద్రప్రసాద్, తుషార్ కాంతిఘోష్, అబ
రషీదీ మొదలైనవారు సరససల్లాపాలలో వున్న దృ

వార్తా చిత్రాలు




ఢిల్లీ సమావేశానికి వచ్చిన పాకిస్తాన్ పత్రికాసంపాదకులకు ఆల్జమాయత్ సంఘంవారి విందు

క్రిమి స

రెక్కలురాని
మిడుతలను చంప
మొక్కలన్నీ తింట
సాగుతున్నారో,
వైపు మొక్కలపై
చల్లుతారు. ఆ
విషం తిని చనిపో




ైన ప్రముఖులకు,
ఆ విందుసంద
అలీమహమ్మద్
గ్యం.



కాశ్మీర్ లోయలోని సుందర గుల్మార్గ్ సీమ. భారతసేనల వాద్యసమ్మేళన దళాలసైనిక ప్రస్థానాలు.

ంహారం

దశలో వుండగా
ం తేలిక. అవి
ి ఎటువైపుకు
గ్రమనించి అటు
వ, విషపదార్థాలు
రము కాని ఆ
తే.



"సమానధర్మా-"

(19పేజీ తరువాయి)

దండీ, బాణుడూ, భాసుడూ, గుణాఢ్యులూ నా ఏమోయ్! నీకు చేతనైంది వ్రాయి. మంచో చెడ్డో నీరచన నీది. ఆపాటి ధీమా లేకపోతే రచయితే కాలేవు. మేమంతా పాడిచేస్తున్నామా ఏమిటీ.

'మీరు నారచనలకో ప్రకటన యోగ్యత కల్గించాలి సుమా' అన్నాను.

'నీకో ఉపాయం చెబుతా విను' మున్ముందు ప్రతివాడూ కొంచెం శ్రమపడాలి. పేరొచ్చింకో ఏ తుక్కయినా చెల్లుబాటవుతుంది. నీవు ముందో పదికథలు వ్రాయి. ఒకొకథానికి పదికాపీలు దీయి. పదిపేపర్లవారికి పదిరచనలూ ఒకొక కాపీ బంపు. ఓ నెలమూడు. ఏ పేపర్లోనైనా పడిందేమో? మరో నెలలో అదే ఆర్టికిల్స్ తలలు మార్చిపంపు. ఇలా బంపుతూంటే పది మాసాలవరకూ 10 పేపర్లకు పది ఆర్టికిల్స్ పంపించినట్లవుతుంది. ఎవరో ఒకరు వెయ్యకుండా వుంటారా! ఏపత్రికా ఎడిటరేనా కన్పించితే పరిచయం లేకపోయినా వున్నవాడిలా మాటాడు. నీ ఆర్టికిల్ విషయం మృదువుగా పల్కరించివిడు. కొంచెం తీరిగ్గా ఏ ఎడిటరైనా కన్పించాడూ ఏకో ధోరణిలో దించి వారి పత్రిక గొప్పను వారి గొప్పను ప్రశంసించు. ఏదేనా పత్రికా ఎడిటర్ మిత్రుడితో 'తోకంట నారాయణ' అన్నట్లు తిరుగుతూ వారు ఎడిటర్‌తో కలిసేటపుడు నీవూ వెంటవుండు. చివరకు తిరిగి వెళ్లేపుడు 'మా ఆర్టికల్ వోటి వచ్చింది. కొంచెం చూడండి' అని అడుగు. కొంచెం చౌకపారు పేపర్లేవన్నా వుంటే మీరు ప్రకటించే అవకాశంలేకుంటే నా ఆర్టికిల్ తిప్పిపంపండి'అని వ్రాస్తే కొంచెం గౌరవంగా వుంటుంది. ఇలా ఏవేవో సలహాలిచ్చాడు." సరే వెళ్లొస్తానని బయలుదేరి కొంచెం నడిచా. మళ్లా వెనక్కు పిలిచి యిలా చెప్పాడు. ప్రతిపేపర్‌లోనూ ఓ ప్రకటనుంటుంది. మంచికాగితాలమీద ఓవైపున విడివిడిగా వ్రాసిపంపాలని. నీవు అలా వ్రాశావో వెంటనే అర్థం చేసుకుంటాడు ఎడిటర్ వీడెవడో క్రొత్త వ్రాయసగాడని. అందువల్ల ఏ సన్యాసికాగితాలపైనో వ్రాసి పంపు. తెలిసేట్టూ వ్రాయకు. ఇది ఆ వృత్తిలోని కిటుకు.

సరే ఈ సలహాలన్నీ దీసుకుని కొంప చేరాను. రెండోరోజే దగ్గర పోస్టాఫీసుకు వెళ్లి మూడుకాన్ల చీట్లు, అర్ధణా, కానీ చీట్లన్నీ కొన్నాను. 'శుభస్య శ్రీఘ్రమ్' అని ఆనాడే ప్రారంభించాను నా రచనా ప్రపంచంతో పత్రికాఫీసులు నింపడానికి. ఆంధ్రదేశం నలుమూలలావున్న పేపర్ల అడ్రసులన్నీ ఓలిస్టుకింద వ్రాశా. రోజూ రెండు బుక్ పోస్టు చేశేవాణ్ని. దగ్గరనన్న పఠనాలయంలో పేపర్లు తిరగవేయడం మొదలుపెట్టా. ఒకనెలకల్లా పోస్టల్ వాళ్లకు నా పేరు బాగా తెలిసింది. వెను దిరిగివచ్చిన బుక్‌పోస్టేదయినా వుంటే కళ్లు మూసుకుని మా యింట్లో యిచ్చేవారు. నేను పంపేవో, నాకు వచ్చేవో పోస్టాఫీసులో నా బుక్‌పోస్టో టుండాల్సిందే. ఆరుమాసాలయినా ఏ ఎడిటరూ ప్రకటించలేదు.


చివరకు విసుగెత్తి ఓ నిర్ణయాని కొచ్చాను. నేను వ్రాసే వ్రాతలు నాకూ ఎడిటర్‌కూ ఏకొంచెమో అర్థం కావడమే నా వెనుబాటుకు కారణం అనుకున్నాను. వెంటనే నా కర్థంగాని సబ్జెక్టు వెదికాను. చివరకు కౌటిల్యుని అర్థశాస్త్రంపై వ్రాశాను. ఏంరాశానో నాకే తెలియదు. నాకు రాబోయేదల్లా మూడు కాన్ల నష్టమేగదా అనుకుని రెండుపేపర్లకు బంపా. చాలకాలంచూచి ఏ పేపర్లోనూ ఒక ఆర్టికలూ పడక విసుగెత్తడాన పేపర్లు చూడ్డం మానివేశాను. తర్వాత కొన్ని నెల్లకు ఓరోజు వెళ్లి తిరగవేద్దునుగదా ఓ పేపర్లో నా పేరుతో కౌటిల్యుని అర్థశాస్త్రవిమర్శ ప్రకటితమయింది. నా కళ్లు నేను నమ్మలేక ఒకటి, రెండు, మూడుదఫాలు చదివాను. చివరకెలాగైతేనేమి ఎడిటర్‌కూ, నాకూ కూడా అర్థంగాని వ్రాత వ్రాయకల్గినందుకు తృప్తికల్గింది. నాకో పేపరైనా ఎందుకు పంపలేదా అనకుంటూ యింటికి వెళ్లి విచారించాను. నిన్నో మొన్నో వచ్చిందో పేపరంటూ కవర్ పేజీ కొన్ని కాగితాలూ చిరిగిన పేపర్ యిచ్చారు యింట్లో. తిరగవేసి చూద్దునుగదా దాంట్లో ఆనెలలోనే ప్రకటితమయిందా కౌటిల్యుని అర్థశాస్త్రవిమర్శ. అసలా పేపరు నేను పఠనాలయంలో చూచివచ్చిందిగాదు. మా యిద్దరికీ బుద్ధిమంతుడైన మరో మహనీయుడు తోడు దొరకడంవల్లా, నేను ఎలాగో ఈనాడు ఒకటూ రెంటూ రచయిత నవటంవల్లా నన్ను నేనే ప్రశంసించుకుంటూ ఇలాటి రచనలకికముందు గట్టి ప్రయత్నం చేస్తున్నాను. కాలం అనంతం కాకుండానే, పృథ్వి విపులం కానక్కరలేకుండానే నాతో సమానధర్ములు పుట్టనే పుట్టిరాయెను!



మాయాదీపము

"తపతి"

అనగాఅనగా ఒక రాజుగారివద్ద ఒక సేవకుడుండేవాడు. ఆ సేవకుడు ఎంతో విశ్వాసంగా రాజుగారికి సేవచేశాడు. కాని రాజు వానికేమియు ఈయకుండానే పంపించేశాడు. పాపం! ఆ సేవకుడు పుట్టెడువిచారంతో ఒక అడవి దారి వెంబడే పోతున్నాడు. కడుపులో ఆకలి దహించేస్తోంది. ఎలాగురా! భగవంతుడా అనుకుంటూ పోతున్నాడు. ఇంతలో దట్టమైన చెట్లమధ్యనుండి తళుక్కుమని కాంతికిరణం ప్రకాశించింది. "ఓహో! ఇక్కడేదో ఇల్లు వుండిఉండాలి" అని ఆవైపు దారితీశాడు. అలాపోయి ఒక ఇంటివద్దకు చేరాడు. ఆ యిల్లు ఒక ముసలిమంత్రకత్తెది. ఆ మంత్రకత్తె మిగుల లోభి. గర్వంహెచ్చు. ఆ దారివెంట పోయే ప్రతీప్రయాణీకుల్నీ ఏదోవిధంగా ఏడిపించి పంపిస్తుంది. సేవకుడుపేరు రామసింగ్. రామ్‌సింగ్ గుమ్మం వద్దకు రాగానే మంత్రకత్తెకూడా బయటకు వచ్చింది. "ఏం! ఎవరు నువ్వు! ఏం కావాలి" అంది కఠోరంగా. "ఆకలి దహించేస్తోంది. పట్టెడన్నం పెట్టు తల్లీ!" అన్నాడు రామ్‌సింగ్. "ఏం! ముష్టివెధవవా నువ్వు? కష్టపడకుండా వస్తుందా ఆహారం" అంది మాంత్రికురాలు.



"నాకు ఆహారం పెట్టు. నీకేంపని కావలిస్తే అది చేస్తాను" అన్నాడు రామ్‌సింగ్.

"అయితే నీకు ఆహారం పెడతాను. రేపుసాయంకాలంవరకూ నా పొలం బాగా దున్నిపెట్టాలి" అంది.

"సరే! అలాగే చేస్తాను. నాకు ఈ ఒక్కపూటమాత్రం ఆహారం పెట్టు." అన్నాడు రామ్‌సింగ్.

మంత్రకత్తె, రామ్‌సింగ్‌కి ఆహారం పెట్టింది. దానితో ఆకలిబాధతీరింది. మర్నాడు సాయంకాలంవరకూ మంత్రకత్తెభూమి చక్కగా దున్నిపెట్టాడు. పగలంతా పని చేశాడేమో! మళ్ళీ ఆకలేసింది. సరే! మర్నాడు కూడా పొలం దున్నిపెడతానని వప్పుకుని ఆనాడుకూడా మాంత్రికురాలుచేత ఆహారం పెట్టించుకుని ఆకలిబాధ తీర్చుకున్నాడు. ఇలా మూడు రోజులు గడిచింది. నాల్గవ నాటిరాత్రి మంత్రకత్తె "ఈ వేళ నీ కొకక్రొత్తపని చెప్తాను. ఆ నూతిలోనున్న దీపం తీసి నా కియ్యాలి" అంది. "సరే" నన్నాడు రామ్ సింగ్.

మంత్రకత్తె, రామ్‌సింగ్‌నడుముకు త్రాడు కట్టి నూతిలో దింపింది. రామ్‌సింగ్ ఆ నీలపురంగు దీపం తీశాడు. ముద్దుగా వున్న ఆ

దీపాన్ని చూస్తే రామ్‌సింగ్ కెంతో ముచ్చట వేసింది.

"ఆ దీపాన్ని ఈ త్రాటికి తగిలించు. తరువాత నిన్ను పైకి తీస్తాను." అంది మంత్రకత్తె.

"నన్ను మోసంచేద్దా మనుకుంటున్నావ్? నన్ను ముందర పైకి తియ్యి. తరువాత నీకు దీప మిస్తాను" అన్నాడు రామ్‌సింగ్.

"ఆ! పాడువెధవా! ఇవ్వవు కదూ! అయితే ఆ నూతిలోనే పడి చావు" అని త్రాడు వదిలేసి వెళ్ళిపోయింది ఆ మంత్రగత్తె.

రామ్‌సింగ్ ఆ నూతిలోని బురదలో ఇరుక్కుపోయాడు. "అయ్యో! భగవంతుడా! నన్నెందుల కీదారికి తెచ్చావ్" అని విచారించాడు. ఇప్పుడు ఈలోకంలో తనదని చెప్పుకోవటానికి ఆ ముద్దుల మూటకట్టు దీపమూ, తన జేబిలోని హుక్కాగొట్టమూ తప్ప ఇంకేవీ లేవు. రామ్‌సింగ్ జేబిలోని హుక్కాగొట్టం తీసి దీపానికి వెలిగించాడు. దట్టంగా పొగలేచింది. ఆ పొగలోనుండి ఒక భయంకరమైన రాక్షసి ప్రత్యక్షమైంది. రామ్‌సింగ్ వళ్ళు జలదరించింది. తాను జీవించే ఆశ ఇంతకుముందే సన్నగిలిపోయింది. ఇప్పుడు వున్న కాస్తకూడా ఎగిరిపోయింది.

ఆ రాక్షసుడు రామ్‌సింగ్‌ని చూచి "ప్రభూ! మీరేమీ భయపడనక్కర్లేదు. ఆ దీపం ఎవరివద్ద వుంటే నేను వారి పాదదాసుణ్ణి. నేనిప్పుడు మీ సేవకుణ్ణి. ఏం పని చేయాలో ఆజ్ఞ యివ్వండి" అన్నాడు. రామ్‌సింగ్ ప్రాణాలు కుదుటపడ్డాయి. "అయితే! నన్నీ పాడుబావినుండి బయటకి దింపు" అన్నాడు రామ్‌సింగ్. రాక్షసుడు భుజాలమీద రామ్‌సింగ్ నెక్కించుకొని ఒక్కత్రుటిలో బావిబయటకు చేర్చాడు. "ఇంకొక్క చిన్నపని చేసిపెట్టాలి. పాపం! నా కింత సహాయం చేసిపెట్టిన ఆ ముసలిదాన్ని ఈ పాడు నూతిలో పారవెయ్యి" అన్నాడు. తక్షణం రాక్షసుడు ఆ ముసలిదాన్ని ఆ పాడు నూతిలో పారేశాడు. పడీపడగానే ఆ మాంత్రికురాలు ఒక కప్పయిపోయి వూరుకుంది. ఆ నూతినీళ్ళు తాకగానే కప్పయిపోవునని ఆమెకొక శాపం. అందుచేతనే రామ్‌సింగ్‌చేత ఆదీపం తీయించి తాను కాజేద్దా మనుకొంది. రాక్షసుడు తనపని ముగించుకొని మాయమయ్యాడు. రామ్‌సింగ్ నీలిరంగు దీపం ఆర్పివైచి ఇంతకుముందు తనను అన్యాయంచేసిన రాజుగారి రాజ్యం చేరుకొని నిర్జనమైన పాడు దేవాలయంలో బసచేశాడు.

రాత్రి పడింది. అందరూ నిద్రపోయారు. రామ్‌సింగ్ నీలి దీపం వెలిగించాడు. రాక్షసుడు ప్రత్యక్షమయ్యాడు. "ఏం సెలవ్!" అన్నాడు రాక్షసుడు. "రాజుగారి కుమార్తెను మంచంతోసహా తీసుకురా ఇక్కడికి" అన్నాడు రామ్‌సింగ్. రాక్షసుడు త్రుటిలో రాకుమార్తెను తీసుకొనివచ్చి రామ్‌సింగ్ వద్ద వదిలి మాయమయ్యాడు. రాకుమార్తె మేల్కొనివుంది. రామ్‌సింగ్‌కి రాజుగారంటే ఎంతో కోపం. అందుచేత రాకుమార్తెచేత ఆరాత్రంతా ఎంతో చాకిరీ చేయించుకున్నాడు. తెల్లవారేసరికి రాక్షసుడామెను రాజభవనంలో వదిలివచ్చేవాడు. రాకుమార్తెకు అందంతా ఒక కలలా వుంది. రాకుమార్తె తండ్రితో "నాయనా! నిన్నరాత్రి నాకొక చెడుకల వచ్చింది. నాచేత ఒకబీదవాడు రాత్రంతా చాకిరీచేయించుకున్నట్లు వచ్చింది. వాడెంతో మలినమైన బట్టలు కట్టుకున్నాడు. నేను ఎలా వెళ్ళానో, ఎక్కడికి వెళ్ళానో, ఎలా తిరిగి ఇక్కడకు వచ్చానో తెలీదు" అంది, "ఆఁ! ఎవరు ఆ వెధవ! అది బహుశా కలయైవుండదు. ఉండు వాడిపని చెప్తాను. నీ వీమారు వాడివద్దకు వెళ్ళినప్పుడు నీ కాలిజోడు ఒకటి అచ్చట వదిలి రా" అన్నాడు రాజు. మరునాడుకూడా రామ్‌సింగ్ రాకుమార్తెను రాక్షసునిచే రప్పించుకొన్నాడు. రాకుమార్తె తన జోడు నొకదాన్ని రామ్‌సింగ్ పరుపుక్రింద దాచింది. ఇది రామ్‌సింగ్ గమనించలేదు. ఎప్పటిలా రాక్షసుడు రాకుర్తెను అంతఃపురంలో దిగబెట్టాడు. మరునాడు రాజభటులు రాకుమార్తెజోడుకోసం రాజ్యమంతా గాలించి, చివరకు రామ్‌సింగ్‌ని పట్టుకున్నారు. రాజుగారు కోపంతో వీడిని తక్షణం ఉరితియ్యండి" అన్నాడు. రామ్‌సింగ్ మెడకి ఉరిత్రాడు తగిలించారు "ఆఖరుకోరికగా చచ్చేముందు ఒక్కకోరిక కోరుకో" అన్నాడు రాజు. "అయితే! ఆ పాడుదేవాలయంలో వున్న నీలిరంగుదీపమూ హుక్కాగొట్టమూ తెచ్చివ్వండి. ఒక్కమారు హుక్కాపీల్చి మరీ చచ్చిపోతాను" అన్నాడు రామ్‌సింగ్. రాజభటులు దీపమూ

గొల్లభామ

శ్రీమతి నందివాడ పుతలీ

అనగాఅనగా చాలా రోజుల క్రిందట వెంకడనే గొల్లవాడుండేవాడు. అతనికి రాధ అనే కూతురుంది. ఆ అమ్మాయి చాలా తెలివైనది. ఎంతో అందమైనది.

వెంకడు తన యింటి కెదురుగా ఉన్న రాముడితో కలసి పొలంపని చేశేవాడు. రాముడి కిద్దరు కొడుకులు. పెద్దవాడు కిష్టయ్య. చిన్నప్పుడు రాముడి భార్య పోయింది. రాముడు మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. ఆమెకొడుకు నరసింహులు వట్టి మొద్దు. ఏ పనీ చేతకాదు. కిష్టయ్య చాలా బుద్ధిమంతుడు. తండ్రితో సమానంగా కష్టపడి పనిచేసేవాడు. కిష్టయ్యని యిరుగుపొరుగులవారందరూ మెచ్చుకొనేవారు. నరసింహులు తెలివి తక్కువతనాన్ని చూసి పరిహాసాలాడేవారు. వెంకడి భార్య కిది కష్టమనిపించేది. తన కొడుకు తెలివి తక్కువకి ఎంతో విచారించేది. సవతికొడుకు తెలివితేటలు చూసి ఆమె ఉక్రోషంతో ఉబికిపోయేది.



రాధకి పెళ్లీడు వచ్చింది. వెంకడు తగిన సంబంధం చూసి కూతురికి వివాహం చేయా లనుకున్నాడు. ఎన్ని సంబంధాలు చూసినా వెంకడికి రాధకి తగిన వరుడు కనిపించలేదు. ఏ ఫంబంధమూ నచ్చలేదు. ఆఖరికి కిష్టయ్య కిద్దా మనుకున్నాడు. కిష్టయ్య కిచ్చి రాధకి పెళ్ళి చేస్తే కూతురు సుఖపడుతుం దనుకున్నాడు వెంకడు. కిష్టయ్య తెలివైనవాడు. అదీకాక రాధకి పెళ్లిచేస్తే అత్తవారింటికి వెళ్ళినా ఎదురిల్లేకనక తన యింట్లో ఉన్నట్టే ఉంటుం దనుకొన్నాడు.

కిష్టయ్యని సవతితల్లిపెట్టే బాధను చూసి యిరుగుపొరుగులవారు వెంకడికి ఆ సంబంధం నిశ్చయించవద్దన్నారు. రాధసవతిఅత్తగారు పోరు పడడం కష్టమనీ, కిష్టుడి కివ్వవద్దని అందరూ వారించారు. కాని రాధ కిష్టయ్యనే పెళ్లాడుతా నంది. వెంకడు కూతురిమాట కాదనలేకపోయాడు. పోనీ అల్లుణ్ణి యిల్లరికం చేసుకుందా మనుకున్నాడు.

రాముడిభార్య కీసంగతి తెలిసింది. అంత అందాలరాసి, సుగుణాలకుప్ప కిష్టయ్య పెళ్లామౌతుందా! ఆమె ఆ ఆలోచననే సహించలేకపోయింది. తన నరసింహులికే ఆ పిల్ల నిస్తే! తన క్కావలసిన దేముంది!

తిన్నగా వెంకడింటికి వెళ్ళింది. "నరసింహులికి య్యి అన్నాయ్. రాధని పువ్వుల్లో పెట్టుకుంటాను. ఎన్నాళ్ళనించో రాధ నరసింహులు పెళ్ళామౌతుం దని ఎంతో ముచ్చట పడుతున్నాను" అంది.

"అది కిష్టయ్యని పెళ్ళాడుతా నంది చెల్లీ. నామటుకి నరసింహులైనా ఒకటే. కిష్టయ్యఅయినా ఒకటే" అన్నాడు వెంకయ్య.

"నీ కిష్టమైతే అదేం కాదనదు. నువ్వెంత చెప్తే అంత కదా దానికి! ఎన్నాళ్ళనించో నా కోడ లని మురుస్తున్నా. నా ఈ ఒక్కమాటా విను. ఇదివరకు నరసింహులికి మూడు సంబంధాలు వస్తే నీ పిల్ల ఉందని ఒప్పుకోలేదు కాదంటే ఎలాగ?" అంది.

హుక్కాగొట్టమూ తెచ్చియిచ్చారు రామ్‌సింగ్ దీపం వెలిగించగానే దట్టమైన పొగ లేచి రాక్షసుడు ప్రత్యక్షమయ్యాడు. వెంటనే రామ్ సింగ్ "వీ ళ్ళందర్నీ తరిమెయ్యి" అన్నాడు. రాక్షసుడు నోటితో ఒక్కమారు ఊదాడు. పెద్ద సుడిగాలి లేచి అందరూ కొట్టుకునిపోయారు. రామ్‌సింగ్‌ని అడ్డుపెట్టేవారు లేరు. రాజుగారు కూడా ఏ మూలకో ఎన్నివేల మైళ్లదూరానికో కొట్టుకుపోయాడు. ఇప్పుడు శ్రీరామ్‌సింగ్ మహారాజ్ గారు ఆ దేశానికి రాజు పూర్వపు రాజుగారి కుమార్తె ఆయనగారి పట్టపుదేవి. కథ కంచికీ, మన యింటికీ,

"కిష్టయ్యా పెళ్ళాంమటుకు నీకు కోడలు కాదూ! వాడిని పెళ్లాడుతా నంటోంటే, కాదు నరసింహుల్ని చేసికోమని ఎలా అననమ్మా! ఇంతకీ పోనీ నాతో సంబంధం కలుపుకోవాలని నీ కుంటే నీ తమ్ముడి కూతుర్ని లక్ష్మిని చేసుకో. తల్లి లేని పిల్లని కడుపులో పెట్టుకున్న దాని వౌతావ్" అన్నాడు వెంకయ్య.

"ఆ మాటలన్నీ తీసిపెట్టు. మా అమ్మఆస్తి నాదే కద. అదంతా నరసింహులిదే కదా! నే నడిగే సరికి నువ్వేదో చేదు తింటున్నట్టు మాట్లాడుతున్నావ్. ఏమే రాధమ్మా. ఇంతగా అడుగుతోంటే మాట్లాడవ్, మావాణ్ణి చేసుకుంటే నీకు పులిచేరు నాను, ఆరుకాసులు యిస్తాను.

"డబ్బెందు కత్తయ్యా. నాన్న అన్నట్టు నరసింహులికి లక్ష్మిని చేసుకో! అంది రాధ.

రాముడి భార్య కెంతో కోపం వచ్చింది. వెంటనే యింటికి తిరిగి వచ్చేసింది. తన మాట కాదన్నందుకు ఈ సంబంధం ఏమయినా సరే కానీయకూడ దని నిశ్చయించుకొంది.

రాముడు పొలంనించి వచ్చాక పిల్ల మంచిది కాదని, అట్టే ఆస్తి లేదుకదా కిష్టయ్య కా మాత్రం సంబంధం రాకపోదనీ చెప్పి సంబంధం పోగొట్టాలని చూసింది. డబ్బెందుకు. పిల్లే చాలు. రత్నాలగని అని రాము డన్నాడు.

చేసేది లేక రాముడు భార్య ఊరుకుంది. మర్నాడు ప్రధానం అనగా కిష్టయ్యకి పొలంలో బంగారం దొరికింది. ఇరుగుపొరుగులవారు రాధ అదృష్టవంతురా లన్నారు. ఆమెతో లక్ష్మి వస్తోం దన్నమాట అని అందరూ అన్నారు.

ఇంక రాముడిభార్య అక్కసు పట్టలేకపోయింది. ప్రధానంనాడు ఆకుపచ్చజరీచీర రాముడు రాధకి కొన్నాడు. సాయంత్రం పెళ్ళికి సరకులు కొనడానికిపట్నం వెళ్ళాడు. కిష్టయ్య ఒక్కడూ పొలానికి వెళ్ళాడు. రాముడిభార్య ఇదే మంచి అదననుకొని పొలానికి తనూ వెళ్ళింది.

కిష్టయ్య పొలంపనిలోని మగ్నుడై ఉన్నాడు. నిమ్మళంగా కిష్టయ్య వెనక్కి వెళ్ళి ఒక్క తోపు తోసింది. కిష్టయ్య బురదలో పడి పోయాడు.

ఆమె కిష్టయ్యని బురదలో తొక్కేసింది. పైన మట్టి కప్పేసి యింటికి వచ్చేసింది.

రాముడు పట్నంనించి సరుకులు తీసికొని వచ్చాడు. ఇంక సాయంత్రం పెళ్లి.

ఆడపెళ్ళివారింట్లో పెళ్లి హంగామా అంతా జరుగుతోంది. వెంకడింటికి వచ్చిన చుట్టాలు పెళ్ళికొడుకుని చూద్దామని బయల్దేరారు. పెళ్ళికొడుకు ఏడీ! రాముడు కిష్టయ్యనెక్కడికేనా పనిమీద పంపావా! అని భార్య నడిగాడు. లేదని అందామె. పెళ్ళికొడుకు కోసం వెతకడం ప్రారంభించారు. మేనత్తగారి టికి వెళ్లిఉంటా డంది. రాముడిభార్య. అయిఉండచ్చు ముహూర్తం కైంకి ముందరే వస్తాడులే అని ఎవరిపనిలో వాళ్ళు మునిగారు.

కాని రాధ కేం తోచలేదు. పొలానికి వెళ్లడం చూసింది. కాని తిరిగిరావడం చూడలేదు. ఆమె మనస్సు పరిపరివిధాల పోతోంది. మంగళస్నానాలవేళ అయింది. పెళ్ళికొడుకు కనిపించలేదు. అంతా గాలించారు. ఎక్కడా కనిపించ లేదు. పెళ్ళివారు ఖంగారుతో కిందుమీదు లౌతున్నారు. రాధకి వెర్రెత్తినట్టయింది. పొలానికి పరుగెత్తింది. మట్టి తవ్వినచోటు మట్టి పోసినచోటు చూసి జరిగిన సంగతంతా గ్రహించింది. ఆమె మొహాం పాలిపోయింది. తన చేతులతో మట్టి తవ్వడం మొదలెట్టింది. కాని ఎంత తవ్వినా మట్టి తరగడం లేదు. అలా నిద్రాహారాలు లేకుండా తవ్వడంవల్ల రాధ శుష్కించిపోయింది. కాళ్ళూ చేతులూ పుల్లల్లాగ అయిపోయాయి. వంగుని తవ్వడంవల్ల శరీరం వంగి చిన్నదైపోయి క్రమంగా కీటకంగా మారిపోయింది. ఆమె కట్టుకున్న చీరరంగు శరీరానికి వచ్చింది. ఆమె మనం యిప్పుడు చూసే గొల్లభామ.

బాలానందం :

మొదటి సాలీడు

శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తం

పూర్వకాలం గ్రీసు దేశంలో "అరేక్నీ"అనే పేరుగల ఒక యువతి ఉండేది. ఆమె నూలు వడకటంలోను, నేత నేయటంలోను మంచి అందెవేసినచేయి. ఆమె వడకిన దారం ఎంతో అందంగాను, గట్టిగాను ఉండేది. ఆమె నేసిన గుడ్డకూడ అట్లే అచ్చెరువుగొల్పేటంత అందంగాను, గట్టిగాను ఉండేది. అంతే కాదు!! గుడ్డలకు అద్దకాలుగూడ బహు చక్కగా వేసేది. వస్త్రాలు చేస్తూ నేస్తూ, వాసమధ్య మంచి అందమైన చిత్రాలు చిత్రించేది ఆ యువతి. ఆ బొమ్మలలో జీవకళ వుట్టిపడుతుండేది.

పూలవాసన పలుప్రాంతాలకు కనురెప్పపాటులో వ్యాపించేరీతిగా ఈ లలనామణి నైపుణ్యం అచిరకాలంలోనే సమీపప్రాంతాలకే కాకుండా దూరప్రాంతాలకు గూడ ప్రాకింది. పలుప్రాంతాలలోని ప్రజలు పనిపెట్టుకొని, అరేక్నీను చూచి కనుపండువు చేసుకొనేవాళ్ళు. ఆమెకీర్తిలత దినదిన ప్రవర్ధమానమయ్యేకొద్దీ, ఆమెలో దర్పం బాగా వృద్ధిచెందుతున్నది. అందుచే ఆమె తనకు తానే ఈ ప్రపంచంలో సాటియనే భావంతో విఱ్ఱవీగుతుండేది.

ఒకనాడు ఆమె మగ్గందగ్గర కూర్చొని నేతనేస్తుంటే, కొందఱు మిత్రులు వచ్చి ఆమెచెంత నిలబడ్డారు. లేతచిగుళ్ళవంటి ఆమె వ్రేళ్ళు, మగ్గంలో కండెను ముందుకు వెనుకకు నడిపిస్తుంటే, వస్త్రం మధ్యలో అప్రయత్నంగా మంత్రకట్టువలె బొమ్మలు ఏర్పడుతూవుంటే, వారి కనులు మిరుమిట్లు గొలిపేవి. "ఆహా! మన నెచ్చెలితో సాటిగా నేతనేయగలవారు ఈ ప్రపంచంలో మఱియొకరున్నారా" అని వాళ్ళను వాళ్ళు ప్రశ్నించుకొన్నారు. "ఎవరు ఈమెకీ దివ్యవిద్యను ప్రసాదించియుంటారు? నిజంగా అది 'మినర్వా' దేవతాప్రసాదమే అయివుండాలి." అని ఎవరో అన్నారు. వాళ్ళల్లో.

తన మిత్రుల సంభాషణాన్ని అరేక్నీ ఆలకించింది. వాళ్ళపొగడ్త ఆమెకేమాత్రం ఆనందం చేకూర్చలేదు. పైగా ఎంతో కష్టాన్ని కలిగించింది!! ముఖం చిట్లించుకొని, కనుబొమలు ముడిపడగా ఆమె, "ఏమీ! మినర్వా నాకీ విద్యను ప్రసాదించిందా? ఎప్పటికీ అట్లా అనుకోవద్దు. నాకు నేనుగానే ఈ విద్యను సాధించాను. నిజంగా నాకు మినర్వాకు, ఈ నేతపనిలో పోటీపెడితే, నా పని ఎంతో ముద్దులొలుకుతూ అందంగా వుంటుందని ఘట్టిగా చెప్పగలను" అని సగర్వంగా పలికింది.

అట్టిసమయంలోనే ఒక మూడు కాళ్ళముసలమ్మ అక్కడికి వచ్చింది. ఈ వృద్ధురాలు అచట నిలబడియున్నవాళ్ళకు గాని, అరేక్నీకు గాని అపరిచితురాలు. అరేక్నీ వంక తదేకదృష్టితో చూసి ఆ అవ్వ, "నీ పొగడ్తమాటలు విన్నాను. సమస్తవిద్యలకు ఆటపట్టయిన మినర్వాదేవతకంటె నీ వధికురాలవని భావించుకోటం నీ అజ్ఞానంకాదా? ఇప్పటికైనా నీ తెలివితక్కువను గుర్తించి, పశ్చాత్తాపపడు. మినర్వాదేవతఆగ్రహానికి గురికాకుండా యిప్పటికైనా ఆమె పాదాలకు మ్రొక్కి క్షమాభిక్ష నర్థించు" అని మందలిస్తూ మాట్లాడింది.

అరేక్నీఆగ్రహావేశాలు కట్లు త్రెంచుకొని ఉరికినవి. "ఎన్నటికీ అట్లు జరుగదు. నేను చెప్పిన మాటలు అక్షరాల నిజం. మినర్వా దేవత నా సమక్షాన నిలబడితే నేను ఆమెతో పోటీచేయటానికి అన్నివిధాల సంసిద్ధంగా ఉన్నాను" అని పల్కింది అరేక్నీ మరింత దర్పంగా.


ఆమె ఈమాట లుచ్చరించిందో లేదో ముదుసలి అదృశ్యమైంది. ఆమెకు మారుగా మినర్వాదేవత, తనసహజరీతితో అరేక్నీముందు నిలబడ్డది. అరేక్నీ ఈ మారు దేవతానుగ్రహాన్ని వేడ్కొనక తప్పదు కాని అట్లా జరగలేదు. ఆమె క్షుద్రహృదయం దర్పసంభరిత

మైంది. అందులో పశ్చాత్తాపానికే మాత్రం సందులేదు. "మగ్గాలు సిద్ధంచేయండి !! మినర్వాతో పోటీ చేయవలసిన తరుణం సమీపించింది. నా హస్తలాఘవం, నా కళా నైపుణ్యం లోకానికి వెల్లడిచేయవలసిన పుణ్యకాలం ఆసన్నమైంది." అని బిగ్గరగా కేకలుపెట్టింది.

మగ్గాలు ఆయత్తపఱచబడ్డాయి. అఖిలకళామయమూర్తి మినర్వా దేవత, క్షణికమానవస్వరూపిణి అరేక్నీ ప్రక్క-ప్రక్కనే మగ్గాల ముందు కూర్చున్నారు. మాటమంతి లేకుండా వారు తమపనిని ప్రారంభించారు. ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలతో పర్యాలోకనం చేస్తున్నారు. భీకరసంగ్రామంలో శరపరంపరలవలె మగ్గాలలో కండెలు తిరుగుతున్నాయి. అరేక్నీకు ఎట్లాగైనా బుద్ధిగరపాలనే ఉద్దేశ్యంతో, మినర్వా, పూర్వం క్షుద్రమానవాళి యే విధంగా గర్వాంధమై దేవతలచే శిక్షింపబడ్డదో తెల్పేకథల బొమ్మలు తన వస్త్రాల్లో నేసింది. ఈ చిత్రాలు కూడా ఆమెకు వినయాన్ని నేర్పజాలకపోయినాయి. అరేక్నీ, పూర్వం కొందఱు దేవతలు చేసిన స్వల్పతప్పిదాలను, గోరంతలు కొండంతలు చేసి, కథాచిత్రాలుగా తన వస్త్రాలలో పొందుపఱచింది. అంతటితో తృప్తిచెందక, "దేవతలంటే నాకేమి లెక్ఖ !!" అని నిర్లక్ష్యంగా తల నూపింది అరేక్నీ.

పోటీ పూర్తిఅయింది. మినర్వా, అరేక్నీమగ్గాన్ని పరీక్షించింది. అందులో గల బొమ్మలు చూడగానే ఆమెనేత్రాలు అగ్నిగోళాలయినాయి. మగ్గంలో గల గుడ్డను ఊడపెఱికి ముక్కలు ముక్కలుగా చించివేసింది, మినర్వా. దారపు కండెను తీసికొని, ఆగ్రహంతో అరేక్నీపై విసరి, "నీవు ఆజన్మాంతం దారం వడుకుచూ, నేతనేస్తూ ఒక పురుగుగా మారిపోవుదువుగాక" అని శపించి, అదృశ్యమైంది. మరుక్షణంలోనే అరేక్నీ ఒకగోధుమ రంగుపురుగుగా మారిపోయి, వెంటనే యింటికప్పుకు ఎగబ్రాకింది దారం నేసుకుంటూ !

ఈ రీతిగా గ్రీకులు పూర్వకాలంలో మొదట సాలీడు ఎట్లా ఏర్పడింది కథ చెప్పుకొనేవారు.



స్పానిష్, ఆఫ్రికన్, రెడ్ ఇండియన్ బాలబాలికలు ఏకమై దాగుడుమూత లాడుతున్నారు—బ్రిటిష్ హాండురాస్.

విద్య: స్త్రీసంస్కృతి

(12 వ పేజీ తరువాయి)

విజయలక్ష్మి, రాజకీయంలో కవిత్వం అల్లిన శ్రీమతి సరోజినిలాంటివాళ్లు ఎందరో!

అంతా ఇలా అవుతారా అని ఇంకో ప్రశ్న? ఎందుకు కాదు? అవుసరమైన శిక్షణ ఇవ్వాలామనం? స్త్రీలకు ఉపజ్ఞ ఉన్నా అది చచ్చిపోతుంది. అభివృద్ధి పొందే అవకాశం లేక, పెరగదు. స్త్రీపక్షం అనే గ్రంథంలో 'క్లెమెన్స్ డేన్' అనే రచయిత్రి 'ఉత్తమకళాసృష్టిలో స్త్రీ కనుపించకుండా, భాగం తీసుకుంటూనే వున్నది. కానీ మొట్టమొదట గుహల్లో పురుషుడు, పొగతో, ఎఱ్ఱరాతితో, బొమ్మ గీసినప్పుడు, ఒక స్త్రీకంటిని చూసే చిత్రించాడు. ఎవడైనా ఓపాట వ్రాశాడంటే, ఓగీత గీశాడంటే ఇంకొక్క మానవ హృదయం ఇచ్చిన ఉత్సాహంవల్లనే జరుగుతుంది. ప్రపంచం అనుభవంఅంతా ఓ కళాకారుని జ్యోతికి వెలుగు, ఇంకొక మానవ క్షేత్ర శక్తి అని చెప్తోంది భావయుతంగా. ఒకమాటతో, ఒకచూపుతో, ఒకరిమనసులో సృష్టించేశక్తి రగులుకొలిపే శక్తి కన్న మించినదేముందీ? అలాచేయగల శరీరంతో మనసుతో శక్తితో ఉండటంమాత్రం ప్రతిభ కదూ? కళాకారుడు గొప్పవాడే - అలా కళాకారుడ్ని సృష్టించేటట్లు చేసేవారు ఇంకా ఉన్నతులనడం అతిశయోక్తి కాదేమో?

సంఘంలో స్త్రీబాధ్యత

ఇలాగా, స్త్రీ మొదటినుంచీ, ప్రపంచానికి తెలిసో, తెలియకో, గొప్పదే. అయితే, ఆ, ఇంకేం, చదువెందుకూ, అని అనేసేస్తారా? సదుపాయాలు లేనప్పుడు ఉత్సాహం, ఆసక్తిమాత్రంగానే వుంటుంది.

స్త్రీ, ఎక్కడ చూచినా ఒకలాగే వుంది. గ్రీకురాజ్యంలో పిల్లల్ని కనడానికే స్త్రీవుందని నమ్మకం. ప్లాటోలాంటి విశాలహృదయం కలవాడుకూడా, అందమైన స్త్రీలనందరినీ, ఓచోట పెట్టి, రాజులకు మాత్రం, వాళ్లతో కాపురం చేయమన్నాడు. ఆకాలంలో పురుషుని నిరంకుశత్వం సూచిస్తుంది. 19,20 శతాబ్దాలలో జర్మనీదేశంలో స్త్రీనిగురించి 3 'K'లు చెప్పేవారట 'కిర్చీ, కుచే, కుండూ'అని. అంటే చర్చికి పోవటానికీ, వంటపని చేయడానికి, పిల్లల్ని కని, పెంచడానికీ, అని. యనలో పుట్టగానే తండ్రి ఆధారం, పెండ్లిలో భర్తకిందా, ముసలితనంలో కొడుకుదగ్గిరా వుండటం సామాన్య విషయం అయింది. ఈవిషయం చెప్తూవుంటే ఓ చిన్న విషయం జ్ఞాపకం వస్తోంది.

అమ్మాయీ, నీయిష్టమమ్మా! మీరు చదివిన రసాయనశాస్త్రం అంతా ఏమైంది? పులుసులో పిండికలిపి ఎంతపోయాలోకూడా తెలీదు'- ఈచదువు ఎవరికి లాభం? ఎందుకొచ్చింది? అంటాడు ఓమామగారు వంటచేస్తున్న కోడలుతో.

స్త్రీలు, పురుషులు, చదువుకుంటే సంఘానికి మరింత బలమనటం నిర్వివాదాంశం. ఒక మనసు పనిచేసేచోట, రెండుమనసుల శక్తి సంఘానికి వస్తుంది.

మాకు ఓహిందీ మాష్టరు వుండేవారు. ఈ ఊర్లోవుండిగా ఆయన ఒక్కరే హిందీ పాఠాలు చెప్పేవారు. చెన్నపట్టణం చేరారు. వారి భార్యకూ చదువు చెప్పి పరీక్షలు ప్యాసుచేయించారు. ప్రభుత్వం హిందీప్రచారానికి గోలెడుతోంది. ఇలాంటప్పుడు వారిద్దరూ చదువుచెప్తున్నారు స్త్రీలకు ఆమె-పురుషులకు ఆయన. చూడండీ, సంఘంకి ఎలా రెండు బలాలూ చేకూరాయో? వాళ్ళిద్దరూ, ఎలా సమిష్టి జీవనానికి సహాయభూతులవుతున్నారో.

కీడెంచి, మేలెంచాలన్నారు. వితంతువులు, భర్తచేత పరిత్యజింపబడినవారు కనీసం ఏ ట్రెయినింగో చదివేవుంటే, పుట్టింటిమీద పడకుండా పొట్టగడుకోవచ్చుగా! పట్టుదలతో వుంటే, వయస్సు మించిపోయిందని, నిరుత్సాహపడక తమ జీవితాలకు పునాదులు ఇప్పటికైనా నిర్మించుకోవచ్చు.

సమాజంలో ప్రస్తుత పరిస్థితులు అందరికి న్యాయాన్ని కలుగజేస్తుందనడం సందేహాస్పదంగా వుంది. కట్నాల బాధతో స్త్రీ ఒక భారంగా తల్లిదండ్రులు అనుకుంటున్నారు. కొంత ఆర్థికపరిస్థితి వుంటేనే గానీ, సాహసించి తమ నిర్ణయాన్ని, ఓవరుని ఎన్నుకోడంలో గానీ, ఓవున్నతవిద్య నిర్ణయించుకోడంలోగాని సఫలం చేసుకోలేరు. ప్రస్తుత రాజకీయరంగంలోకూడా, ఇతర దేశాల్లో స్త్రీలు, దేశసౌభాగ్యాన్ని, నిర్ణయించడంతో వున్న హక్కును వినియోగించుకోలేకున్నారు. విద్య లేకపోవడంతో రాజకీయాల్ని అవగాహన చేసుకోపోవడంగా తెలుస్తుంది.


స్త్రీ విద్యద్వారా 'సంస్కృతిని', ధైర్యంగా నిజాన్ని తను నమ్మినదాన్ని, చెప్పి, ఆచరించడానికి, అలవరుచుకుంటుంది. శాంతంగా, తనను తను విమర్శించుకొని, తనకు సంబంధించిన ఇతరులకు, తనకుగల, భేదాలను విశాలహృదయంతో గుర్తించి, మౌనంగా కలతలను సర్దివేయగల శక్తిని పొందుతుంది. గృహానికి, యశస్సుకి ఒక దైనికమైన శాంతని చేకూరుస్తుంది. వేదాంతాన్ని, విజ్ఞానాన్ని, దైనిక జీవితంతో పోటీచేసి ప్రతిసమస్యనూ తేలిగ్గా, తెలివిగా విడదీస్తుంది. గాంధితత్వం ఆచరణలో చూపిస్తూ, చెప్తూ, తన సంతానాన్ని, మానసిక, జాతికవీరులుగాను, వీరమాతలుగానూ చేస్తుంది. గాంధీ, కృషిచేత మహాత్ముడైనాడు. విద్యావతులైన తల్లులు ఎందరిని కృషిచేత మహాత్ములనుగా చేయనున్నారో!

'ప్రపంచంలో, సగం అశాంతి, ఒకరినొకరు సరిగా, అర్థంచేసుకోలేకపోవడంవల్లనే' అన్నాడు బెర్నార్డుషా నగ్నసత్యాన్ని, తన సంస్కృతి, సహనం ద్వారా, అర్థం చేసుకొని, సంసారాన్ని సౌఖ్యప్రదం చేస్తుంది.

మొదట మాతృభాషద్వారా చదువుకొనడంతో అధికప్రయాస తప్పుతుంది. రాష్ట్రభాష హిందీ నేర్చుకొని, ముందు రాబోయే, రాజకీయాల్లో, అధికంగా పాల్గొవచ్చు. మన భాషల్లోకి ఇంకా ప్రవేశించని విజ్ఞానార్జనకోసం ఇంగ్లీషుభాషలాంటి, అంతర్జాతీయభాషను నేర్చుకోవచ్చు.

'స్వరాజ్యం ఒకరిచ్చేది కాదు, సంపాదించుకోవాలి'అన్న మహాత్ముల ఆదేశాన్ని, మననంచేసుకొని, 'స్త్రీ స్వాతంత్ర్యం, సంస్కృతి, విద్య, ఒకరిచ్చేవి కావు-సాధించాలి'అన్న సుభాషితాన్ని అమలుజరపడంలో, త్యాగానికి సజీవంగా నిలిచిన మహిళ ముందుకు వస్తుందని నా దృఢ నమ్మకం.

(విజయవాడ ఎ. ఐ. ఆర్ వారి సౌజన్యంతో)



ఉత్తమ సంగీతము

శ్రీమతి జె. కమలాదేవి

"సంగీతము" అనునది ప్రపంచమందలి లలిత కళలలో నొకటియై యున్నది. ఇట్టి సంగీతమునుగురించి చెప్పవలయుననిన నావంటి యల్పజ్ఞులకు బహుకష్టసాధ్యమైన విషయము. "సంగీతమువలన ప్రయోజన మేమి?" అని మాటిగా ప్రశ్నించినచో కించిద్జ్ఞులగు నాబోంట్లు వెంటనే తగు సమాధాన మొసంగుట యసంభవము. అయినను ఉత్తమసంగీతమన నెట్టిదియో పూర్వులు చెప్పిన ఆధారముల మూలమున కొంతవరకు తెలిసికొనుటకు ప్రయత్నించితిని. నా యీ ప్రయత్నము నకు ప్రాజ్ఞులు మన్నింతురుగాక.

ప్రపంచమంతటిలోను విజ్ఞాన, వేదాంత, తత్వవిచారణములకు మొదటినుండియును ప్రసిద్ధిచెందిన మనభారతీయులు ఏకళనుగాని, ఏ శాస్త్రమునుగాని, చెప్పినను కూడ నంతయును భగవత్పరముగనే చెప్పియున్నారు. హైందవసాంప్రదాయదృష్ట్యా మానవునిజీవితమునకు పరమాశయము మోక్షసాధన మొకటియే కాబట్టి అట్టి ఆశయపరమావధియగు భగవదైక్యానుసంధానమునకు సంగీతమనునదియే సులభోపాయముగా పెద్దలగువారు బహురీతులుగా చెప్పుతూ వచ్చారు. ఇందులకు ప్రమాణ మేమన. "శ్లో॥ గీతిగానేన యోగస్స్యాత్, యోగా దేవ శివైక్యతా, గీతిజ్ఞో యది యోగేన, స యాతి పరమేశ్వరం"॥ అని చెప్పి యున్నారు. మరియును.

శ్లో॥ గీతేన ప్రియతే దేవః
సర్వజ్ఞః పార్వతీపతిః।
గోపీపతి రనన్తోఽపి
వంశధ్వనివశంగతః" (1)
సామగీతి రతో బ్రహ్మ
వీణాసక్తా సరస్వతీ।
కిమన్యే యక్షగంధర్వ
దేవదానవమానవాః॥ (2)
అజ్ఞాతవిషయాస్వాదో
బాలః పర్యజ్కికాగతః।
రుదన్ గీతామృతం పీత్వా
హర్షోత్కర్షం ప్రపద్యతే (3)
వనేచర స్తృణాహారః
చిత్రం మృగశిశుః పశుః।
లుబ్ధో లుబ్ధకసంగీతే
గీతే త్యజతి జీవితం॥ (4)
తస్య గీతస్య మాహాత్మ్యం
కే ప్రశంసితు మీశతే।
ధర్మార్థకామమోక్షాణా
మిదమేవైకసాధనమ్॥" (5)"

అని సంగీతరత్నాకరగ్రంథమందు శార్ఙ్గదేవులు చెప్పియున్నారు. కాని ఈ సంగీతసాధన యనునది అంతసులభము కాదు. చాలా కష్టం. ఎంతయో శ్రమించినవారికే తెలుస్తుంది అందలి యాథార్థ్యమూ ఆనందానుభూతియును.

ఇట్టి సంగీతోపాసన మోక్షసాధనమునకు దగ్గరమార్గము. సంగీతానికి ప్రధానము నాదము: ఈ నాదము మూలాధారమునందు జనించి, నాభి, హృత్, కంఠ, శిర, ముఖములలో విహరిస్తుంది. నిరతసంగీతానందయోగియగు త్యాగబ్రహ్మము నాదమహిమ ఇట్టిది యని చెప్పుటకు "మూలాధారజనాద మెఱుఁగుటే ముదమగు మోక్షముర, కోలాహలసప్తస్వరగ్రహముల గురుతే మోక్షమురా" అన్నారు.

కనుక నాదమే పరబ్రహ్మస్వరూప మని, నాదోపాసనయే భగవదైక్యసంధానమునకు తగిన ఉపాయ మనియును, ఇట్టి నాదోపాసన జేసియే త్రమూర్తులు వెలసి రనియు, ప్రాణాగ్నిసంయోగమువలన కలిగినధ్వనియు, అదియే ప్రణవ మనియు, అట్టి ప్రణవమే స, రి, గ, మ, ప, ధ, నీ యను సప్తస్వరములు అనఁబడు స్వరదేవతలు (సుందరులు) గా వెలసెననియు, ఈసప్తస్వరసుందరుల భజించినచో ప్రణవోపాసన జేసినట్లే యనియు, అదియే మోక్షదాయక మనియు విజ్ఞులు చెప్పుదురు. శ్రీ త్యాగబ్రహ్మోక్తము లగు ఉపనిషద్వాక్యాలు కొన్ని ఈ క్రింద నుదహరింపఁబడును.

"శోభిల్లు సప్తస్వరసుందరుల
భజింపవె మనసా"
"నాదలోలుడై బ్రహ్మానంద మందవే"
"సంగీతశాస్త్రజ్ఞానము
సారూప్యసౌఖ్యదమే మనసా"
"నాదసుధారసం బిలను
నరాకృతాయెరా"..

ఇట్టివి, యనేకములు ప్రసిద్ధములు. త్రిమూర్తులు సంగీతప్రియులు. రాక్షసరాజగు రావణుడు పరమశివుని తన తపస్సుచేత మెప్పించలేకపోయినందున అద్భుతంగా సామగానం చేయడము ప్రారంభించాడు. వెంటనే పరమేశ్వరుడు మనస్సు కరగి తృప్తిచెంది దయతలచాడు. రాక్షసు డని తెలిసియుకూడ నతని సంగీతమహిమకు పరవశుడై యతడడిగిన వరములన్నిటిని ఇచ్చినాడు. శ్రీకృష్ణుడు వేణుగానలోలుడు. సరస్వతి వీణాధరి. బ్రహ్మ సామగాన ప్రియుడు. ఇల్లే నారదుడు, తుంబురుడు, మతంగుడు, దత్తిలుడు, నందికేశ్వరుడు, అర్జునుడు మొదలగువా రనేకులు సంగీతోపాసన, జేసి, నాదవిద్యామర్మమును తెలిసికొని భగవత్సాక్షాత్కారమును పొంది యీ సంగీతశాస్త్రకర్త లయినారు.

సంగీతమనునది యొక గొప్ప అధ్యాత్మ విద్య. ఆవిద్యను వర్ణించతము, మధువు యొక్క రుచిని (తీపిని) తెలుపుటవలె నుండును. అట్టి సంగీతమును నేర్చి, పాడి, తాదాత్మ్యమును జెంది ఆనందమును అనుభవిస్తేనే తెలుస్తుంది. అనుభవైకవేద్యము. సంగీత, సాహిత్యములు రెంటిలో సంగీతము ఆపాతమధుర మని వినినంతలోనే శ్రోతలకు

తెలియనటుల ఆనందపారవశ్యతను కలుగజేస్తుంది అని అందరు అనుభవమును. ఏ కళగాని, ఏ విజ్ఞానముగాని, అనాదిసాంప్రదాయాన్నీ, క్రమపరిణామాలనీ, అనుసరిస్తూ పాత, క్రొత్తదనాలను సమన్వయము చేసుకొన్నప్పుడే సహృదయులలోకానికి స్థిరమైన ఆనందాన్ని కలిగించగలుగుతుంది. ఆ సాంప్రదాయాన్ని గమనించకుండా తాత్కాలికంగా ఎదుటి రక్తిని (అభిరుచిని) జూచుకొని తన కళను ప్రదర్శిస్తే ఆ కళయందలి విశిష్టత పోతుంది. విశేషించి సంగీత శాస్త్రమర్యాదలో యీ సాంప్రదాయాన్ని గుర్తించవలసిన యవసరము ఎంతయేని గలదు. గాయకుడు అనుశ్రుతముగా వచ్చెడి పూర్వుల సత్సంప్రదాయము మీదను, శ్రోతల యభిరుచులమీదను, మనోధర్మం మీదను, ఆధారపడి నూతనసృష్టిచాతుర్యాన్నీ, ఊహావిశేషమును పోషించవలసియున్నది. ఇది ఉత్తమగాయకుని లక్షణము.

రాగభావాన్ని పోషించునపుడుగాని, తదనుకూలమగు సాహిత్యాన్ని పాడునపుడుగాని, దాని కనుకూలమగు స్వరసమ్మేళనమందుగాని, పూర్వాచార్యుల సాంప్రదాయాన్ని ఆధారంగా పెట్టుకొని నూతనోత్సాహముతో క్షణక్షణనవ్యముగా మధుర్యభావమును చిత్రించగలిగినట్లయితే ఆ గాయకుని సంగీతానికి విశిష్టతయు, ఒక ప్రత్యేకతయును తప్పక కలుగుతుంది. అట్టి సంగీతము చిరకాలము శ్రోతలలో స్థిరత్వాన్ని కలిగించి కళాభివృద్ధికినీ అభ్యుదయమునకును దోహదముగా ఉంటుంది.——

మన దక్షిణభారతసంగీతమునకు అట్టి స్థిరప్రతిష్ఠను పొందగలిగినట్టి సాంప్రదాయాన్ని పూర్వవాగ్గేయకారకులగు వేంకటమఖి, పురందరదాసు, త్యాగరాటస్వామి, శ్యామశాస్త్రి, ముద్దుస్వామిదీక్షితులు మొదలగువారు నిరూపించియున్నారు. వీరిలో త్యాగరాజు తనకంటె పూర్వులగు పురందరదాసాదుల పద్ధతులను, కీర్తనాసాంప్రదాయములను, లక్ష్యమునందుంచుకొని తన కృతులయందు సంగీతలక్షణములను కూడ ననేకములను సూచించియుండిరి. మరియును గాయకునికి ఆనందోద్వేగము ఉప్పొంగునంతటి యవకాశాన్ని, అందాన్ని చేకూర్చి చక్కని తేటతెల్లమగు తియ్యని తెనుగుమాటలతో ననేకములగు కీర్తనలు రచించి పాడి మార్గం చూపియున్నారు. వీరి రచనలలో పదబాహుళ్యము లేక తక్కువ అక్షరపదములతో నుండి యొకపదతిలో పల్లవి, అనుపల్లవి, చరణములు అను వేర్వేరు విభాగములుగా నుండుటచే గాయకునకు ఆకృతియందలి రాగభావాన్ని విస్తరింపజేసి పాడుట కెంతయో అవకాశము కలదు. మరియును సాహిత్యమందు గల అర్థ, భావ, గాంభీర్యాన్ని శ్రోతలకు చక్కగా మనస్సునకు హత్తుకొనులాగున విన్యాస మొనర్చుటకు వీలు కలదు. ఇట్టి వీరి పోకడ చాలా స్వతంత్రముగా ఉంటుంది.

వీరికి పూర్వమున దాక్షిణాత్యసంగీత (బాణీ) మనియు, ఔత్తరాహికసంగీత (బాణీ)మనియు, కర్ణాటకసంగీత (బాణీ) మనియును భిన్నభిన్నవిధానము లుండినట్లు తెలియగలదు. ఇట్టి భిన్నభిన్నవిభేదములను సమైక్యపరచి యట్టి సమ్మేళనముతో తాను కొన్ని క్రొత్తరాగములనుకూడ సృష్టించి ఆయా రాగములలో కీర్తనలను కూడా వ్రాసి పాడి, శిష్యులకు అభ్యసింపజేసి ప్రచారములోనికి తెచ్చియున్నారు. అట్టి రాగములు కొన్ని చెంచుకాంభోజి; విజయశ్రీ, నాగస్వరావళి; నవరసకన్నడ; సారమతి; జనరంజని; గరుడధ్వని; బహుధారి; దిలీపకము; సుపోషిణి; మొదలగునవి. ఇట్లు సంగీతసాహిత్యాలలో భిన్నభిన్నజాతీయతల నైక్య మొనర్చి యుండిరి. ఔత్తరాహికగాయకు లగు శ్రీగణేశభావే యనువారును, పట్నాలగోవిందమారార్ అనునతడును (ఇతడు పల్లవిని ఆరుకాలములలో గాన మొనర్చెడివాడట.) త్యాగరాజుని వద్దకు దైవప్రేరితులై వచ్చి వీరివల్ల ఉత్తమ సంగీతమును విని ఎన్నియో అద్భుతవిషయములను మెరుగులను నేర్చుకొని వెళ్లినట్లుగా చరిత్రనుబట్టి తెలియగలదు. ఇట్టి యీ సందర్భమును పురస్కరించుకొనియే శ్రీ త్యాగరాజస్వామి" సదాశరథీ నీబుణము దీర్ప నాసతీర దూరదేశములను నా కీర్తి ప్రకాశింపజేసి..." అని చెప్పుకొనియున్నారు.

వీరి కీర్తనలు కొన్నింటిలో శ్రద్ధగా గమనించిచూడగా వీరికి సంగీత మంటే "రాగమే" ననెడి భావంకూడా స్ఫుటముగా నుండినట్లు తెలియగలదు. కనుకనే వీరి కీర్తనలు రాగభావానికి తగిన వ్యవధి నలకవిగా నున్నవి. ఇతరసహకారార, అనుకరణసాధనములగు మృదంగ తాళాదులను గూర్చి "సొగసుగా మృదంగతాళము జతగూర్చి నిను సొక్క జేయు ధీరు డెవ్వడో" అని త్యాగరాజులవారు చెప్పియున్నారు, అందుచే గాయకుని గానమును అనుసరించి మృదంగాదివాద్యధ్వనులు సహకారముగ రసపోషణము చేయవలయునే గాని గాయకుడు వీటి కధీనుడై వాటి ననుసరించక తన స్వాతంత్ర్యమును చూపవలయునని వీరి ముఖ్యభావము. ఇంకను మరియొక విశేష మేమనగా నితరవాగ్గేయకారకులు తమ సంగీత లక్షణములకు లక్ష్యములుగా కృతులను వ్రాసియున్నారు. శ్రీ త్యాగరాజస్వామి తన కీర్తనలలో కొన్నిటియందు ప్రత్యేకసంగీత లక్షణములను చెప్పియున్నాడు. ఉదాహరణమునకు ఆరభిరాగమందలి కృతి "నాద సుధారసం బిలను నరాకృతాయె మనసా..." అను కృతిలో నాదములను వర్ణించుచూ వాటిని రాముని కోదండాకృతిని పోల్చి చూపి "స్వరములారు నొకగంటలు (స్వరములారు నొకగంటలు అని పాఠాంతరము) వర రాగము కోదండము; దుర; నయ; దేశ్యము త్రిగుణము; నిరతగతి శరమురా; సరససంగతి సందర్భము గల గిరములురా; ధర భజనే భాగ్యమురా త్యాగరాజు సేవించు నాద సుధారసం బిలను". అని చెప్పియున్నారు. ఇందున "స్వరము లారు. ఒకగంటలు" (శ్రీ రాముని కోదండమునకు చిరుగంటలుగా సప్తస్వరములను పోల్చి చెప్పినారు). అని విభాగ మొనర్చి చెప్పుటలో షడ్జ మొకటిన్ని భేదము లేనట్టి ప్రధానప్రకృతిస్వర మనియు మిగతా స్వరములు వికృతిరూపములు గలవని యును, దుర (అనగా ఘన), నయ, దేశ్యములు అని రాగములు మూడు భేదములు గలిగియున్నవి. అట్టి రాగములు మూడింటిని (త్రిగుణము) ముప్పిరిగొనిన అల్లెత్రాడును పోల్చి చెప్పియున్నారు. మరియొక విధముగా చెప్పవలెననిచో దుర అనగా ద్రుతము; నయము; దేశ్యము; అనునట్టి గతిభేదములను చూపించి ధనుర్ధారిలక్ష్య భేదనములలో చూపునట్టి ఏకాగ్రతను, లక్ష్యపద్ధతిని; ఈ మహనీయుడు నాదోపాసనయందు నిరూపించియున్నాడు అని చెప్పదగును. మరియును ఇంకొకసందర్భములో సాధారణముగా "మంద్ర; మధ్య;"తారములు అను మూడుస్థాయిలు మాత్రమే వ్యవహారములో నుండగా, అనుమంద్రము; అతితారము, అనునవి మరి రెండు కూడను వెలయించి చెప్పి ఈ అయిదింటికినీ స్థానములు "నాభి; హృత్; కంఠ;

రసన; నాసాదులయందు శోభిల్లు సప్తస్వర సుందరుల భజింపవే మనసా" యని నాభి, హృదయము, కంఠము, నాలుక, నాసిక, మొదలగునవి వాటిస్థానములుగా చెప్పియున్నారు. మరియును, "నాదతను మనిశం శంకరం నమామి మే మనసా శిరసా"...

"మోదకర నిగమోత్తమసామవేదసారం వారం వారం అనియును," నాదోపాసనచే శంకరనారాయణవిధులు వెలసిరి ఓ మనసా" యని "నాదలోలుడై బ్రహ్మానంద మొందవే" "మూలాధారజనాద మెఱుగుటే ముద మగు మోక్షమురా" అని మొదలుగా చెప్పుటను బట్టి సంగీతము కేవలము ఒక కళమాత్రమే కాదనియును, ఆత్మజ్ఞానమునకు వలెనే నాదబ్రహ్మోపాసన కూడా ఎట్టి సాధనసంపత్తి యొక్క ప్రమేయమూ లేకుండా ముక్తిని కలిగించగలదనెడి తత్వనిర్ణయముకూడను నిరూపణచేసియున్నాడు. మరియొకవిశేషమేమన వీరి కీర్తనలలో ఏ కీర్తనఎత్తుకొనినను చక్కని విశ్రాంతియు; సాహిత్యభావాలకు అనుగుణముగా వరుసక్రమములో సోపానపంక్తులవలె అనేకరాగభావాలతో నిండిన సంగతులును; అట్లని కేవలసాహిత్యప్రాధాన్యమే కాకుండా సంగీతప్రాధాన్యము యమకపదచిత్రాలతో తూచినట్టుగా లాలిత్యము ఒలుకునట్టి పదజాలము మొదలైన ఎన్నియో భావములు స్ఫురిస్తూ ఉంటాయి. కీర్తన ఎత్తుకొనుటలోనే దాని రాగముయొక్క ప్రధానస్వరూపము వినేవారికి సులభముగా గ్రాహ్యమౌతుంది. ఇకను సాహిత్యపోకడలో త్యాగరాజు చూపిన పోకడలూ, సాంప్రదాయాలూ, సాంఘికపరిష్కారములు, నీతి నియమములు, భక్తి, జ్ఞాన, వైరాగ్యప్రబోధకము లగు ఉపదేశాలు మొదలగువాటి నన్నిటినికూడా ఆ యా సాధకులు మననము చేసుకొని అనుసరింపతగినట్టుగా నుండగలవు. ఇన్ని విషయములున్నా వినేవానికి విసువు జనించకుండా చక్కని సంగీతమధురరసము యొక్క అనుపానముతో అమృతగుళికలవలె ఆస్వాదనీయం చేసినాడు.

మరియును, సనకసనందనాది తత్వవేత్తలు మొదలుకొని పురందర, రామదాసాదులవరకు కూడా "ఎందరోమహానుభావులు" అని స్మరించి; వినతు లొనర్చి; శ్రుతి శాస్త్ర; పురాణాదులయందలి పరమసారమును భావనచేసుకొని భక్తిరసముతో పైవాటినన్నిటినీ సమ్మేళనము చేసుకొని తాను ఈ కృతిరచనకు పూనుకొన్నట్లుగా చెప్పుకొనియున్నాడు.

తానీ సంగీతసాహిత్యాదివిద్యలనన్నిటినీ నేర్చుకొన్నందుకు పరమప్రయోజనము; లక్ష్యము; ఏమిటో నిరూపించుకొని అందరును ఇదే అనుసరింపతగ్గదని ఆదర్శాన్ని చూపాడు మహనీయుడు. ఇదియునుగాక (ధన్యాసిరాగములో) "రామాభిరామామనసు రంజిల్ల బల్కగరాదా; బంగారుపాన్పుపై భామామణి జానకి, శృంగారించుకొని చెలువొంద నిన్ను గని పొంగుచు, మల్లెవిరుల బూజించు వేళ శ్రీ హరిసంగీతము బాడు మన స్వామి త్యాగరాజునితో" నని సీతారాముల ఏకాంతసన్నిధిలో తాను సంగీతము పాడుకొనెడి భాగ్యమును అర్థించుటలో తన విద్యయొక్క పరమఆదర్శ మనియును, మరియును, ఎందరు ప్రభువులు తనను మెచ్చిన నేమి, జగన్నాథుని యనుగ్రహపాత్రమగుటయే ధన్యత యని లోకానికి చాటించాడు. భక్తియు, ప్రపత్తియును లేని జన్మ మెందులకని నిందించుచూ "తెలియని కునట విటక్షుద్రులు, వనితలు, స్వవశ మౌట పదిశించి సంతసిల్లు మదిలో స్వరలయంబు లెఱుగకను శిలాత్ములై సుభక్తులకు సమానమను దుడుకు గల నన్నే దొరకొడుకు బ్రోచురా" యని గౌడరాగదుండలి (పంచరత్నమును) చెప్పియున్నాడు. మరియును, గాయకుని గురించియు నియమములను గురించియు ననేకనియమములం జెప్పి హెచ్చరిక యొనర్చినాడు. డాంబీకులును, అల్పజ్ఞులు నగు క్షుద్రగాయకులను నిరసించుచూ (చెంచుకాంభోజిరాగములోని) "వరరాగలయజ్ఞులు దామనుచు వదరేరయా ॥ స్వరజాతిమూర్ఛనాభేదముల్ స్వాంతమందు దెలియకయుండినా ॥ వరరాగలయజ్ఞులు దామనుచు వదరేరయా ॥ "దేహోద్భవం బగు నాదముల్ దివ్యమౌ ప్రణవాకారమనే దాహం బెఱుంగని మానవుల్ త్యాగరాజనుతయే చేరు రామా॥ వరరాగలయజ్ఞులు దామనుచు వదరేరయా॥ ౧ అని గట్టిగా మందలించాడు. నిరసించినాడు. (శ్యామశాస్త్రియొక్క శిష్యులలో కొందరు డాంబికముగా వీరికడకు వచ్చి కొన్నికీర్తనలను పాడినటులను, అందు వారు చాలా తప్పులతో పాడిరనియును అందుపైన సహ్యకరము లగు వారి లోపములను నిరసించుచు త్యాగరాజు ఈ కీర్తనను చెప్పియుండిరనియును ఒక కథ గలదు.)

లలితకళల నుపాసించెడివారు నియమబద్ధులై శ్రీ రామ భక్తి కలిగియుండవలెననియు హెచ్చరించి నీతిని గరపినాడు. మరియును జ్ఞానుల మనుకొనెడివారిని గురించియు, పండితులు, వంచకులు, డాంబికులు, తీర్థయాత్రాపరులు, దేవాలయాదిదర్శనాపరులు మొదలగువారిలో గుగలు లోపములనెత్తి చూపి బహుమెత్తనిమాటలతో లోనియావేదనను అనేకకీర్తనలయందు విమర్శించియున్నాడు. ఇట్లనేక సందర్భములు గల యనేకకృతులును, దేవతామూర్తులపరముగ స్తుతులను, శృంగారభావగర్భితములైన అనేక ఉపచారాదికము లగు కీర్తనలను రచించి పాడి తన సంగీతసాహిత్యరచనలలో నీవిశ్వమునంతటినికూడ ప్రతిబింబిత మొనర్చి, మానవత్వమును బాగుగా నర్థముచేసికొని సార్థకత నొనర్చిన మహనీయమూర్తి మన త్యాగరాజు. దక్షిణదేశసాంప్రదాయంలో ఇంత విశృతమును, విశాలమైన భావనాసామ్రాజ్యమును సజీవ మగునట్టి రూపములో లోకమునకు ప్రసాదించిన త్యాగధనుడు మన త్యాగరాజు. ఎంతటి విషయము నైనను లలితమైన రాగములతో మేళవించి గానమొనర్చులో నవి యాబాలగోపాలమును నిత్యపారాయణముగా స్థిరాక్షరములై పోతవి. శ్రీ త్యాగరాజు గేయాల్లోని సంగీతసాంప్రదాయం; సాహిత్యసాంప్రదాయము రెండును కూడ జనసామాన్యంలో బాగుగా ప్రచారమును పొందవలయును. విశిష్ట మగు ఉత్తమసంగీతసాంప్రదాయ మన నిట్టిదియే. ఇదియే మనకు మార్గదర్శకము.

చెప్పుల జోడు

రచన : శ్రీ ఓగేటి శివరామకృష్ణ

ఆ చెప్పులజోడు కాంతాపతి యెప్పుడు కొన్నాడో యేమో నాకు తెలియదు గాని, దాన్ని సుమారుగా నాలుగయిదుఏండ్లనుంచి, అతగాడి వద్ద నున్నదన్న సంగతిమాత్రం నాకు తెలుసు. అయితే నాలుగయిదుసంవత్సరాలకాలం ఒకే ఒక చెప్పులజోడు ఉందంటే నాకే కాదు...మీ కందరకూ ఆశ్చర్యం కలుగుతుంది.

కాంతాపతి మంచి స్థితిమంతుడై యున్న పెద్దమనిషై యుండి యేమిటో నాలుగయిదు అతుకులతో ఉన్న ఆ చెప్పుల జోడుకోసం అలా ఆరాటం చూపిస్తాడంటే... నాకు కారణం తెలియకపోయినా, అసలు విషయం తెలుసుకోవాలని ఆదుర్దా నాలో హెచ్చుగా ఉంటూం డేది.

అందుకనే కొద్దిరోజులక్రితం...సంగతి సందర్భాలు తెలుసుకొందామని, శ్రీరామ నవమిపందిట్లోకి నేనుగా వెళ్ళినవాణ్ణి వెళ్ళినట్లుగా ఉండక, అతగాడి చెప్పులజోడు జాగ్రత్తగా మారుమూల రహస్యంగా దాచి వచ్చి ఏం జరుగుతుందో అని చూశా...

అక్కడ జరిగిన పాటకచ్చేరీమీద ధ్యాస యే మాత్రం కాంతాపతి చూపాడో యేమో గాని, 'ఏమిటోయ్...వెళ్ళిపోదామా' అని నే అడగటమే తడవుగా, 'సరే' అని పందిరి చివరకు నాతో కలసివచ్చేశాడు. అయితే మేం చెప్పులజోళ్ళు తొడుక్కొని వెళ్ళటమే తర్వాయి.

నే మామూలుగా నా జోడు తొడుక్కొని ముందేం జరుగుతుందో అని తల తిప్పాంటే 'అనుకొన్నట్లే అయింది' అంటూ కళ్ళనీళ్ళపర్యంతం కాంతాపతి చూసేసరికి కారణం బోధపడినా నాకు సంగతిసందర్భాలు తెలుసుకోవాలని ఆరాటం కల్గింది.

'ఏంటోయ్' అన్నా .. అయింది... నా చెప్పులజోడు ఎవడో కొట్టేశాడు'—

'ఓస్...ఆ...చి. నీజోడేనా...శని విరగడయింది. ఈవాళే మరోటి కొందాం... ఇంతటితో నీ శనీ చెప్పులజోడుశనీ విరగడైంది అన్నా'

'అట్లా గంటా వేమిటోయ్'—అన్నాడు కాంతాపతి విచారం వెతిబుచ్చుతూ బిక్కమొగంతో'

'మరి కాక—వెధవ చెప్పులు పోయినందుకే అంత బాదపడతా వేమిటోయ్'

"ఛా...ఆ చెప్పులు పోతే మరో చెప్పులు కొనుక్కోవచ్చు. దాని క్కాదు'—

'మరి...'

'ఆలాంటి చెప్పులు మరి దొరుకుతాయటోయ్'—


'ఏమిటోయ్—పిచ్చిగా మాట్లాడుతావ్'—

'కాదు—ఆలాంటి చెప్పులు మరి నాకు దాసియెత్తుధనం యిస్తే దొరుకుతాయటోయ్. అది కొన్న వేళావిశేషం ఆలాంటిది'.

'ఏమిటో చాలా వింతగా మాట్లాడుతున్నావ్'—అన్నా.

'అవును నే మాట్లాడేది నీకు వింతగానే కనపడుతుంది...అయ్యో...నిష్కారణంగా నిక్షేపంలాంటి చెప్పులజోడు పోగొట్టుకొన్నానే—ఇక్కడక రాకపోయినా బాగుండేది...అయిదు సంవత్సరాలకాలం అనుభవించాను. ఫలితం...ఆజత దొరకటం నా అదృష్టమనుకొని సంతోషించాను. అనుకొన్నట్లు నా అదృష్టం గూడా పడింది. ఎన్నో యీ జతకొన్న తరువాత నా కనుకూలంగా జరిగాయి. ఏలాటి కష్టాన్నయినా యీ జత మూలకంగా సునాయాసంగా దాటిపోవచ్చు ననుకొన్నా... నాకు ముందువెనుకలు, ఆత్మగతులు తెల్పేది... యీ జత అనే యింతకాలం ఆనందంగా కాలం గడిపా... ఎవడో నా జత కొట్టేశాడు. నా అదృష్టం తనవశం చేసుకొన్నాడు...నా పొట్ట కొట్టేశాడు'—

'ఏమిటోయ్...ఆలా అఘోరించుతావ్. ఇంతకీ పోయిన చెప్పులజోడునకేగా నీ యీ బాధంతా— అంత బాధపడకు...



వరంగల్ సమాజయువకసభ కార్యనిర్వాహకసభ్యులు, సభాధ్యక్షులు శ్రీ మధుసూదన్ జీ

నీకు అంతగా కావలసివస్తే...నా డబ్బు తోటే నీకు నచ్చినరకం చెప్పులజోడు కొని యిస్తా'.—అన్నా.

'ఆ...దాని కంటావ్'—అంటూ ఏమిటో అవ్యక్త వ్యథ ననుభవిస్తున్నట్లు అనసాగాడు.

'పోనీ మరోపని చెయ్యవచ్చు. నీది పోయింది పాతజత. ఇక్కడ అనేకరకాల జోళ్లున్నాయి...నీ జోడు కొట్టేసినవ్యక్తికి తగిన శాస్తి చెయ్యలేకపోయినా...నీ జోడు కిమ్మత్తు కంటె, హెచ్చు కిమ్మత్తు చేసే జోళ్లు యిక్కడ అనేకం ఉన్నాయి. అందులో యేదో ఒకటి కొట్టేసినట్లయితే విధంచెడినా, ఫలం అయినా దక్కుతుంది!

'అయితే...నన్ను ఆవిధంగా...తలుస్తున్నా వన్నమాట'—

'తలచక—కాకపోతే అరిగిపోయిన పాతచెప్పులకోసం విచారం వెళ్ళబోసే వాడ్ని నే యెక్కడా చూడలేదోయ్'

'అదికాదోయ్...భాబూ...ఆ పోయిన నా జత దొరికిట్లయితే మన ఊరిదేవుళ్లకు చెరి నాలుగుకొబ్బెరకాయలు కొడతాను... నువ్వు యేం చెయ్యమన్నా చేస్తాను'—

'అసలు ఆ చెప్పులమీద అంత అభిరుచి కల్గటం'—

'ఏమిటేమిటి...చదువుకు స్వస్తి చెప్పినప్పటినుంచీ యీ జోడే నన్ను యెన్నో ఆపదలనుండి రక్షించింది...'

'బలే వింతగా వుందోయ్ నీ మాటలు. చెప్పులజోడేమిటి—ఆపదలనుండి రక్షించటం ఏమిటి' —'పోనీ ఆపదలు కాదనుకో అనుగ్రహాలనుకో...

'ఏమయితే నేమిటి ఎంతో మేలు ఆ జతవల్ల పొందాను. అలాంటిదాన్ని పోగొట్టుకొన్నానంటే'—

"ఏం పొందావేమిటి అంటావా ... నీకిదంతా హేళనగా కన్పిస్తుంది. సరిగ్గా చెప్పులజోడు కొన్నరోజునే మన యింటర్మీడియెటు పరీక్షాఫలితాలు పడ్డాయి. ఏలాగా పరీక్ష తన్నివేస్తుందని తలపోసిన నేను సరిగ్గా యీ జోడు కొన్నరోజునే—ప్యాసయినట్లుగా వార్తరావటం జరిగింది." అంతే కాదు. సరిగ్గా ఈ జోడు కొనేముందు పెండింగులో ఉన్న మా తాలూకు దావా ఒకటి ...జోడు తొడుక్కొని చిక్కగా చిక్కగా చిక్కసారి కోర్టు యెక్కేటప్పటికి మా తరఫయింది:

నే కోరుకొన్న పిల్ల నాకు వివాహంచేయటానికి మా తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఎంతో బ్రతిమిలాడాను. ఎన్ని చెప్పినా వసేమిరా...అదేమిటో గాని ఆ జోడు కొన్న తర్వాత—. ఏం. మహత్యమో గాని...అది తాయత్తులా వాళ్ళమనస్సుల్ని మార్చి, నే కోరుకొన్న అమ్మాయిని వివాహం చేసుకొనేటట్లు చేసింది...

ఉద్యోగంలోనికి వర్షాల్...వలిగిస్తున్న యీ ఉద్యోగంలో యిప్పటికీ ఉన్నత అంతస్థు పొందానంటే నా తెలివితేటలు, స్వప్రయోజనం వల్ల మాత్రంగాదు...ఏమయినా నా జోడుమూలముగానే: నిప్పులు కక్కే ఆఫీసర్లందరూ...ఆ జోడుతో లోనికి ప్రవేశించే నన్ను చూచి మెత్తపడిపోయి, యెక్కడలేని గౌరవం చూపేవారు.

అంతెందుకూ...మావా ళ్ళెవరూ ఆడపిల్లలుకనే అదృష్టం నోచుకోలేకపోయారు... అది స్వప్రయోజనంవల్ల కాదు...నా జోడు మహత్యంవల్లనే కోరుకొన్న ఆడపిల్ల నా యింట పెలసింది...

ఆ జోడుతో బజారులోనికి వడితే... ఎంతో గౌరవం జరుగుతూ యుండేది...ఇది తొడుక్కొన్నట్లయితే యెక్కడా గర్వం కన్పించేదికాదు...అలాటి...

'ఇంతేనా మరేమేనా ఉందా?'

'ఇంకేం కావాలి—' అది జాలరు... నిర్భాగ్యుడ్నయి ... వచ్చి...అదృష్టదేవతను చేతులారా గెంటి వేశా...మాయదారి శ్రీరామనవమి ...న న్నీలా తీసుకొచ్చి యింత పని చేసింది'—

'బాగుంది...పిచ్చివాడా...ఈలా పాత చెప్పులజోడుకోసం బాధపడేవాడ్ని నే యెక్కడా చూడలేదు. మరోటి కొనుక్కొందాం అంటూంటే—'

'నీకు అలాగే ఉంటుందిఅవున్లే... ఎంతకన్నా నా...అదృష్టదేవతకు సమాన మవుతుందా'—

మరి నాకు వోపిక లేకపోయింది. తోడుగానూ యీ చెప్పులజోడుసంభాషణ శ్రీరామనవమి పందిట్లోనే జరుగుతోంది...దూరం

నుంచి వింటున్న శ్రోతలకు మా సంభాషణ పిచ్చివాళ్ళవాగుడులాగా కన్పడటమే కాకుండా వినేదానికి కూడా అడ్డు కల్గించినవాళ్ళ మవుతాం. అందువల్ల మరి అంతటితో కథ నాపుచేయటం మంచిదని యుద్దేశించి, జాగర్త చేసిన ప్రదేశందగ్గిరకు తీసుకొనివెళ్ళి, వెతుకుతున్నట్లుగా నటిస్తూ: 'మరి ఒకవేళ దొరికితే నాకేమిస్తా' వని ప్రశ్నించా...

'ఓస్...ఏం కావలిస్తే... అది. మరి సందేహం అవసరం లేదు—'

'ఏం అక్కర్లేదు గాని...ఓ అరకప్పు కాఫీనీళ్లు పోయించు చాలు' అన్నా చాప క్రింద జోడు బైటపడేస్తూ!

విజ్ఞానవిశేషాలు

(36-వ పేజీ తరువాయి)

కూచునేవాడు. తలెత్తేవాడు కాదు. మొదట్లో ఏవో మాటలు చెప్పి వేళ్లతో సంజ్ఞలుచేసి నేర్పబోయినాడు. అదేమీ లాభం లేకపోయింది. ఇది పనిగాదని అక్షరాల దగ్గిర్నించి సులువైన అక్షరాలు పలకడం నించి ఆరంభించారు. రోజూ కొంత సేపు గంట సాధన చెయ్యగా అసలువాడు తలెత్తిచూసేసరికే కొన్ని వారాలు పట్టింది. ఆతరవాత అచ్చులు పలికేసరికి అయిదు మాసాలుపట్టింది. ఆపైన పూర్తిగా తిరిగి మాటలు వచ్చేసరికి ఏడాదిన్నర పట్టింది. ఏమైతేనేం మాట్లాడేప్రజ్ఞ పూర్తిగా తేరుకుంది. ఇలాగే మరికొన్ని కేసుల్ని సాధించేసరికి ఈపద్ధతిని అమెరికాలో అందరు డాక్టర్లు అనుసరించడం ఆరంభించారు. ప్రత్యేకంగా ఇందుకోసమే కొన్ని ఆస్పత్రులు స్థాపితమైనాయి. డాక్టర్లు చేపట్టిన కేసుల్లో విఫలమైన వేవీ ఇంతవరకూ లేవు.

అంటే మనం మెదడులో సగం భాగాన్నే ఉపయోగిస్తున్నామన్నమాట. మిగతా సగం భాగం వినియోగపడటంలేదు. ఉపయోగపడుతున్న భాగంలో ఏకేంద్రానికి దెబ్బ తగిలి అశక్తమైపోయినా, పోయిన ప్రజ్ఞని మరమ్మతు చేసుకోడానికిగాను దానికి జంటగా మరొకదాన్ని దేవుడు సిద్ధంచేసి పెట్టాడన్నమాట మోటార్లవెనకాల వేలాడే అయిదోచక్రం మాదిరిగా.

[సాటర్డే ఈవెనింగ్ పోస్టునించి]

'నిఘామాను' సహాయం

(8-వ పేజీ తరువాయి)


ఇదేవిధముగ యావత్ భారతదేశములోను తగు ఏర్పాట్లు చేయవలెనని భారతప్రభుత్వ ఆహారశాఖఉపసంఘమువారు సూచించి నమూనా ఒకటి వ్రాశినారు. కాని మన రాజధానికి ప్రస్తుతము అది భారీయగునట్లు తోచినందున మదరాసు ప్రభుత్వమువారు చిన్న ఎత్తున ఒక స్కీము తలపెట్టిరి.

ఈ ప్రకారము ముందుగ పైనచెప్పిన జిల్లాలలో మొత్తము 12 ఫిర్కాలయందు వచ్చే పంటకాలమునకు అమలుకు వచ్చును. అప్పటి అనుభవమునుబట్టి దాని వ్యాప్తి యుండును.

ప్రతిఫిర్కాలోను మంచి అనుభవశాలి అయినటువంటి ఉత్తమపద్ధతులలో వ్యవసాయము చేయ కుతూహలము శక్తి గల నిఘామాను అను ఒకరిని నియమించెదరు. ఇతనిని గౌరవప్రచారకుడని చెప్పి నెలకు ప్రయాణ ఖర్చులు వగైరా రు. 50/-లు ఇచ్చెదరు. ఇతనికి సహాయముగ వ్యవసాయశాఖ మేస్త్రీ వుండును. ఈప్రచారకుడు స్థానిక వ్యవసాయశాఖాధికారితో జతపడి పని చేయును. మేస్త్రీ సహాయముతో అనేక రైతుల స్వంతభూములలోనే కొత్తవడుపులు వగైరా తెలియగలందులకు చిన్న మళ్లు కేటాయించి సాగుచేశి చూపించును. తాలూకాకు ఇటువంటి మళ్లు 50 ఏర్పాటు చేయును. మడికి సెం. 0-25లు. ఇంతేగాక ఈప్రచారకుడు వీలయినన్ని గ్రామములు తిరిగి గ్రామ వ్యవసాయసంఘములు నిర్మించి ప్రదర్శనములు నడిపి ఇంకా ఇతరవిధముల వ్యవసాయసౌభాగ్యమునకు కృషిచేయును. మామూలుగ వ్యవసాయశాఖవారికి అందుబాటులో లేని గ్రామములను ఇతడు ముఖ్యముగ చూచును.

ఈ మద్దతుకు తోడు మదరాసుప్రభుత్వము వారు గ్రామకూటములు లేక సర్వార్థసహకారసంఘములను ఏర్పరచి ఈరెండువిధముల సర్వతోముఖమైన వ్యవసాయములో అభివృద్ధి సంకల్పించియున్నారు. గ్రామములో సాగుకు లాయకయిన భూమియావత్తు శ్రేష్ఠమైవిధముగ ఉపయోగపడునట్లున్నూ గ్రామస్థులకు కావలసిన వ్యవసాయఉపకరణములు యావత్తు వారికి సులభముగ గ్రామములోనే లభించునట్లు ఈ గ్రామకూటముల స్కీము ఉద్దేశించబడినది.

విజ్ఞాన విశేషాలు



మెదడులో మరమ్మతుకి సదుపాయం

ప్రమాదవశాత్తు తలకి దెబ్బతగలడంవల్ల గాని మూర్ఛవల్లగాని మాటపడిపోవడం లేక జ్ఞప్తి నశించడం మొదలైన వానికి మందు లేదని ఇటీవల కొంతకాలంవరకూ డాక్టర్లు అనుకుంటూ వచ్చేవారు. ప్రమాదానికి గురైనవాళ్లకి మాటపోవడం కద్దు. కొందరికి అంతవరకూ చేతనైనవి చదువను వ్రాయనూ ప్రజ్ఞను పురిచిపోవచ్చు. మరికొందరికి వినే మాటలకి అర్థం తెలియకుండా పోవచ్చు. కొందరికి రంగులు కనిపించకుండాపోవచ్చు. అలవాటైనవి స్మృతినుంచి చెరిగిపోవచ్చు. వీటిలో ఏ ఒకటైనా ప్రాప్తించవచ్చు. లేక అనేకం ప్రాప్తించవచ్చు. మెదడులో కొన్ని సూక్ష్మమైన అరలు అంతరించినందువల్ల ఇటువంటివి సంభవిస్తాయనీ, అందువల్ల వీటికి మందు లేదనీ డాక్టర్లు భావించేవారు.

కాని ఇటీవల వీటికి నివారణోపాయాలు కనిపెట్టబడినాయి. 1861లో పాల్ బ్రోకా అనే ఫ్రెంచి సర్జన్ ఒక వింత విశేషాన్ని కనిపెట్టాడు. కుడిచెయ్యివాటం కల వాళ్లకి మాటలతాలూకు ప్రజ్ఞ మెదడులో ఎడమప్రక్క కొంత ప్రాంతంయొక్క అధీనంలో ఉంటుందనీ, ఎడమచెయ్యివాటం కలవాళ్లకి ఆ ప్రజ్ఞ మెదడులో కుడిప్రక్క కొంత ప్రాంతంయొక్క అధీనంలో ఉంటుందనీ ఇతడు కనిపెట్టాడు. ఆపైన యాభైఏళ్లతరవాత, అంటే 1900 ప్రాంతాల ఒక స్వీడిష్ డాక్టరు ప్రతిమనిషికీ పుట్టగానే మెదడులో రెండు కేంద్రాలుంటాయనీ, అవి ఒకటి కుడిప్రక్కనూ, ఒకటి ఎడమప్రక్కనూ ఉండి మాట్లాడే ప్రజ్ఞనిస్తాయనీ కనిపెట్టాడు. పుట్టిన కొన్ని మాసాలకి రెంటింటిలో ఒక కేంద్రం ప్రాబల్యం సంపాదిస్తుంది. రెండోది వాడుకలేకుండా ఉండిపోతుంది. అలా ప్రాబల్యం సంపాదించిన కేంద్రం ఏ ప్రమాదంవల్లనైనా చచ్చుపడిపోతే రెండో కేంద్రాన్ని క్రమంగా ఉపయోగించడం అలవాటు చెయ్యవచ్చునని ఈ డాక్టరు అన్నాడు. తరవాత 1917 ప్రాంతాల ఈ విషయంపైన ఈ డాక్టరే తీవ్రపరిశోధన ప్రారంభించాడు. అరడజను దేశాల్లో ప్రమాదాలకి గురైన 1500 మంది రోగులకి సంబంధించిన రికార్డు తయారు చేశాడు. ఈ పరిశోధనఫలితంగా మెదడులో మాటప్రజ్ఞే కాక అనేక ప్రజ్ఞల కేంద్రాలు రెండేసి చొప్పున చేరిఉన్నాయని తెలిసింది. మెదడులో వెనుకప్రాంతంలో రెండు కేంద్రాలుండి అందులో ఒకటి మన చూపుని అదుపులో పెడుతుంది. అక్కడ దెబ్బతగిలితే కళ్లు తెరిచినా చూచే శక్తి లోపించిపోతుంది. అంటే ఎదురుగా ఉండే వస్తువుల్ని చూస్తాం కాని అవేమిటో మనకి తెలియకుండాపోతుం దన్నమాట. చదవడం దుర్లభమౌతుంది.

మిగతా కేంద్రాల జంటలు మాట్లాడేటట్లు చేస్తాయి. ఎవరైనా మాట్లాడే మాటల్ని మనకి అర్థమయేట్లు చేస్తాయి. ఒక జంట మనం లెక్కలు చెయ్యడానికి సహాయపడుతుంది. ఇలాగే సంగీతం, వ్రాత, చదువు, రంగులు చూసే శక్తివగైరా.

ఎవరికైనా ప్రమాదంవల్ల ఏ ప్రజ్ఞయినా లోపిస్తే, ఆ ప్రజ్ఞని పునరుద్ధరించుకోడానికి మెదడులో రెండో కేంద్రం మిగిలిఉందని స్వీడిష్ డాక్టర్ నిరూపించాడు.

ఆ డాక్టరు తాను చేసిన పరిశోధనల ఫలితాలన్నిటినీ ప్రచురించాడు. అతని తరవాత ఒక డేనిష్ పరిశోధకుడు జొహాన్స్ నైల్సన్ అమెరికాలోనూ యూరప్‌లోనూ 1930 లో పరిశోధన ప్రారంభించి స్వీడిష్ డాక్టరు వ్రాసిపెట్టినదంతా చదివాడు. చదివి సారాంశాన్ని సంగ్రహంగా వ్రాసి, తన అనుభవంలో సేకరించిన మరికొన్ని వివరాల్ని చేర్చి ఒక గ్రంథం ప్రచురించాడు.

మాటపోయినవాడికి మెదడులో ఏ ప్రక్క కేంద్రం పాడయిందో ఎలా కనిపెట్టాలో నైల్సన్ వ్రాశాడు. ఏయే ప్రాంతాలు ప్రమాదానికి గురికాకుండా మిగిలాయో ఎలా కనిపెట్టాలో వ్రాశాడు. రోగికి రెండో కేంద్రాన్ని ఉపయోగించడం ఎలా నేర్పాలో, తద్వారా తిరిగి మాటలు ఎలా నేర్పాలో వివరించాడు.

తెలుగురానివాడు హిందీరాని తెలుగువాడికి హిందీ ఎలా నేర్పుతాడో సరిగ్గా అదేపద్ధతిని అనుసరించాలన్నాడు. అంటే సంజ్ఞలు ముఖకవళికల సహాయంతోనూ, చిత్రంగా శబ్దాలుచేస్తూ నేర్పాలన్నమాట.

రెండో ప్రపంచసంగ్రామంలో మెదడులోకి తుపాకి గుళ్లముక్కలు దూసుకుపోయి మాట మర్చిపోయిన వాళ్లలో కొందరిని కూచోబెట్టి నైల్సన్, డా॥ డోనల్డ్ వజ్ల్ మొదలైనవారు ప్రయత్నించి చూశారు. చెయ్యవలసినదల్లా ఏమీ లేదు. మాటపోయిన వాడిని రోజుకి కనీసం పావుగంటసేపు కూచోబెట్టి మాట్లాడడం నేర్పడమే. కొందరికి ఆలస్యమైనా సరే తప్పకుండా మళ్లీ మాటలు అబ్బుతాయి.

యుద్ధంలో మెదడుకి దెబ్బ తగిలి ఆపరేషన్ చేయించుకున్న ఒకనికి మాట పోయింది. డా॥ వజ్ల్ అతన్ని ముందుగా పలకరించాడు. పలకరించగానే అతను ఎగిరి గంతేశాడు. పిడికిళ్లు బిగబట్టి పళ్లు పటపట లాడించటం మొదలెట్టాడు. చేతికి తుపాకి దొరికితేచాలు ఆత్మహత్య చేసుకోడానికి సిద్ధంగా ఉన్నాడు. అయినప్పటికీ డీని కూచోబెట్టి మాటలు నేర్పడం మొదట కష్టమయింది. కాలి బొటనవేలు నేలకి రాస్తూ

(35-వ పేజీ చూడుడు)

మనదేశం

రెండుగా విమానాలు, ఒక రైలుప్రమాదం, ఒక రాష్ట్రనిర్మాణపు భంగపాటు, కనీసం రోజుకొక కమ్యూనిస్టుముఠా దాడి, ఒక పోలీసుదళ ప్రతీకారచర్య ఇవి చాలవన్నట్లు ఆంధ్రదేశంలో వేసవి కన్నెర్ర చేస్తోంది. ముఖ్యమంత్రిగారి సంచారం, ప్రకాశం కళా వెంకట్రావుగార్ల సంచారాలు, ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ సమావేశాల సంరంభం మున్సిపల్ కౌన్సిల్ రభసలతో ఉడుకెత్తిఉన్న విజయవాడలో వేడిమి శనివారంనాడు 117½ డిగ్రీలకి ఎక్కిపోయింది. రెండేళ్ళకిందట (1948 లో) 121 డిగ్రీలు వరకూ వచ్చింది.

ఈ సంవత్సరంకూడా అంత గట్టి రోళ్ళనీ బద్దలుకొడతానని బెదిరిస్తోంది వేసవి. మంత్రులు సంచారాలకి బయలుదేరే సమయంచూసి చెన్నపట్నంలో కూడా అడపాతడపా గాడుపు కొడుతోంది. దక్షిణాదిని కోస్తాలో వేసవిఆరంభంలో రావలసిన వర్షాలు రాక పంటలు పాడైపోతున్నాయి. ఆంధ్రదేశంలో తుపానువల్ల కలిగినదానికంటె అధికనష్టం సంభవిస్తున్నదని అనుకుంటున్నారు.

కాంగ్రెస్ పంచాయతీల ఎన్నికలకి కాంగ్రెస్‌లోని వివిధవర్గాలవారు సన్నద్ధమౌతున్నారు. చెప్పుకోదగిన ప్రత్యర్థిపార్టీలు లేని శాసనసభల ఎన్నికలు, స్థానికసంస్థల ఎన్నికలకంటె, రెండేసిమూడేసివర్గాల బలాలు ఇటూఅటూ తూగుతున్న కాంగ్రెస్‌లో కాంగ్రెస్ పంచాయతీల ఎన్నికలే ప్రధానమైనవనిపిస్తోంది. అదీకాక శాసనసభల ఎన్నికలు 1951 వేసవిలోగా జరగవు. (అసలైన ఎప్పుడు జరుగుతాయో ఇప్పుడప్పుడే తెలియదు.) స్థానికసంస్థల ఎన్నికల్ని వోటర్ల జాబితాలు తయారుకానందువల్ల 1950 అక్టోబర్ నుంచి 1951 జనవరికి వాయిదా వేసినట్లు మంత్రి గోపాలరెడ్డిగారు తిరువన్నామలైనుంచి ప్రకటన చేశారు.

నానాటికీ సస్యసంపదతోపాటు పెరుగు నెయ్యిలుకూడా పేరుకి మాత్రం నిలిచి, వింతవింతఆకృతులు పొందుతూ, అసలే వేడెక్కిపోయిన మెదళ్లకి ఆతపం అపనయింప చెయ్యడానికి ఆధారం లేకుండా పోతుంది. దీనికితోడు గాలివానవచ్చి మామిడిపూతని ఎగరకొట్టేసి ఆంధ్రదేశానికి ఆవకాయకరువుకూడా తెచ్చిపెట్టి ఆ జిహ్వాతృప్తికూడా లేకుండాచేస్తుందనే అనుమానం కలుగుతోంది.

కేంద్రమంత్రివర్గం:


కేంద్రమంత్రివర్గపునర్నిర్మాణం ఈ నెలాఖరుతో పూర్తికాగల సూచనలు కనిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పండిట్ గోవిందవల్లభపంత్ కేంద్రమంత్రివర్గంలో చేరడానికి నిరాకరించినట్లు తెలియవచ్చింది. మున్షీ మెహతాబ్ గార్లు ప్రమాణస్వీకారం చేశారు. మున్షీగారు ఆహారవ్యవసాయశాఖలకు, మెహతాబ్ గారు పరిశ్రమలు సప్లై శాఖలకు నియమితులైనారు. అల్పసంఖ్యాకవర్గశాఖకు ఉపమంత్రిగా నియమితులైన శ్రీ సి. బిశ్వాస్ గారు కలకత్తాలో కార్యాలయం నెలకొల్పుకుంటున్నారు. శ్రీజయరాందాస్ దౌలత్ రామ్ గారు మంత్రిపదవికి రాజీనామా నిచ్చారు. ఈ నెల 27 వ తేదీని అస్సాంగవర్నరుగా ఉన్న శ్రీ శ్రీ ప్రకాశ్ గారు కేంద్రప్రభుత్వంలో వాణిజ్యశాఖామంత్రిగానూ శ్రీదౌలత్ రామ్‌గారు అస్సాం గవర్నరుగాను నియమించబడగలరు. శ్రీరాజగోపాలాచారిగారు డా॥ మత్తయ్‌గారి స్థానే ఆర్థికశాఖామంత్రిగా నియమితులౌతారని ఢిల్లీ నుంచి వార్తలు వస్తున్నాయి. వీరు కాక త్వరలోనే చాలమంది స్టేట్ మంత్రులూ డిప్యూటీ మంత్రులూ నియమించబడగలరని కూడా వార్తలు వస్తున్నాయి.

తలకు మించిన ఖర్చులు *

చెన్నరాష్ట్రమంత్రివర్గం ఈ మాసం రెండోవారంలో ద్రవ్యపరిస్థితిని గురించి చర్చించారు. ఈ సంవత్సరం దాదాపు 15 కోట్ల రూపాయల ఖర్చుతో ప్రాజెక్టులు బిల్డింగులు వగైరా నిర్మించడానికి ఏర్పాటు చెయ్యబడింది. అసలైతే 30 కోట్ల రూపాయలవరకూ రిజర్వునిధులున్నాయికాని, ఇప్పుడు ఈ నిర్మాణాల్ని కొనసాగించడానికి చేతిలో డబ్బు కొరతగా ఉంది. రాష్ట్రప్రభుత్వం ధనం కావాలని స్వయంగా ప్రజలవద్ద ఋణం చేదామంటే ప్రజలు ఇస్తారో ఇవ్వరో నమ్మకంలేదు. అసలు అటువంటి ప్రమేయం పెట్టుకోరాదని కేంద్రప్రభుత్వపు ఆర్థికశాఖవారు సలహా ఇచ్చారు. కేంద్రప్రభుత్వమైనా రాష్ట్రప్రభుత్వం తరఫున ఋణాలు తీసుకోడానికి సిద్ధంగా లేదు. కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలకిచ్చే ద్రవ్యసహాయం క్రమక్రమంగా తగ్గిపోతోంది. అందువల్ల చెన్నరాష్ట్రప్రభుత్వానికి ఎటూ తేలని సమస్య వచ్చింది. తలపెట్టిన కార్యక్రమాల్లో మానగలవే లేవు. ఏ కార్యక్రమాన్ని మానినా ఆ ప్రాంతంవారు ప్రభుత్వాన్ని నిందిస్తారు. తుంగభద్రప్రాజెక్టు మరీ నెమ్మదిగా సాగుతున్నదంటే హేతువు కొన్ని పరికరాలు రావడానికి జాప్యమని నిపుణుల కొరత అనీ అంటున్నారు. వీనికితోడు ధనాభావం ఒకటి ఇప్పుడు వచ్చిపడింది. రాయలసీమలో థెర్మల్ స్టేషన్ల నిర్మాణం వెనకపడింది. నెల్లూరుజిల్లాలో నిర్మాణం మాత్రం నిరాటంకంగా జరిగిపోతోంది. ఇలాగే అనేక అనుమానాలకు తగవులకు ద్రవ్యాభావం తావిస్తోంది. తిన్నెవెల్లి, మధుర జిల్లాల్లో గ్రామాలకు వ్యవసాయంనిమిత్తం విద్యుచ్ఛక్తి సప్లై చేసే కార్యక్రమానికి ఏ అభావమూ అడ్డు రావడంలేదు. రాయలసీమలో గ్రామాలకు పట్టణాలకుమంచినీటి వసతికి చెరువుల మరమ్మతుకి ప్రభుత్వధనభారం అధికమైపోతోంది. శ్రీ కాశేశ్వరరావుగారి

పెరుగును కాల్వల సిమెంటు కూడా మరికొంతకాలం "ఆలోచనలో"నే పడి మూలుగుతూ ఉండవలసివస్తోంది. దిగువ భవానీ ప్రాజెక్టు ఎంత చురుగ్గా సాగుతుంటే తుంగభద్రప్రాజెక్టు అంత మందగిస్తుంది. రామపాదసాగరం సాగరగర్భంలో కలిసిపోయినతరవాత కంటికి ఆనినమేర చూసి పనక్కి వచ్చినవారు కృష్ణా - పెన్న ప్రాజెక్టుపట్ల శ్రద్ధవహిస్తున్నారు. దీనివల్ల చెన్నపట్నానికి మంచినీటిసదుపాయం, నెల్లూరు చెంగల్పట్టు జిల్లాలకి పంటనీటిసదుపాయం కలిగే అవకాశం ఉంటే సరే. లేకపోతే ఇదీ రామపాదసాగరంతో లేపట్టవచ్చును. ఇప్పటికి మాత్రం పరిశోధనల తాలూకు కాగితాల కట్టలుగుట్టలు ఇంకా పెరుగుతున్నాయి.

తొమ్మిది రాష్ట్రాలలో ప్రభుత్వాల ఖర్చుల్ని పరిశీలించి, నిర్మాణ కార్యక్రమాల పైన ఖర్చుల్ని ప్రభుత్వాలు తగ్గించుకోవలసిన అవసరం ఉందని ఈమధ్య రిజర్వ్ బ్యాంక్ వారు హెచ్చరించారు. ముందుముందు వస్తువుల ధరలు ఆదాయాలు తగ్గగలవనీ, అందువల్ల ప్రభుత్వాలకు రాగల పన్నుల ఆదాయం తగ్గగలదనీ చెప్పారు. ఆదాయాల మొత్తాలు, వానిపైన పన్నుల మొత్తాలు తగ్గవచ్చునేమోగాని, అమ్మకపు పన్నువల్ల



ఆదాయం తగ్గకుండంటే గోపాలరెడ్డిగారు నమ్మలేరు. ఈ పన్నువల్లనైనా వస్తువుల ధరలు తగ్గకుండా చెయ్యవచ్చును. పన్నులు విధించగలిగినంతవరకూ అన్నిటిపైనా విధించారనీ, ఇంక విధించడానికేమీ మిగల లేదనీ రిజర్వుబాంక్ వారు చెప్పారు. ఇది కూడా నమ్మడానికి శక్యం కాకుండా ఉంది. అన్నంమాట ఎలాగున్నా ఇంకా విస్తరాకులు మిగిలిఉన్నాయి.

ఆహారధాన్యాలపై కంట్రోల్ తొలగించాలని దేశంలో ఆందోళన బయలుదేరినందువల్ల ఈ విషయమై పరిశీలించడానికి భారతప్రభుత్వంచేత నియమించబడిన విచారణసంఘం పరిశీలన పూర్తిచేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సంఘానికి పండిట్ లక్ష్మీకాంత మైత్రాగారు అధ్యక్షులు.

వ్యాపారుల ప్రవర్తన విశ్వసనీయంగా లేనందువల్ల కంట్రోల్ తొలగించరాదని ఈ విచారణసంఘం నివేదించింది. అయితే ప్రభుత్వం తలపెట్టిన ఆహారోత్పత్తి అభివృద్ధి కార్యక్రమాలు ఫలించినప్పుడు కంట్రోల్ తొలగించవచ్చునన్నారు. ఆహారం కొరవగా ఉన్న ప్రాంతాల్లో రేషనింగ్ ఎప్పటి మాదిరిగానే అమలుజరుపుతూ, ఆహారం మిగులుగాఉండే ప్రాంతాల్లో వ్యాపారస్వేచ్ఛనిచ్చి, ధరలు పెరగకుండా ప్రభుత్వం ఆధ్వర్యంక్రింద చౌకదుకాణాలు నెలకొల్పాలన్నారు. పల్లెప్రాంతాల రేషనింగ్ పద్ధతినీ, ధాన్యసేకరణవిధానాన్నీ సంస్కరించవలసిన అవసరం ఉందన్నారు. రైతులకు, చిల్లరవర్తకులకూ మధ్య ఒక తరగతిలోవ వ్యాపారుల్ని తొలగించి, ధాన్యం అమ్మే ధరకీ బియ్యం కొనుబడి ధరకీ మధ్య గల వారా చాలా తగ్గించవచ్చునన్నారు. కంట్రోల్ అమలుజరుగుతున్న పద్ధతిని తనిఖీ చేసే విధానం పూరిగా మారాలనీ అజమాయిషీ బలపడాలనీ సూచించారు. దిగుమతిచేసుకునే ఆహారవస్తువుల ధరలకంటె ఏ రాష్ట్రంలో ఆహారవస్తువుల ధరలు అధికంగా ఉంటాయో అక్కడ రాష్ట్రప్రభుత్వాలకు కేంద్రప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వకూడదన్నారు.

ఈసూచనలన్నిటినీ కేంద్రప్రభుత్వమూ, రాష్ట్రప్రభుత్వాలూ పరిశీలించగలవు. అసలు అన్నివస్తువులపైనా కంట్రోల్సు ఉండాలా ఉండరాదా అనే విషయమై పరిశీలించడానికి మరొక విచారణసంఘాన్ని కేంద్రప్రభుత్వం నియమించనున్నందువల్ల, అదేదో తేలేవరకూ ఆహారవస్తువులపైన ప్రస్తుతపు కంట్రోల్ పద్ధతిలో ఎలాంటి మార్పులూ చేయరని భావించవచ్చును.

భూవిశిస్తు *

చెన్నరాష్ట్రంలో భూవిశిస్తునిర్ణయపద్ధతి శిస్తును చెల్లించే రైతులకుగాని వసూలుచేసే ప్రభుత్వానికిగాని లాభదాయకంగాలేదనీ, పద్ధతిని మార్చవలసిఉంటుందనీ చాలాకాలంగా ఆందోళన ఉంది. జమీందారీరద్దుబిల్లును చెన్నరాష్ట్రశాసనసభలో శ్రీకళావెంకట్రావుగారు ప్రవేశపెట్టినప్పుడు ఈ విషయమై విచారణ జరిపించగలరని వాగ్దానమిచ్చారు. ఈ విషయమై ప్రభుత్వోద్యోగులే అప్పుడే అవసరమైన వివరాల్ని సేకరిస్తున్నారు. వీనిని శాసనసభ కాంగ్రెస్ పార్టీవారి అభిప్రాయాలకు అనుగుణంగా సంతరించి నివేదిక తయారుచెయ్యడంనిమిత్తం ఇప్పుడు మద్రాసుప్రభుత్వం ఒక విచారణసంఘాన్ని నియమించింది. ఈ సంఘానికి యం. వి. సుబ్రహ్మణ్యం గారు (ఐ. సి. యస్. ఉద్యోగి) అధ్యక్షులుగా ఉంటారు. శ్రీయుతులు బెజవాడ రామచంద్రారెడ్డి, యన్. రంగారెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు, సి. సుబ్రహ్మణ్యం, యం. యస్. దేశికర్, వి. ఎ. మునిస్వామిపిళ్లై జి. శంకరన్ నాయర్ గార్లు సభ్యులుగా ఉంటారు. శ్రీ యస్. ఆర్ కైవార్ (ఐ. సి. యస్. ఉద్యోగి) కార్యదర్శిగా నియమితులైనారు.

రెవిన్యూబోర్డు ఉండాలా అక్కరలేదా, ధాన్యంపైన అమ్మకపు పన్ను విధించవచ్చునా కూడదా! వ్యవసాయ ఆదాయపుపన్ను విధించవచ్చునా లేక శిస్తువిధానాన్ని ఎలా సంస్కరించాలి? సేద్యం చెయ్యని పట్టాదార్లని ఉంచాలా లేక వారి పట్టాలను రద్దుపరచాలా, లేక మధ్యవర్తులు, రైతులు, భూమియున్నవారు వగైరాలమధ్య ఎటువంటి వ్యవహారాలు నిర్ణయమవాలి మొదలైన సమస్యల్ని ఈ విచారణసంఘం పరిశీలించగలదు.

[సీతారామ్]

డీన్ అఛిసన్

(5 వ-పేజీ తరువాయి

అమెరికన్ ప్రభుత్వం బంగారం ధరలతో జూదమాడి తంత్రంచేసి తద్వారా అన్యవస్తువుల ధరల్ని కోరిన రీతిని హెచ్చించి తగ్గించడం ఎఛిసన్‌కి గిట్టలేదు. ఈ రీతిగా చెయ్యడం శాసనవిరుద్ధమని వాదించాడు. ఈరీతిగా చెయ్యరాదన్నాడు. చెయ్యరాదని చెప్పడంవల్ల రూజ్వెల్టుకి కోపం వచ్చింది. వెంటనే ఎఛిసన్ రాజీనామా ఇచ్చినట్లు రూజ్వెల్టు ప్రకటించాడు. అయినా, ఎఛిసన్ పదవిలో నియమించబడిన హెన్రీ మార్గెంథా ప్రమాణం స్వీకరిస్తున్నప్పుడు ఎఛిసన్ స్వయంగా శుభాకాంక్ష ప్రకటించినప్పుడు, "డీన్, నిజంగా నువ్వు సరసుడవోయ్" అన్నాడు రూజ్వెల్టు. ఆ తరవాత ఎవరైనా తనపైన కోపగించినప్పుడు "ఎఛిసన్‌ను చూసి సభ్యవర్తన నేర్చుకోండి" అనేవాడు రూజ్వెల్టు.

1941 లో కార్డెల్‌హాల్ కోరికపైన ఎఛిసన్ విదేశాంగశాఖ సహాయ కార్యదర్శిగా తిరిగి ప్రభుత్వంలో చేరాడు. ఈ పదవిలో అరువు-కౌలు కార్యక్రమాన్ని, ఐక్యరాజ్యసమితి పునరావాస కార్యక్రమాన్ని, అంతర్జాతీయ ద్రవ్యనిధి కార్యక్రమాన్ని అతిసమర్థతతో నిర్వహించాడు. ఐక్యరాజ్యసమితి ప్రమాణపత్రం తయారు చేసినప్పుడు సహాయంచేశాడు.

యుద్ధానంతరం ఏటంశక్తివృద్ధి కార్యక్రమనిర్వహణలో తోడ్పడ్డాడు. మార్షల్ ప్రణాళిక తయారీతో ఇతని కృషి ఉంది. విలియం ఫేల్‌తో కలిసి అంతర్జాతీయ అణుశక్తివినియోగ కార్యక్రమాన్ని తయారు చేశాడు. బరూచ్ ప్రణాళికకు ఈ కార్యక్రమమే ప్రాతిపదిక అయింది.

రష్యాతో అమెరికా వైరం 1946 లో ప్రారంభమయింది. అప్పటినుంచీ అమెరికన్ విదేశాంగవ్యవహారనీతికి ఎచిసన్ నేత అయినాడు. రష్యన్ పత్రికల్లో విమర్శలకీ దూషణలకీ ఈనాడు అధికంగా గురైనవాడు ఎఛిసన్. మార్షల్ ప్రణాళికను ఒక తెన్నులో పెట్టి ఎఛిసన్ సహాయకార్యదర్శి పదవికి 1947 జూలైలో రాజీనామా నిచ్చాశు.

అదృష్టంపైనా వాంఛపైనా జీవితాన్ని అల్లుకుంటూవచ్చి, తన దుస్తులమాదిరిగానే మెదడునికూడా నిర్దుష్టంగా క్రమబద్ధంచేసిన ఎఛిసన్ 1940 సంవత్సరారంభంలో విదేశాంగమంత్రిగా నియమితుడు కావడంతో అతనికి జీవితంలోకెల్ల పరీక్షాసమయం వచ్చింది. బ్రిటిష్ వ్యక్తిత్వవిశిష్టత ఒంటబట్టిన ఎఛిసన్‌కి బ్రిటిష్ రాజనీతితంత్రజ్ఞతను ప్రదర్శింపవలసిన అవసరం కలిగింది.

చీనాలో కమ్యూనిస్టుల విజయంతో అమెరికన్ విదేశాంగశాఖోద్యోగుల్ని అందర్నీ దేశం అంతా తీవ్రంగా విమర్శించనారంభించింది. చీనావ్యవహారనిర్వహణకి తాను బాధ్యుడు కాకపోయినా విమర్శలకి సమాధానమిచ్చి విదేశాంగశాఖతరఫున వాదించాడు. కమ్యూనిస్టుల విజయానికి అమెరికన్ విధానం హేతువుకాదనీ, చియాంగ్ ప్రభుత్వంయొక్క అసమర్థతే హేతువనీ వాదించి ఆసియావాసుల విమర్శలకు గురైనాడు. ఫార్మోజాలో ఎట్టి విధానం అవలంబించాలనే విషయంపైన రక్షణశాఖతో తగవువచ్చింది. ఇలాగే జపాన్ భవిష్యన్నిర్ణయం గురించి కూడా ఇప్పుడు తగవు వచ్చింది. విదేశాంగశాఖలో కమ్యూనిస్టులున్నారని రిపబ్లికన్‌పార్టీ ప్రచారం చేస్తున్నప్పుడు, కోర్టుశిక్షకు గురైన తన మిత్రుడు హిస్ పక్షం వహించినందుకు పత్రికలు నాయకులు తీవ్రంగా విమర్శించారు. కాని ఎన్ని విమర్శలు వచ్చినా నదురు బెదురు లేక తన విధానాన్ని నిష్కర్షగా అమలు జరుపుతున్నాడు.

1947 వరకూ చేపట్టిన అన్ని కార్యక్రమాల్నీ సమర్థుడైన విక్రేతవలె కాంగ్రెస్ చేత అంగీకరింపచేశాడు. విదేశాంగమంత్రి అయిన తరవాత సంవత్సరంవరకూ విమర్శలకు సమాధానాలివ్వడంతో సరిపోయింది. 1950 సంవత్సరారంభంతో సమగ్రరాజ్యతంత్రవిధానాన్ని అమెరికాలోనేకాక అగ్రరాజ్యాల ఆధ్వర్యంకింద ఉన్న అన్ని దేశాలలోనూ విక్రయించడానికి నడుం కట్టాడు. ఏవిషయంలోకాని న్యాయవాది కేసుని సమగ్రంగా పరిశీలించి కూలంకషంగా చర్చించేవిధంగా శ్రద్ధవహిస్తాడు. తన అభిప్రాయాలెలా ఉన్నప్పటికీ ప్రభుత్వవిధానాన్ని న్యాయవాదివలె సమర్థిస్తాడు.

ఎఛిసన్ సాధించిన కార్యాలలో అట్లాంటిక్ ప్రణాళిక ముఖ్యమైనది. కాంగ్రెస్‌లో తీవ్రవాదోపవాదాలకు విమర్శలకు నిలిచి సమ్మతింపచెయ్యగలిగాడు. ఈ సంవత్సరం అట్లాంటిక్ పాక్టుదేశాలకు ఆయుధసామగ్రి సహాయకార్యక్రమాన్ని సులువుగా అంగీకరింప చేశాడు. అట్లాంటిక్ పాక్టు ఫలితంగా అమెరికా అనవసరంగా ప్రపంచయుద్ధంలో చిక్కుపడవలసి వస్తుందని కాంగ్రెస్‌లో విమర్శ వచ్చినప్పుడు, తన తర్కజ్ఞానాన్ని ప్రయోగించి చిక్కుపడదని వాదించాడు. వాస్తవానికి ఈ పాక్టువల్ల ఏ అట్లాంటిక్ పాక్టుదేశమైనా యుద్ధంలో చిక్కుకుంటే అమెరికాతోపాటు పాక్టు దేశాలన్నీ యుద్ధంలోకి దిగకతప్పదు.

ఈరీతిగా తంత్రంపైన అంతర్జాతీయ రాజకీయాల్ని కూడా నడుపుతూ, అమెరికా ప్రాబల్యాన్ని ప్రపంచం అంతటా సుస్థిరపరిచి, రష్యన్ వర్గాన్ని నిర్జించాలని ఎఛిసన్ ఆశయం.

కాని పరీక్షాసమయంవచ్చేసరికి దర్పం కాని వ్యాపారదక్షతకాని విక్రయచాతుర్యం కాని ఎఛిసన్‌ను కాపాడలేకపోతున్నాయి. చీనాలో అమెరికన్ విధానాన్ని సమర్థించి నందుకు, ఆసియాలోని ఇతరదేశాలలో చురుకైన కార్యక్రమాన్ని దేనినీ అమలు జరపలేకపోయినందుకూ అమెరికన్ రాజకీయ నాయకులు ఎఛిసన్‌ను విమర్శించి రాజీనామా నివ్వాలని ఆందోళన లేవదీశారు. అయితే ఆందోళనకీ బెదిరింపులకీ అతను లొంగలేదు. ప్రపంచంలో కమ్యూనిస్టు నిరోధానికి సమగ్ర రాజ్యతంత్రం అనే పేరుతో అట్లాంటిక్‌పాక్ట్ దేశాలు, బ్రిటిష్ కామన్వెల్త్, ఆగ్నేయాసియాలలో సమీకృత ఆర్థిక సైనిక కార్యక్రమాల్ని జరపడానికి కృషిచేస్తున్నాడు. ఆస్ట్రేలియా ఆధ్వర్యం కింద ఆస్ట్రేలియా, మలయా, ఇండోచీనా, సయాం, బర్మాలలో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించి, ఈ కార్యక్రమంలో భారతదేశాన్ని ఇరికించడానికి బ్రిటిష్ కామన్వెల్త్ రాజ్యాల సహకారవిధానాన్ని ముడిపెట్టడానికీ, ఇండోచీనా మలయా, ఇండోనీషియాలలో కమ్యూనిస్టు నిరోధక కార్యక్రమాన్ని ఒకదాన్ని అమలుజరపడానికి బ్రిటన్, ఫ్రాన్స్, హాలండ్‌ల మధ్య సహకారం సాధించడానికీ కృషి జరుగుతుంది.

ఈకృషికే ఫిలిప్పైన్స్ సమావేశం సిడ్నీ సమావేశం జరుగనున్నాయి. అగ్రరాజ్యత్రయవిదేశాంగమంత్రుల లండన్

నేటి ప్రపంచం

(7 వ-పేజీ తరువాయి)

నిజాన్ని నిరోధించాలి" అని వారు ఉపన్యాసాలు దంచారు. అదే అంతర్జాతీయ సమావేశాలలో అయితే "మూడో యుద్ధం సంభవించదు. కమ్యూనిస్టురాజ్యాలతో స్నేహంచేసి సహకరించడం అసాధ్యం కాదు. కాని మన మటుకు మనం తయారీలో ఉండాలి" అనేవారు.

ప్రపంచప్రజారోగ్య సంస్థ తృతీయ వార్షికసమావేశానికి పోగా మిగిలిన కమ్యూనిస్టుదేశాలు కూడా స్వస్తి చెప్పాయి. ఈ వార్షికసమావేశం జెనీవాలో మే రెండో వారంలో జరిగినప్పుడు భారతప్రభుత్వప్రతినిధి రాజకుమారి అమృతకార్ సంస్థ అధ్యక్షపదవికి ఎన్నుకోబడ్డారు. ఈసంస్థనిధి ప్రజారోగ్యాభివృద్ధికార్యక్రమాలకు బొత్తిగా చాలనందువల్ల ప్రత్యేకస్టాంపులు అచ్చువేసి అన్నిదేశాలలోనూ అమ్మించి ధనం చేర్చాలని ఆమె సూచించారు.

సమావేశంలో జర్మనీసమస్యతో పాటు ఈవిషయం చర్చకు వచ్చి నిర్ణయాలు జరుగనున్నాయి. ఈసమావేశాలన్నిటికీ ఫలితంగా మార్షల్ ప్రణాళికనిమిత్తం యూరోపియన్ ఆర్థిక సహకారసాధకసంస్థ (ఆర్గనైజేషన్ ఫర్ యూరోపియన్ ఎకనమిక్ కో ఆపరేషన్) స్థాపించబడినట్లే సిడ్నీ సమావేశానంతరం ఒక సంస్థను స్థాపించడానికి యత్నాలు జరుగుతున్నాయి. అయితే భారతదేశతటస్థవిధానందృష్ట్యా ఈ కృషి ఎంతవరకూ ఫలించగలదో అప్పుడే చెప్పడం కష్టం. కాని ఇదే సాధించబడినట్లయితే, ప్రపంచపరివ్యాప్తమైన కమ్యూనిస్టు నిరోధక ప్రణాళికను ఏఛీసన్ సృష్టించగలిగినవాడౌతాడు. అంటే ప్రపంచంలో ఏ దేశాన్నీ విడువకుండా అన్నిటినీ రష్యాకర్థంతో రాబోయే యుద్ధంలోకి దించుతున్నారన్న మాటే.

అందువల్ల ఏఛీసన్ తలపెట్టిన "సమగ్రరాజ్యతంత్రం" సాధ్యపడితే మూడో ప్రపంచయుద్ధం ఆసన్నమైనట్లే భావించాలి. ఈ ప్రపంచయుద్ధాన్ని ఏఛీసన్ సులువుగా విక్రయించగలడో, రష్యా భగ్నపరచగలదో కాలమే నిర్ణయించగలదు.

ఇండొనీషియా *

తూర్పు ఇండొనీషియాలో స్వతంత్రరిపబ్లిక్ ప్రకటించిన అంబన్ తిరుగుబాటుదార్లను అణచడానికిగాను ఇండొనీషియా దేశరక్షణశాఖామంత్రి జోగ్జకర్తా సుల్తాన్ మెకస్సార్ వెళ్లాడు. డచ్చివారి అధీనంలో ఉన్న ఈ తిరుగుబాటుదార్లను అదుపులోకి తీసుకరావడానికి డచ్చిఅధికారులు యత్నిస్తున్నారు. అనేకసంవత్సరాలుగా డచ్చివారిపట్ల భక్తికలిగి ఉండి వారిఅండనున్న తూర్పు ఇండొనీషియన్ సైనికులకైక్రి స్తవమతస్థులు. బర్మాలో కరెన్లమాదిరిగానే, వీరికికూడా పాశ్చాత్యపాలకులక్రింద బానిసత్వంపట్ల ప్రీతి అధికం. జాతీయోద్యమాలపట్ల విముఖత కలవారు, అవసరమైనప్పుడు డచ్చికుట్రదారులకు సహాయపడుతుంటారు. తిరుగుబాటు మాని బారక్సులోనే ఒదిగిఉండాలని డచ్చిమిలిటరీఅధికారులు వారికి ఆదేశమిచ్చారు. కాని వారు ఈ ఆదేశాన్ని పాటించలేదు. డచ్చిపాలకులరహస్యప్రోద్బలం తొలగిపోగానే ఇండొనీషియాలోని ఇతరతిరుగుబాట్లవలెనే ఇదికూడా క్షణంలో అంతరించగలదు.


దక్షిణాఫ్రికా *


దక్షిణాఫ్రికాలో యూరోపియన్లకు ఒకప్రాంతం, ఆఫ్రికన్లకు ఒకప్రాంతం, తదితరులకు ఒకప్రాంతం అని విడివిడిగా నివాసాలు ఏర్పాటుచేసుకోవాలని నిర్బంధించే ఒక శాసనాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భారతపాకిస్తాన్ప్రభుత్వప్రతినిధులతో జరపదల్చిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగేవరకైనా ఈ శాసనాన్ని ప్రవేశపెట్టవద్దని ఆఫ్రికాలోని జాతీయసంస్థలు కోరాయి. కాని ప్రభుత్వం పెడచెవిని పెట్టింది. ఈ శాసనవివరాలు తెలపవలసిందని భారత పాకిస్తాన్ప్రభుత్వాలు దక్షిణాఫ్రికాప్రభుత్వాన్ని కోరాయి. కాని వీరికోరికను మలాన్ప్రభుత్వం పాటించే అవకాశం అట్టే కనిపించదు.

హాంకాంగ్ విమానాలు:

బ్రిటన్ కమ్యూనిస్టు చీనాలకు మధ్య రాయబార సంబంధాలు ఇంతవరకూ ఏర్పడకపోవడానికి హాంకాంగ్‌లో కల 71 విమానాలనుగురించిన తగాదాయే హేతువని ఈమధ్య బ్రిటిష్ ప్రభుత్వప్రతినిధి ఒకరు చెప్పారు. చీనా చియాంగ్‌కై షేక్ పరిపాలనలో ఉండగా రెండు అమెరికన్ వ్యాపారసంస్థలు విమానయానానికి హక్కులు తీసుకున్నారు. ఒక సంస్థకు అధిపతి పూర్వఅమెరికన్ సైనికోద్యోగి జనరల్ క్లేర్ చెనాల్ట్. కాంటన్‌నగరం కమ్యూనిస్టులవశం కానున్న సమయంలో ఈ రెండు కంపెనీల ఉద్యోగులూ కమ్యూనిస్టుప్రభుత్వపక్షానికి తిరిగిపోయినారు. వారి 71 విమానాలనూ కమ్యూనిస్టుచీనాకు తరలించవలసిన అగత్యం కలిగింది. కాని అవి తమకే చెందినవని అమెరికన్‌కంపెనీలు వాదిస్తున్నాయి. అవి హాంకాంగ్‌లో ఉన్నాయి. వానిని తమకొప్పగించాలని అమెరికన్ కంపెనీలు హాంకాంగ్‌లోని బ్రిటిష్‌ప్రభుత్వాన్ని కోరాయి. ఈ విషయమై రిసీవర్‌ను నియమించలేదని ఆరోపిస్తూ బ్రిటిష్‌పాలకులపైన హాంకాంగ్ కోర్టులో వారు కేసు పెట్టారు. విమానాలు కమ్యూనిస్టుప్రభుత్వానికే చెందుతాయని కోర్టు తీర్పు చెప్పింది. దీనిపైన అమెరికన్‌కంపెనీలు హాంకాంగ్ హైకోర్టులో అప్పీల్ చేశాయి. ఇప్పుడు హైకోర్టుకూడా విమానాలు కమ్యూనిస్టులకే చెందాలని నిర్ణయించింది. ఇకనైనా రెండు మూడు రోజుల్లో అమెరికన్‌కంపెనీలు ఈ తీర్పును రద్దుపరచాలని లండన్‌లోని ప్రీవీకౌన్సిల్‌కు అప్పీలు చెయ్యకపోయినట్లయితే, విమానాలు పెకింగ్‌కి పంపబడగలవు.

[సూర్యనారాయణ]






కృష్ణా - పెన్నార్ ప్రాజెక్టు


…పు పై చిత్రం : …లకరం వద్ద పెన్నార్ నదీగర్భం—ఇక్కడ రెండు మైళ్ల పడల్పు చెలియలికట్ట వేస్తారు.


…వైపు పై చిత్రం : గండికోటలో యాలో జరుగవలసిన నిర్మాణానికి సూచన.

…: సోమేశ్వరం ఆనకట్ట నిర్మాణానికి సూచన.

…చిత్రాలు : యంత్రసహాయంతో జరుగుతున్న పరిశోధనలు)







Regd. No. M. 4479

శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు

ఐదవ ముద్రణము

సంస్కృతమూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు

వెల రు 4-0-0 లు.

తపాలాఖర్చు రు. 0-9-0.





గాంధీమహాత్ముని

ఆత్మకథ

ప్రథమ, ద్వితీయ సంపుటములు

[చతుర్థ ముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ఖద్దరు బైండు

ప్రతి సంపుటము పోస్టేజితో సహా వెల రూ. **5-9-0**

ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో రు. **10-12-0**

ఆంధ్రగ్రంథమాల, పోస్టుబాక్సు 212, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras.